www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 9-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 265
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 10.26 తదుపరి చతుర్దశి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.12 తదుపరి మూల; వర్జ్యం: తె. 4.41-6.11; దుర్ముహూర్తం: ఉ. 9.04-9.48, రా. 10.09-10.59; అమృతఘడియలు: మ. 12.43-2.15; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.53
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మాల్దీవుల టూరిజం
మటాష్..!

భారత్ కన్నెర్ర చేస్తే జరిగేదిదే.. ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'
సెలెబ్రిటీలు, సామాన్యుల నిరసన.. హోటళ్లు, విమాన టికెట్ల రద్దు
విమాన బుకింగ్స్ నిలిపేసిన ఈజ్‌మైట్రిప్
ఆ దేశ మంత్రుల అనుచిత వ్యాఖ్యలతో భారత్‌లో ఆగ్రహావేశాలు
లక్షద్వీప్‌పై పెరిగిన ఆసక్తి.. ఊపందుకున్న 'చలో లక్షద్వీప్'
2

భారత్- మాల్దీవుల మధ్య దౌత్య యుద్ధం!
ఢిల్లీలోని మాల్దీవుల హైకమిషన్‌కు సమన్లు
మోదీపై వ్యాఖ్యల పట్ల వివరణ కోరిన ఎంఈఏ.. ఆ వెంటనే మాల్దీవుల్లోని మన రాయబారితో అక్కడి విదేశాంగ శాఖ భేటీ.. ప్రభుత్వ అభిప్రాయం కాదని వెల్లడి

యాంటికబ్బా.. బీజేపీ వాళ్లకు డౌట్ వస్తది!

పెళ్లి కార్డు ఇవ్వడానికి షర్మిల రాకపై జగన్ వ్యాఖ్యలు!
ఆమె వస్తానంటున్నారని తెలిపిన సీఎంవో అధికారి
'ఇప్పుడెందుకులే' అన్న సీఎం స్పందనతో షాక్
అక్కడున్న నేతలూ అవాక్కు



జగన్ కలవకపోతే సెక్యూరిటీకి శుభలేఖ ఇచ్చి వెళ్లాలని షర్మిల నిర్ణయం
దీంతో అయిష్టంగానే మర్నాడు చెల్లిని కలిసిన జగన్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'సార్.. షర్మిల గారు అబ్బాయి పెళ్లి కార్డు ఇవ్వడానికి మిమ్మల్ని కలవాలంటున్నారు.' 'ఇప్పుడు యాంటికబ్బా.. ఆమె పొయ్యి కాంగ్రెస్ పార్టీలో చేరే.. ఆమొచ్చి కలిస్తే మళ్లీ బీజేపీ వాళ్లు నా మీద డౌట్ పడతారు.. మళ్లా ఎప్పుడైనా చూద్దాంలే'...ఇదీ మొన్నటికి మొన్న జగన్ ఇంట్లో జరిగిన ఓ సంభాషణ సారాంశం. తోడబుట్టిన చెల్లెల్ని ఇంట్లోకి అనుమతించేందుకు అన్న ఇంతగా భయపడతాడా.? అంటూ ఈ విషయం తెలిసిన రాజకీయ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ మొండి వ్యక్తిగా పేరున్న జగన్ లాంటి వ్యక్తికి లోపల ఇంత భయముందా? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. వైఎస్ కుమారుడు జగన్, కుమార్తె షర్మిల చెరో తెలుగు రాష్ట్రంలో ఉంటున్నారు. ఆస్తుల పంపకం, పదవుల కేటాయింపు విషయంలో తేడాలు రావడంతో కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. ఇడుపులపాయలో తండ్రి సమాధి వద్ద నివాళులర్పించే సమయంలోనూ ఎవరికివారే అన్నట్లు
మిగతా 11వ పేజీలో...



వైసీపీలో రచ్చ రచ్చ

టికెట్ల కాకతో తిరుగు'పోట్లు'.. జగన్ అండ్ కో బుజ్జగింపులు

నరసరావుపేట, పెనమలూరుపై ఎడతెగని పంచాయితీ
సీఎం చెప్పినా గోపిరెడ్డిని ఓడిస్తాం
నరసరావుపేటలో బ్రహ్మారెడ్డి వర్గం వార్నింగ్
విజయసాయిరెడ్డి రాజీ యత్నాలు విఫలం
మచిలీపట్నం ఎంపీగా పోటీచేయాలని కొలుసు పార్థసారథిపై ఒత్తిడి
ససేమిరా అన్న పెనమలూరు ఎమ్మెల్యే
టీడీపీలోకి వెళ్తారన్న ప్రచారంతో వణుకు
మరో ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేల మార్పు
నందిగామలో మహిళకు అవకాశం?
గూడూరు, పామర్రు ఎమ్మెల్యేలకు, దేవదాయ మంత్రి కొట్టుకు మొండిచేయి?
నందికొట్కూరుకు లబ్బి వెంకటస్వామి?
వెలంపల్లిని మళ్లీ మార్చే యోచన
పలువురు సిట్టింగ్‌లకు 'ప్యాలెస్' పిలుపు
అధిష్ఠానం తీరుపై పలువురి ఆక్రోశం
ఎస్సీ స్థానాలపై చిన్న చూపు చూస్తున్నారని ఎమ్మెల్యే పద్మావతి ధ్వజం

సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు సీఎం జగన్మోహన్‌రెడ్డికి, వైసీపీ పెద్దలకు ఎక్కడా లేని తలనొప్పులు తెచ్చిపెడుతోంది. సర్వేల బూచి చూపి పోటీ నుంచి తప్పించాలన్న ఎత్తుగడలు ఫలించడం లేదు. స్వచ్ఛందంగా ఎన్నికల నుంచి వైదొలిగేందుకు పలువురు ఎమ్మెల్యేలు ససేమిరా అంటున్నారు. అసంతుష్ట నేతలను బుజ్జగించడానికి సోమవారం జగన్ అండ్ కో శతవిధాలుగా ప్రయత్నించి విఫలమైంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట అసెంబ్లీ టికెట్, కృష్ణా జిల్లా పెనమలూరు అసెంబ్లీ స్థానం, మచిలీపట్నం ఎంపీ సీటు వ్యవహారం రసకందాయంలో పడింది. నరసరావుపేటలో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికే సీఎం టికెట్ ఖరారు చేయడంతో ఆయన ప్రత్యర్థి గజ్జల బ్రహ్మారెడ్డి వర్గం కస్సుమంది. జగన్ స్వయంగా చెప్పినా గోపిరెడ్డిని ఓడించి తీరతామని హెచ్చరిస్తోంది. పెనమలూరు నుంచి మచిలీపట్నం లోక్‌సభకు పోటీచేసేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కూడా ససేమిరా అన్నారు. ఆయనతోపాటు పామర్రు, అవనిగడ్డ
మిగతా 11వ పేజీలో...

40 'చానళ్లు'.. 200 ఇన్‌స్టా పేజీలు!
విపక్షంపై మహా 'నీలి' యుద్ధం.. వైసీపీ కార్ఖానా నుంచే కంటెంట్
పేటీఎం బ్యాచ్‌తో విష ప్రచారం.. బాబు, లోకేశ్, పవన్‌లే టార్గెట్
మాజీ జర్నలిస్టులు నడిపే యూట్యూబ్ చానళ్లతో డీల్ 12
వాటికి కంటెంట్ మనమే ఇస్తున్నాం.. బయటపెట్టిన భార్గవరెడ్డి!

ఐఏఎస్సా.. వైసీపీ బాసా?
అక్కడ సర్వం ధనుంజయరెడ్డే!



నేతలంతా ఆయనను కలవాల్సిందే
సర్వే ఆధారంగా అక్కడికక్కడే తీర్పు
తాడేపల్లిలో జగన్ దర్శనం కాదు
కలిసినవారికీ 'అన్న' వద్దకే వెళ్లాలని సూచన
ఇన్‌చార్జులపై జగన్ కసరత్తు ఉత్తుత్తిదే
వైసీపీ నేతల్లో గుసగుసలు .. అసహనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
సీఎంవో ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డి ఐఏఎస్ అధికారి. కానీ, ఆయన ఇప్పుడు అంతకు మించి... అన్నట్టు వైసీపీ సేవలో తరిస్తున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలే చెబుతున్నారు. వైసీపీ సుప్రీంలా మారారని కూడా అంటున్నారు. నియోజకవర్గాల
మిగతా 11వ పేజీలో...



సోమవారం విజయవాడలో కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించిన మునిసిపల్ మహిళా కార్మికులను ఈడ్చిపారేస్తున్న పోలీసులు

తాడో పేడో!
జగమొండి సర్కార్‌తో ఢీ అంటే ఢీ

వెనక్కి తగ్గేదేలేదంటున్న అంగన్వాడీలు
ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్
మంత్రి బొత్స, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిల అడ్డగింత
ఎస్మా జీవో కాపీలను దహనం చేసి నిరసన
9న జైల్ భరో నిర్వహిస్తాం: కార్మిక సంఘాలు

అంగన్వాడీల మెడపై కత్తి!
వేటుకు రంగం సిద్ధం.. షోకాజ్ నోటీసులు జారీ
పది రోజుల్లో జవాబివ్వకుంటే తొలగింపు హెచ్చరిక
కలెక్టర్లకు మహిళా శిశు సంక్షేమ శాఖ మెమో

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)
జగన్ సర్కార్ ఎన్ని బెదిరింపులకు దిగినా అంగన్వాడీలు వెనుకంజ వేయడం లేదు. ఎస్మా ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. షోకాజ్ నోటీసులిచ్చినా మడమతిప్పేది లేదంటున్నారు. ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చేదాకా విశ్రమించేదేలేదంటూ తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. ఎస్మా ప్రభుత్వ ఉద్యోగులకు
మిగతా 12వ పేజీలో...

పారిశుధ్య కార్మికులపై పైశాచికత్వం
ఆందోళనకారులను ఈడ్చేసిన పోలీసులు
విజయవాడలో కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

రెమిషన్ హక్కు గుజరాత్ సర్కారుకు లేదని స్పష్టీకరణ
ఒక దోషితో కుమ్మక్కై వ్యవహరించిందని ఆక్షేపణ
దోషులంతా 2 వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
2022లో ఒక దోషి సుప్రీంకోర్టును మోసగించి, పొందిన అనుకూల ఉత్తర్వులు చెల్లవని వెల్లడి



అలా ఎలా వదిలేస్తారు?

బిల్కిస్‌బానో కేసులో దోషులకు గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన రెమిషన్‌ను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు

న్యూఢిల్లీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బిల్కిస్‌బానో రేప్ కేసులో శిక్ష పడ్డ 11 మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన రెమిషన్(శిక్షాకాలం తగ్గింపు)ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దోషులంతా రెండు వారాల్లోగా సంబంధిత జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది. వారిని తిరిగి జైలుకు పంపాలని గుజరాత్ సర్కారును ఆదేశించింది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగి, వారికి శిక్ష కూడా అక్కడే పడ్డందున.. దోషులకు రెమిషన్ మంజూరు చేసే హక్కు గుజరాత్ సర్కారుకు లేదని స్పష్టం చేసింది. తనకు లేని అధికారాన్ని గుజరాత్ ప్రభుత్వం (మహారాష్ట్ర సర్కారు నుంచి) చేజిక్కించుకుని, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆక్షేపించింది. ఈ కేసులో దోషి అయిన రాధేశ్యామ్ షా 2022లో సుప్రీంకోర్టును మోసగించడం, వాస్తవాలను తప్పుగా చూపించడం, దాచడం ద్వారా తనకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నాడని
మిగతా 2వ పేజీలో...

'నేరస్థుల రక్షకుడు' ఎవరో మళ్లీ తెలిసింది
బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పుపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు
ఈ తీర్పుతో న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత బలపడింది: ప్రియాంక
తీర్పును స్వాగతించిన సీపీఎం, టీఎంసీ
బిల్కిస్ బానో బంధువుల సంబరాలు

పైకి సౌమ్యంగా కనిపిస్తారు కానీ అక్రమాల్లో ఘనాపాటి. ఇసుక అక్రమ దందాలో మేరు శిఖరం లాంటి వారు. సదరు మంత్రి ఇసుక పేరిట ఇష్టారాజ్యంగా నదులు, లంకలను తవ్వించేశారు. చాలదన్నట్టు పొరుగు నియోజకవర్గంలోనూ పాగా వేశారు. తమ ధనదాహానికి పంట పొలాలను కూడా వదల్లేదు. భారీ గోతులు పడేలా ఇసుకను తవ్వించారు. ఒక్క ఇసుకలోనే రూ.70 కోట్లకు పైగా వెనకేసినట్టు సమాచారం. తన అక్రమాలకు అడ్డు చెప్పిన కలెక్టర్‌ను బదిలీ చేయించినట్టు ఆరోపణలున్నాయి.

ఇసుకమేతలో మేరునగధీరుడు!

ఇసుకలోనే 70 కోట్లకు పైగా దోపిడీ
పంట పొలాలనూ వదలని వైనం
పక్క నియోజకవర్గాల్లోనూ తవ్వకాలు
అడ్డు చెప్పిన కలెక్టర్‌పై బదిలీ వేటు
జగనన్న కాలనీల చదును పేరిటా దోపిడీ
బెదిరింపులు, దౌర్జన్యాలకు లెక్కే లేదు
ప్రశ్నిస్తే ఎదురుదాడి, పోలీసు కేసులు
మంత్రి పదవి అడ్డుపెట్టుకుని అక్రమాలు
స్థానికంగా వ్యతిరేకత పెరగడంతో పట్టుబట్టి వేరే నియోజకవర్గానికి జంప్

అమ్మో ఎమ్మెల్యే
కృష్ణా తీరంలో అక్రమాల దందా

కృష్ణా తీర ప్రాంతానికి చెందిన సదరు ప్రజాప్రతినిధికి ఇసుక ఒక్కటే ఆదాయ వనరు కాదు.. జగనన్న కాలనీల చదును పేరిటా దోచేశారు. భూ ఆక్రమణలు, బెదిరింపులు, దౌర్జన్యాలపై లెక్కలేనన్ని ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే వేధింపులు, కేసులు తప్పవు. నియోజకవర్గంలో తనపై తీవ్ర వ్యతిరేకత పెరగడంతో మంత్రే స్వయంగా పట్టుబట్టి వేరే నియోజకవర్గానికి 'బదిలీ' చేయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.



(బాపట్ల-ఆంధ్రజ్యోతి)
అధికారం అండగా ఉంది.. మంత్రి పదవి కూడా వచ్చింది.. ఇక ఆపేదెవరు..? నిబంధనలతో పనేంటి..? దోపిడీయే పరమావధి అన్నట్టుగా రెచ్చిపోయారు. నాలుగున్నరేళ్లుగా కోట్లు దండుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఓ అధికార పార్టీ నేత నిర్వాకం ఇది! నదులు, లంకలు వేటినీ వదిలిపెట్టకుండా, రాత్రీ పగలూ
మిగతా 12వ పేజీలో...

జగనన్న సర్వేతో కొత్త చిక్కులు
తప్పుల తడకగా పాస్‌పుస్తకాలు.. భూమి లేకున్నా ఉన్నట్టు జారీ
రీసర్వే తర్వాత ఇచ్చే యూఎల్‌పీఐఎన్ ఎల్‌పీఎం, ఖాతా నంబర్లతో సమస్యలు
ముందుగా అంచనా వేయని సర్వే శాఖ.. గ్రామాల్లో రైతుల మధ్య తకరారు
సబ్ డివిజన్ జరగక రిజిస్ట్రేషన్లు బంద్.. ఆగిపోయిన మ్యుటేషన్లు
ముఖం చాటేసిన సర్వే శాఖ అధికారి 2

ఇంత మొక్కుబడి జవాబా?
సీఈవో మీనా వైఖరిపై టీడీపీ అసంతృప్తి.. టీచర్లను విధుల్లోకి తీసుకుంటారా లేదా?
సచివాలయాల సిబ్బందిని దూరం పెట్టరా?.. స్పష్టంగా చెప్పని ఎన్నికల ప్రధానాధికారి
వైసీపీ కరపత్రాలు పంచుతున్న వారికి ఎన్నికల విధులు ఎలా అప్పగిస్తారు?
వైసీపీ అధికార దుర్వినియోగంపై చర్యలేవీ?.. టీడీపీ నేతల ఆక్షేపణ
నేడు కేంద్ర ఎన్నికల కమిషనర్లను కలవనున్న చంద్రబాబు, పవన్ 11



మాల్దీవుల టూరిజం మటాష్!

భారత్‌లో ఊపందుకున్న 'చలో లక్షద్వీప్' ఉద్యమం

ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'.. హోటల్ బుకింగ్స్, విమాన టికెట్లు రద్దు

ఆ దేశ మంత్రుల అనుచిత వ్యాఖ్యలతో భారత్‌లో తీవ్రమవుతున్న ఆగ్రహావేశాలు

నీలి రంగులో మెరిసిపోయే సముద్రపు సోయగాలు.. తెల్లటి ఇసుక తిన్నెలు.. ఆహ్లాదాన్నిచ్చే ప్రకృతి అందాలు.. వెరసి మాల్దీవులు..! హాలిడేస్‌లో జీవితాన్ని సరదాగా గడపడానికి అందరూ ఎంచుకునే అందమైన పర్యాటక ప్రాంతం. భారతీయులు ఎక్కువగా ఇష్టపడే హాలిడే స్పాట్..! అయితే ఇదంతా ఇక గతం..! ప్రధాని మోదీపై మాల్దీవులకు చెందిన ముగ్గురు మంత్రులు మరియం షియూనా, మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్.. చేసిన అనుచిత వ్యాఖ్యల అనంతరం పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆ వ్యాఖ్యలపై ఆగ్రహావేశాలతో ఉన్న భారతీయులంతా ఇప్పుడు మాల్దీవులను బహిష్కరిస్తున్నారు. బాలీవుడ్ సెలెబ్రిటీల నుంచి బడాబడా వ్యాపారులు, సాధారణ పర్యాటకుల వరకూ అందరూ 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'కు మద్దతు తెలుపుతున్నారు. గతవారం లక్షద్వీప్‌లో పర్యటించిన ప్రధాని మోదీ బీచ్‌లను సందర్శించి అక్కడ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చిన తర్వాత ఈ రగడ మొదలైంది. మాల్దీవుల మంత్రులు భారత్‌కు వ్యతిరేకంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. మోదీని విదూషకుడిగా.. ఇజ్రాయెల్ చేతిలో కీలుబొమ్మగా అభివర్ణించారు. దీనిపై దుమారం రేగడంతో మాల్దీవుల ప్రభుత్వం ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసింది. అయినప్పటికీ భారతీయుల ఆగ్రహం చల్లారలేదు. చాలామంది ఈ ద్వీపదేశానికి వెళ్లాల్సి ఉన్న తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. గతేడాది ప్రపంచవ్యాప్తంగా మొత్తం 17,57,939 మంది పర్యాటకులు మాల్దీవులకు వెళ్లారు. ఇందులో 2,09,198లక్షల మందితో భారత్ టాప్‌లో ఉండగా.. రష్యా (2,09,146), చైనా (1,87,118) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మాల్దీవుల ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగమే కీలకం. కాబట్టి ఇప్పుడు భారతీయులు దీన్ని బహిష్కరిస్తే ఆ దేశ ఆర్థిక రంగానికి కోలుకోలేని దెబ్బేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

8వేల హోటల్ బుకింగ్స్ రద్దు..!

భారత్‌లోని సోషల్ మీడియాలో ఇప్పుడు 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అనే హ్యాష్‌ట్యాగ్ తెగ ట్రెండ్ అవుతోంది. అయితే ఆ దేశంపై ఆగ్రహావేశాలు కేవలం సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కాలేదు. వేలాది మంది భారతీయులు ఇప్పటికే వచ్చే సెలవుల్లో అక్కడికి వెళ్లేందుకు బుక్ చేసుకున్న విమాన టికెట్లు, హోటల్ రూమ్‌లను రద్దు చేసుకుంటున్నారు. వివాదం నేపథ్యంలో ఇప్పటి వరకూ దాదాపు 8000 హోటల్ బుకింగ్స్, 2,500 విమాన టికెట్లను భారతీయులు రద్దు చేసుకున్నారు. కాగా, ప్రధాని మోదీ పర్యటన తర్వాత భారత్‌లోని ఒక చిన్న కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌పై ఆసక్తి పెరిగింది. అయితే.. మాల్దీవుల మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యల తర్వాత సామాజిక మాధ్యమాల్లో 'చలో లక్షద్వీప్' ఉద్యమం ఊపందుకుంది.

భారత్‌పై మాల్దీవులు ఎలా ఆధారపడుతోంది?

మాల్దీవుల్లో పర్యాటక పరిశ్రమకు మద్దతునిచ్చేందుకు ఈ దేశంలోని 34 ద్వీపాల్లో నీరు, పారిశుధ్యం వంటి మౌలికవసతుల ప్రాజెక్టుల్లో భారత్ భాగస్వామ్యమైందని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ పునర్నిర్మాణ ప్రాజెక్టు, గన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రీ డెవలప్‌మెంట్ వంటి ఎనిమిది ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. భారత్‌లోని లగ్జరీ హోటళ్లయిన తాజ్, ఒబెరాయ్ వంటి సంస్థలు కూడా ఇక్కడ తమ సేవలందిస్తున్నాయి. అలాగే ఇక్కడి పరిశ్రమల్లో మానవ వనరుల అవసరాన్ని కూడా భారత్ భర్తీ చేస్తోంది. ఈ దేశం పర్యాటకంతోపాటు వ్యవసాయం, చేపల వేటపై ఎక్కువగా ఆధారపడుతోంది. దీనికి 1974 నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐలాండ్ రిసార్ట్స్ అభివృద్ధి, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి, వివిధ వాణిజ్య వెంచర్ల కోసం రుణ సాయం అందిస్తోంది.

నష్ట నివారణ చర్యలు చేపట్టిందా..!

భారత్ అవసరం తమకు ఎంతగానో ఉందని ఆ దేశ నాయకులు గుర్తించారు. అందుకే జరగబోయే నష్టాన్ని గుర్తించి నష్ట నివారణ చర్యలకు దిగుతున్నారు. మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ మాట్లాడుతూ.. విదేశీ నేతలపై ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఏదేమైనప్పటికీ ఆయా వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమని, వాటితో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తమ దేశం తన భాగస్వాములందరితో ముఖ్యంగా పొరుగు దేశాలతో సానుకూలంగా ఉండేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

లక్షద్వీప్‌పై ఆసక్తి పెరిగింది: మేక్‌మైట్రిప్..

లక్షద్వీప్‌లో ప్రధాని మోదీ పర్యటన తర్వాత తమ ఆన్‌లైన్ వేదికలో ఈ దీవుల కోసం వెతికే వారి సంఖ్య 3,400 శాతం పెరిగిందని ప్రముఖ ఆన్‌లైన్ సంస్థ మేక్‌మై ట్రిప్ సోమవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. అద్భుతమైన ఈ బీచ్‌లను అన్వేషించేలా భారత పర్యాటకులను ప్రోత్సహించేందుకు త్వరలోనే సరికొత్త ఆఫర్లు, డిస్కౌంట్లు అందజేస్తామని ఆ సంస్థ ప్రకటించింది.. మరోవైపు, మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యల నేపథ్యంలో దేశీయ ప్రయాణ సంస్థ ఈజ్‌మైట్రిప్ ఆ దేశానికి విమాన టికెట్ల బుకింగ్‌ను నిలిపివేసింది. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నిషాంత్ పిట్టి ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. 2008లో ప్రారంభమైన ఈ సంస్థ ఢిల్లీ కేంద్రంగా సేవలందిస్తోంది. అలాగే ఇటీవల మోదీ పర్యటించిన లక్షద్వీప్‌ను ప్రమోట్ చేయడానికి ఈ సంస్థ ప్రత్యేక ఆఫర్లతో ముందుకొచ్చింది.

లక్షద్వీప్‌లో డీశాలినేషన్‌కు రెడీ: ఇజ్రాయెల్

ఒకపక్క భారత్-మాల్దీవుల మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో.. లక్షద్వీప్‌లో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. లక్షద్వీప్‌లో డీశాలినేషన్ (లవణ నిర్మూలన) కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. 'డీశాలినేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్న భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు మేం గతేడాది నుంచి లక్షద్వీప్‌లో ఉన్నాం. మంగళవారం నుంచే ఆ పనులు ప్రారంభిస్తున్నాం' అని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం అధికారిక ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. లక్షద్వీప్‌లోని కొన్ని బీచ్‌ల ఫొటోలు పంచుకుంటూ.. "సహజసిద్ధమైన, నీటి అడుగున ఉండే అందాలను ఇప్పటికీ చూడని వారికోసం కొన్ని చిత్రాలు ఇక్కడ ఉన్నాయి" అని ట్వీట్ చేసింది.

- సెంట్రల్ డెస్క్



అన్ని వేళలా అండగా ఉన్నా కూడా


2021లో ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ విజృంభిస్తున్న సమయంలో మాల్దీవులకు భారత్ వ్యాక్సిన్లు అందించింది. భారత్ నుంచి వ్యాక్సిన్లు పొందిన తొలి దేశం ఇదే కావడం గమనార్హం. వ్యాక్సిన్ల ఎగుమతి ఆంక్షలు, దేశీయ అవసరాలు ఉన్నప్పటికీ ఆ ఏడాది ఆ దేశానికి మూడు నెలల్లోనే 3 లక్షల డోసులు పంపించింది. ఇప్పుడే కాదు కొన్నేళ్లుగా భారత్ ఈ దేశానికి ఆపన్న హస్తం అందిస్తూనే ఉంది. కొవిడ్ సమయంలో వూహాన్ నుంచి మాల్దీవుల ప్రజలను తరలించడంలో సహాయం చేయడం.. మాలేకు వైద్య బృందాలను పంపడం.. హనిమధూ విమానాశ్రయ అభివృద్ధి.. ఇలా మాల్దీవులకు భారత్ చేసిన సహాయాల జాబితా చాలా పెద్దదే. అలాగే పలువురు మాల్దీవుల అధికారులు భారత్‌లోని వివిధ ఇనిస్టిట్యూట్‌లలో శిక్షణ పొందుతున్నారు.

భారత్-మాల్దీవ్స్ మధ్య దౌత్య యుద్ధం!

» ఢిల్లీలో మాల్దీవ్స్ హైకమిషన్‌కు సమన్లు

న్యూఢిల్లీ/మాలె, జనవరి 8: ప్రధాని మోదీపై మాల్దీవ్స్ మంత్రులు, ఎంపీ కామెంట్ చేయడంపై భారత్‌లోని ఆ దేశ హైకమిషనర్ ఇబ్రహీం షాహిబ్‌కు విదేశాంగ శాఖ(ఎంఈఏ) సోమవారం సమన్లు జారీ చేసింది. దాంతో ఆయన పార్లమెంట్ సౌత్‌బ్లాక్‌లోని ఎంఈఏ కార్యాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఎంఈఏ అధికారులు మాల్దీవ్స్ మంత్రుల వ్యాఖ్యలపై వివరణ కోరినట్లు తెలిసింది. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే.. మాల్దీవుల ఎంఈఏ అక్కడి భారత హైకమిషనర్ మును మహావర్‌ను పిలిపించి, భేటీ అయ్యింది. అయితే.. ఇది ముందస్తుగా నిర్ణయించిన సమావేశమని మాలెలోని భారత హైకమిషనర్ కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేయగా.. మాల్దీవుల మీడియా సంస్థలు మాత్రం మంత్రుల పోస్టులపై మాల్దీవ్స్ ఎంఈఏ వివరణ ఇచ్చినట్లు కథనాలను ప్రసారం చేశాయి. "మంత్రులు, ఎంపీ వ్యాఖ్యలు పూర్తిగా వారి వ్యక్తిగతం. ఆ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదు. భారత్‌తో ఎప్పటికీ స్నేహహస్తాన్ని కోరుకుంటాం" అని భారత హైకమిషనర్‌కు తెలిపినట్లు ఆ కథనాల్లో పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, భారత్‌తో దౌత్య సంబంధాలు దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమైన నేపథ్యంలో మాల్దీవుల అధ్యక్షుడు మయిజ్జు హడావుడిగా చైనా పర్యటనకు వెళ్లడం గమనార్హం. మాల్దీవులను సమానస్థాయి భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

లోకం తీరు



మదీనలో స్మృతి ఇరానీ!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ముస్లింలకు పవిత్రమైన మదీనలో పర్యటించి కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతి ఇరానీ సంచలనం సృష్టించారు. మదీన నగరంలో పర్యటించిన తొలి ముస్లిమేతర ప్రముఖురాలిగా ఆమె చరిత్రకెక్కారు. మదీనలో స్మృతి పర్యటించిన వీడియోలు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గామారడంతో సంప్రదాయక ముస్లిం వర్గాలు ఉలిక్కిపడ్డాయి. ఇది నమ్మలేని చాలామంది ఫోన్లు చేసి మరీ ఆరా తీశారు. హజ్ కోటాపై సౌదీ అరేబియాతో ఒప్పందం చేసుకోవడానికి స్మృతి ఇరానీ, విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.మురళీధరన్ రెండ్రోజుల పర్యటన నిమిత్తం సౌదీకి వచ్చారు. ఆదివారం సౌదీ అరేబియా హజ్ మంత్రితో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం సోమవారం స్మృతి తన అధికారిక బృందంతో కలిసి జెద్దా నుంచి రైలులో మదీనకు వెళ్లారు. అక్కడ మస్జీదే నబ్వీ సరిహద్దు ప్రహరీ గోడ వరకు వెళ్లిన ఆమె.. అనంతరం మస్జీదే ఖుబా, ఉహుద్ పర్వత ప్రాంతాన్ని కూడా సందర్శించారు. మదీనలోని భారత పర్యాటకులను కలసి యాత్రకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. 'ఇస్లాం ఆవిర్భవించిన ఈ ప్రాంతాన్ని సందర్శించడం చరిత్రాత్మకం. సౌదీ అధికారుల సాయంతో మదీనలోని పలు పవిత్ర స్థలాలను దర్శించుకున్నాం' అని 'ఎక్స్'లో పేర్కొంటూ పలు ఫొటోలను స్మృతి పోస్టు చేశారు. మదీనలో సాధారణంగా ముస్లింలకు మాత్రమే ప్రవేశముంటుంది కానీ గత కొంతకాలంగా ముస్లిమేతరులను కూడా అనుమతిస్తున్నారు. అయితే వీరు మస్జీదే నబ్వీ సరిహద్దు గోడ వరకు మాత్రమే వెళ్లవచ్చు.



'నేరస్థుల రక్షకుడు' ఎవరో మళ్లీ తెలిసింది

» బానో కేసులో సుప్రీం తీర్పుపై రాహుల్



న్యూఢిల్లీ, జనవరి8 (ఆంధ్రజ్యోతి): బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో 'నేరస్థుల రక్షకుడు' ఎవరో మరోసారి దేశానికి తెలిసిపోయిందని కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో లబ్ధి కోసం న్యాయాన్ని హత్య చేసే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు. బిల్కిస్‌బానో పోరాటం బీజేపీ ప్రభుత్వ అహంకారపూరిత విధానానికి వ్యతిరేకంగా సాధించిన విజయానికి చిహ్నమని రాహుల్ అన్నారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో బీజేపీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు సంబంధించిన ముసుగు తొలగిపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక అన్నారు. ఈ తీర్పుతో ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకం మరింత బలపడిందని తెలిపారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు ఎంతో బలమైనది, ధైర్యమైనదని బెంగాల్ సీఎం మమతాబెనర్జీ అన్నారు. సుప్రీంతీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గట్టి చెంప దెబ్బలాంటిదని సీపీఎం నేత బృందాకారాట్ చెప్పారు. "బిల్కిస్ బానోకు ఈ రోజు న్యాయం జరిగింది. సామూహిక అత్యాచారం కేసు సాక్షుల్లో నేనూ ఒకణ్ని. గుజరాత్ సర్కారు నిర్ణయాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు 11 మంది నిందితులు వెంట నే లొంగిపోవాలని ఆదేశించింది. మాకు ఈరోజు న్యా యం జరిగినట్లు భావిస్తున్నా" అని అబ్దుల్ రజాక్ మన్సూరి చెప్పారు.

అలా ఎలా వదిలేస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్న ధర్మాసనం.. 2022 మే 13న అతడి రెమిషన్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ గుజరాత్ సర్కారుకు అప్పట్లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. గత తీర్పులను పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చినందున కూడా ఆ తీర్పు చెల్లదని తేల్చిచెప్పింది. సదరు దోషితో కలిసి వ్యవహరించిందంటూ గుజరాత్ సర్కారుపై సుప్రీం ధర్మాసనం తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ కేసులో 11 మంది దోషుల శిక్షకాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ బిల్కిస్ బానో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరికొందరు కూడా ఈ కేసులో ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ కేసులపై ఆగస్టులో ప్రారంభించి 11 రోజులపాటు విచారణ జరిపి.. అక్టోబరు 12న తీర్పు రిజర్వు చేసింది. 251 పేజీల తీర్పును సోమవారం వెల్లడించింది. నేర శిక్షా స్మృతిలోని సెక్షన్ 432 ప్రకారం దోషులకు శిక్షకాలం తగ్గించడానికి గుజరాత్ ప్రభుత్వానికి అధికారం లేదని.. ఈ కేసు విచారణ మహారాష్ట్రలో జరిగింది కాబట్టి, శిక్షా కాలాన్ని తగ్గించాలనుకుంటే ఆ అధికారం మహారాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని ధర్మాసనం పేర్కొంది.

కేసు పూర్వాపరాలు..

2002లో గుజరాత్‌లో గోధ్రా రైలు దహనం అనంతరం ఆ రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు చెలరేగాయి. ఆ ఏడాది మార్చి 3న, ఐదు నెలల గర్భిణీగా ఉన్న బిల్కిస్ బానోపై కొంతమంది అత్యాచారం చేశారు. ఆమె మూడేళ్ల కూతురుతో సహా ఏడుగురు కుటుంబ సభ్యులను హత్యచేశారు. విచారణ అనంతరం ముంబై సెషన్స్ కోర్టు 2008లో.. 11 మందిని దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. 2017 మేలో బాంబే హైకోర్టు ఆ తీర్పును సమర్థించింది. 2019లో సుప్రీంకోర్టు సైతం.. బిల్కిస్‌బానోకు రూ.50 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు ఇవ్వాల్సిందిగా గుజరాత్ సర్కారును ఆదేశించింది. ఇదిలా ఉండగా.. దోషులలో ఒకరైన రాధేశ్యామ్ షా శిక్షకాలాన్ని తగ్గించాలన్న తన అభ్యర్థనను పరిశీలించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని 2019లో గుజరాత్ హైకోర్టుకు వెళ్లాడు. కానీ, ఆ హక్కు మహారాష్ట్ర సర్కారుకే ఉందంటూ హైకోర్టు అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. 2020లో మరోసారి అతడు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. రెండోసారీ అతడి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేదు. అనంతరం అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. కానీ.. తాను ఇదే అభ్యర్థనతో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని, కోర్టు రెండుసార్లు తిరస్కరించిన విషయాన్ని, రెమిషన్ కోరుతూ మహారాష్ట్ర సర్కారుకు దరఖాస్తు చేసుకున్న విషయాన్నీ సుప్రీం ధర్మాసనం వద్ద దాచాడు. సుప్రీం కోర్టు అతడి అభ్యర్థనను పరిశీలించి.. నేరం గుజరాత్‌లోనే జరిగింది కాబట్టి అతడి రెమిషన్ పిటిషన్‌ను పరిశీలించాల్సింది గుజరాత్ ప్రభుత్వమేనని అభిప్రాయపడింది. రాధేశ్యామ్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ 2022 మేలో గుజరాత్ సర్కారును ఆదేశించింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 15న అతడిని విడుదల చేసింది. రాధేశ్యామ్ షా విషయంలో సుప్రీం తీర్పు ఆధారంగా మిగతా దోషులను కూడా విడుదల చేసింది. ఆ నిర్ణయంపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా.. సుప్రీం తీర్పు వెలువడగానే బిల్కిస్‌బానో బంధువులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు.



బిల్కిస్ బానో కేసులో దోషులు జైలు నుంచి విడుదలైనప్పటి చిత్రం(ఫైల్)



'నేడు నాకు నిజంగా కొత్త సంవత్సరం వచ్చినట్లుంది. మనసు తేలికపడి, కన్నీళ్లు వచ్చేశాయి. ఏడాదిన్నర కాలంలో మొట్టమొదటిసారిగా మనసారా నవ్వగలిగాను. నా పిల్లల్ని హత్తుకోగలిగాను. నా గుండెలపై నుంచి కొండంత బండరాయిని తొలగించినట్లయింది. దీంతో హాయిగా ఊపిరి పీల్చుకోగలిగాను. న్యాయం అంటే ఇదీ. నాకూ, నా పిల్లలకు, మహిళలందరికీ న్యాయం చేసినందుకు, అందరికీ సమన్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగించినందుకు గౌరవనీయ భారత సుప్రీం కోర్టుకు కృతజ్ఞతలు'. - బిల్కిస్ బానో

దట్టంగా మంచు.. ఎడతెరిపిలేని వర్షం

తిరుమల కొండ జలమయం... ఇబ్బంది పడ్డ భక్తులు



తిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఒకవైపు దట్టమైన మంచు.. మరోవైపు ఎడతెరిపిలేని వర్షం... తిరుమల కొండను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఘాట్‌రోడ్లలో ముందు వెళుతున్న వాహనాలు, వ్యక్తులు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చలితీవ్రత కూడా పెరగడంతో భక్తులు పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఇక కొండపై సోమవారం వేకువజామున మొదలైన వర్షం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా దంచికొట్టింది. ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, రోడ్లు, పార్కులు జలమయమయ్యాయి.

'ఓపీఎస్'పై మరో దొంగాట!

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. దానిని అటకెక్కించిన జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులను తనవైపు తిప్పుకొనేందుకు.. మరో దొంగాటకు తెరదీసింది. సీపీఎస్ అమల్లోకి వచ్చిన 2004, సెప్టెంబరు 1వ తేదీ కంటే ముందే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై, దాని ద్వారా విధుల్లో చేరిన ఉద్యోగుల వివరాలు ఇవ్వాలంటూ అన్ని శాఖలను కోరింది. ఈ తరహా ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొస్తామంటూ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను ఊరిస్తోంది. కేంద్రం పరిధిలో ఉన్న ఈ తరహా ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రక్రియను గత ఏడాది మార్చిలోనే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా చర్యలు తీసుకోలేదు. కానీ, ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతుండడంతో శాఖలు, పోస్టుల వారీగా ఎంతమంది ఉద్యోగులు సీపీఎస్ అమలు కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం చేరారో వివరాలు చెప్పాలంటూ ఆర్థిక శాఖ సోమవారం అన్ని శాఖలకు మెమో జారీ చేసింది. ఏడాది నుంచి ఈ నిర్ణయాన్ని సాగదీస్తూ ఎన్నికల ముంగిట ఇప్పుడు తమను ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఉద్యోగులు మండిపడుతున్నారు. గతంలోనే తమ వివరాలను ఆర్థిక శాఖకు పంపామని, మళ్లీ ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు.

జగనన్న సర్వేతో కొత్త చిక్కులు

» తప్పుల తడకగా పాస్‌పుస్తకాలు

» భూమి లేకున్నా ఉన్నట్టు జారీ

» గ్రామాల్లో రైతుల మధ్య తకరారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగనన్న భూ సర్వేతో సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అడ్డగోలు సర్వేతో తప్పుల తడకగా పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్‌లు జరక్క, మ్యుటేషన్‌లు నిలిచి రైతులు అల్లాడిపోతున్నారు. భూమి విస్తీర్ణం, కొలతలు, సరిహద్దులు పాస్‌పుస్తకాల్లోనే కాదు, చివరకు యూఎల్‌పీఎన్, ఎల్‌పీఎం, ఖాతా నంబర్ల విషయంలోనూ రైతులను చిక్కులు వెంటాడుతున్నాయి. సర్వే సమస్యలపై స్పందించాల్సిన రాష్ట్రస్థాయి సర్వే అధికారి పత్తాలేరు. ముఖ్యమంత్రి జగన్ ముందు ఆనందర్భంగా భజనలు చేసే ఆ అధికారి.. రైతులు సమస్యల్లో ఉన్నప్పుడు స్పందించేందుకు ముఖం చాటేశారు. భూముల సర్వేలో యుఎల్‌పీఎన్ అనేది కీలకం. రీ సర్వే పూర్తయ్యాక భూమి కమతానికి ఇచ్చే 14 అంకెల కోడ్ (యూనిక్ ల్యాండ్ ఐడింటిఫికెషన్ నంబర్) ఇది. ఇందులోనే ఆ భూమి అక్షాంశ, రేఖాంశాలు, జిల్లా, మండల, గ్రామ కోడ్ ఉంటుంది. రీ సర్వే పూర్తయిన తర్వాత అనేక గ్రామాల్లో భూముల లావాదేవీలు జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా నారాయణవనం మండలంలో ఓ రైతుకు 2 ఎకరాల భూమికి యూఎల్‌పీఎన్ ఇచ్చారు. అతను ఆ భూమిని నలుగురు పిల్లలకు 50 సెంట్ల చొప్పున నాలుగు భాగాలుగా పంపిణీ చేశారు. ఆ భూమిని ఆ పిల్లలు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించగా తిరస్కరణకు గురైంది. ఇందుకు కారణం... ఆ భూమిని సబ్ డివిజన్ చేయలేదు. రిజిస్ట్రేషన్‌కు ముందే సర్వే సబ్ డివిజన్ తప్పనిసరి చేశారు. కాబట్టి ఆ భూమిని సర్వే చేసి నాలుగు విభాగాలకు వేర్వేరుగా యూఎల్‌పీఎన్‌లు ఇవ్వాలి. అయితే, ఆ భూమికి ఒకటే యూఎల్‌పీఎన్ ఉంది. సబ్ డివిజన్ చేయలేదు. దీంతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. ఇప్పుడు ఆ యజమాని లేరు. నెలన్నర క్రితమే మరణించారు. ఇప్పుడు ఆయన నలుగురు వారసుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇదే విషయాన్ని సర్వే శాఖ కమిషనరేట్‌కు పలుమార్లు నివేదించారు. త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఇటు అధికారులు, అటు బాధితులు వేడుకున్నా అక్కడి నుంచి స్పందనే రాలేదు. బాధితులు సర్వే కమిషనర్‌ను కలిసేందుకు విజయవాడలోని ఆయన కార్యాలయానికి వచ్చారు. మూడున్నర గంటలు నిరీక్షించేలా చేసి చివరకు 'సార్ బిజీ, మరోసారి రండి' అని వెనక్కి పంపించినట్లు బాధితులు చెబుతున్నారు. ఇదీ సర్వే అధికారి సత్వర స్పందన. ఇలా రాష్ట్రం అంతా సమస్యలున్నాయి. రీ సర్వే అనంతరం జరిగే భూముల సబ్ డివిజన్‌లకు విధిగా మరో ప్రత్యేక యూఎల్‌పీఎన్‌లు ఇవ్వాలి. అలా ఇచ్చే విధానంపై కసరత్తు చేయాలి. కానీ ఘనత వహించిన సర్వే శాఖ ఆ పని చేయడం లేదు. దీంతో రైతులకు, ప్రత్యేకించి వారసత్వ భూములన్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సీసీఎల్‌ఏ జోక్యం చేసుకొని సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తగువు పెట్టే పరిష్కారం

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్ పండ్లూరు గ్రామంలో ఓ రైతుకు 3.16 ఎకరాల భూమి ఉంది. ఇది రోడ్డు ఫేసింగ్‌లో ఉంది. ఈ భూమి వెనకాలే మరో మహిళా రైతుకు 10 సెంట్ల భూమి ఉంది. రీ సర్వే జరగకముందు ఆయా రైతుల పేరిట సరైన విస్తీర్ణం, సరిహద్దులతోనే పాస్‌పుస్తకాలు ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారం పేరిట ఎవరూ కోరుకోకపోయినా చేస్తున్న జగనన్న సర్వేలో ఈ భూమిని రీ సర్వే చేశారు. పాస్ పుస్తకాలు ఇచ్చారు. 3.16 సెంట్లు ఉన్న రైతుకు అంతే విస్తీర్ణంతో పాస్ పుస్తకం ఇచ్చారు. ఇంతకుముందు 10 సెంట్లు ఉన్న మహిళా రైతుకు 3.16 సెంట్లు ఉన్నట్లుగా జగనన్న బొమ్మలేసిన పాస్‌పుస్తకం ఇచ్చారు. ఇదెలా సాధ్యం? 10 సెంట్ల భూమి ఉన్న రైతుకు అదనంగా 3.06 సెంట్ల భూమి ఎక్కడి నుంచి వచ్చింది? జగనన్న రీ సర్వే కారణంగా అకారణంగా వచ్చిన ఆ భూమిని మహిళా రైతు అమ్ముకుంటే అసలు హక్కుదారు పరిస్థితి ఏమిటి? ఇదీ.. జగనన్న రీ సర్వే నిర్వాకం. ఇప్పుడు అసలు రైతు తన భూమిని కాపాడుకునేందుకు అప్పీల్ దాఖలు చేశారు. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇదీ జగనన్న చూపించిన పరిష్కారం.

భూమి ఖాతాలతో చిక్కులు

గ్రామంలో ఒక రైతుకు ఎన్ని సర్వే నంబర్ల పరిధిలో అయినా భూమి ఉండొచ్చు. కానీ ఖాతా నంబరు మాత్రం ఒకటే ఉండాలి. అయితే రీ సర్వే తర్వాత ఈ విధానం సరికొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం నిమ్మలపాడులో ఓ రైతుకు 4.23 ఎకరాల భూమి ఉంది. ఆ మొత్తం భూమిని తన వారసుడి పేరు మీద మ్యుటేషన్ చేయాలనుకున్నారు. 3 సర్వే నంబర్ల పరిధిలో ఆ భూమి ఉంది. రీ సర్వే తర్వాత భూమికి యూఎల్‌పీఎన్ ఇచ్చారు. అలాగే ఆ భూమికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఇచ్చారు. కుమారుడి పేరిట మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా 3 ఎకరాలున్న భూమిని ఒక ఖాతా కింద అనుమతించారు. మిగిలి రెండు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న 1.23 ఎకరాల భూమిని అదే ఖాతాలో కలిపేందుకు ప్రయత్నం చేయగా సాఫ్ట్‌వేర్ తిరస్కరిస్తోంది. ఎర్రర్ చూపిస్తూ, అప్పటికే ఆ ఖాతాను వినియోగించారనే మెసేజ్ ఇస్తోంది. దీంతో మ్యుటేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. సర్వే నంబర్లు ఎన్ని ఉన్నా ఒకే ఖాతా కింద చూపించడానికి మ్యుటేషన్ చేసే సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. ఇదే విషయమై సర్వే, రెవెన్యూ అధికారులకు నివేదికలు పంపించారు. గత మూడున్నర నెలలుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు.





వైసీపీ కార్యకర్తలకు వాటర్ బాటిళ్లను ఇస్తున్న విద్యార్థులు

మంత్రి పెద్దిరెడ్డి దర్బారులో కూలీలుగా విద్యార్థులు!

హిందూపురం, జనవరి 8: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనలో సేవలు అందించేందుకు బడి పిల్లలను వాడుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. సోమవారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం తూముకుంటలో వైసీపీ కార్యకర్తలతో మంత్రి సమావేశం నిర్వహించారు. అక్కడే వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాలు చేసే వారికి వాటర్ బాటిళ్లు అందించే పనిని సమీపంలోని పాఠశాల విద్యార్థులకు అప్పగించారు. విద్యార్థులు వాటర్ బాటిల్ బాక్స్‌లను మోసుకెళ్లి.. వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అందజేశారు. విద్యార్థులను పనికి పురమాయించిన ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న అప్పల నరసమ్మ

పింఛన్ల పంపిణీకి పిలిచి.. వైసీపీ కండువా కప్పారు

- టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలి ఆవేదన

మెంటాడ, జనవరి 8: పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పిలిచి, వైసీపీ కండువా కప్పి అవమానించారని టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు వాపోయారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఆండ్ర ఎంపీటీసీ సభ్యురాలు పి.అప్పలనరసమ్మ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. 'మెంటాడలో సమావేశం ఉందంటూ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. మంత్రులు బొత్స, రాజన్నదొర, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు వస్తున్నారని, మీరు వస్తే గౌరవంగా ఉంటుందని చెప్పారు. తన తండ్రి కృష్ణదొరకు పింఛను మంజూరయిందని కూడా చెప్పారు. తీరా అక్కడికి వెళ్లాక రాజన్నదొర, శ్రీనివాసరావు తన మెడలో వైసీపీ కండువా వేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇటీవల వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ టీడీపీలో చేరడం జీర్ణించుకోలేక ఈ కుట్ర పన్నారని ఆరోపించారు.

పెద్దిరెడ్డి 'పవర్'!

మంత్రి సమావేశానికి కార్మికులను పంపాలని పరిశ్రమలకు హుకుం

- ససేమిరా అన్న యజమానులు
- పరిశ్రమలకు విద్యుత్ ఆపేసిన అధికారులు
- చేసేదిలేక 3 బస్సుల్లో కార్మికుల తరలింపు



హిందూపురంలో మంత్రి పెద్దిరెడ్డి సమావేశానికి బస్సుల్లో కార్మికులను తరలిస్తున్న దృశ్యాలు

హిందూపురం, జనవరి 8: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన 'పవర్' చూపించారు. తన సభకు కార్మికులను పంపేది లేదన్న పరిశ్రమలపై ఆయన అధికారాన్ని ప్రయోగించి.. దారికి తెచ్చుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలంలోని తూముకుంట పారిశ్రామికవాడలోని పరిశ్రమలపైనే ఒత్తిళ్లు తెచ్చారు. మంత్రి పెద్దిరెడ్డి హిందూపురం మండలంలో నిర్వహిస్తున్న పంచాయతీ స్థాయి సమావేశాలకు జనం రాకపోవడంతో వైసీపీ నాయకులు పారిశ్రామిక వాడపై పడ్డారు. పరిశ్రమలకు సెలవు ప్రకటించి, మంత్రి సమావేశాలకు కార్మికులను పంపాలని హుకుం జారీ చేశారు. దీనికి పరిశ్రమల యజమానులు ససేమిరా అన్నారు. దీంతో పరిశ్రమల శాఖాధికారిపై వైసీపీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. అయితే, అవి ప్రైవేటు పరిశ్రమలని, తాను ఏమీ చేయలేనని చెప్పుకొచ్చారు. కానీ, తాము చెప్పినట్లు చేయకపోతే సస్పెండ్ చేయిస్తామని బెదిరించారు. ఇన్ని ప్రయత్నాలు చేసినా కార్మికులు రాకపోవడంతో ఏకంగా పరిశ్రమలకు విద్యుత్ కట్ చేశారు. చేసేదిలేక పరిశ్రమల యజమానులు.. మహిళా కార్మికులను ప్రత్యేక బస్సుల్లో మంత్రి పెద్దిరెడ్డి సమావేశాలకు పంపారు. మంత్రి కాన్వాయ్ వెంటే మహిళా కార్మికులు బస్సుల్లో పలు గ్రామ పంచాయతీలకు తిరిగి.. సమావేశాలకు హాజరయ్యారు. ఇలా సోమవారం రోజంతా మంత్రి వెంటే వారు వెళ్లాల్సి వచ్చింది. కాగా, వైసీపీ నాయకుల తీరుపై పరిశ్రమ వర్గాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

విధిలేక తరలింపు

హిందూపురం మండలం చౌళూరులో సోమవారం మంత్రి పెద్దిరెడ్డి సమావేశాలను ప్రారంభించారు. ఆ పంచాయతీలో కొంతమంది జనం వచ్చారు. పరిశ్రమలకు పవర్ కట్ చేయడంతో విధిలేని పరిస్థితుల్లో ఓ పరిశ్రమ నుంచి 3 బస్సుల్లో మహిళా కార్మికులను తూముకుంట, గోళ్లాపురం, సంతేబిదునూరు, కొటిపి పంచాయతీ సమావేశాలకు పంపించారు. బస్సుల్లో మహిళా కార్మికులను తరలిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

పంచాయతీలకు మంత్రి

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీలో తొలి నుంచీ విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఐదు నెలల క్రితం నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను తప్పించి, దీపికను వైసీపీ నియమించింది. అయితే, దీపికకు కూడా అసమ్మతి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో విభేదాలను పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి పెద్దిరెడ్డి నిర్ణయించారు. సమావేశాలకు జనం రారని ముందస్తుగా గ్రహించిన వైసీపీ నాయకులు.. హిందూపురం మండలంలోని తూముకుంట పారిశ్రామిక వాడలోని పరిశ్రమలపై కన్నేశారు. ఓ పరిశ్రమకు వెళ్లి మంత్రి సమావేశానికి కార్మికులను తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఆదివారం పరిశ్రమల యాజమానులను కలిసి.. మంత్రి వస్తున్నారని, కార్మికులను పంపించాలని వైసీపీ నాయకులు హుకుం జారీ చేశారు. దీనికి యాజమాన్యం ససేమిరా అంది. దీంతో సంబంధిత శాఖకు చెందిన ఓ జిల్లా స్థాయి అధికారికి వైసీపీ ముఖ్య నేతలు ఫోన్‌చేసి, మహిళా కార్మికులను పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. అది ప్రైవేటు పరిశ్రమ కాబట్టి వారిపై తమ అజమాయిషీ ఉండదని ఆ అధికారి తేల్చిచెప్పారు. అయినా నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆయన స్పందించారు.



పవర్ కట్ చేయడంతో నిర్మానుష్యంగా ఉన్న పరిశ్రమ

ఇలాంటి ప్రభుత్వం ఎక్కడా లేదేమో!

కార్మికులను పంపాలని పరిశ్రమ యజమానులకు జిల్లాస్థాయి అధికారి, వైసీపీ నాయకులు హుకుం జారీ చేసినా వారు ఖాతరు చేయలేదు. కార్మికులను పంపలేదు. దీంతో ఉన్నట్టుండి పారిశ్రామిక వాడకు పవర్ కట్ చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని యజమానుల గ్రూపులో ఆ శాఖ ఉద్యోగి మెసేజ్ పోస్టు చేశారు. నిబంధనల ప్రకారం పరిశ్రమలకు పవర్ కట్ చేయాలంటే 2 రోజుల ముందే సమాచారం ఇవ్వాలి. అలా కాకుండా ఉన్నట్టుండి మరమ్మతుల పేరుతో పవర్ కట్ చేయడంతో పరిశ్రమ యజమానులు కంగుతిన్నారు. దీనిపై ఓ పరిశ్రమ యజమాని మాట్లాడుతూ, మూడు దశాబ్దాల కాలంలో ఇలాంటి పరిస్థితి చూడలేదని, ఇలాంటి ప్రభుత్వం ఎక్కడా లేదేమోనని అసహనం వ్యక్తం చేశారు.

రాజ్యాంగ వ్యవస్థలన్నీ ధ్వంసం

- మంత్రి చెప్పకుండా జీతగాళ్లతో చెప్పించడమా?
- ఇలాంటి పాలనలో ఉండకూడదనే వైసీపీ నుంచి బయటకు వచ్చా
- సి.రామచంద్రయ్య ఆక్షేపణ.. వైసీపీ సభ్యత్వానికి రాజీనామా



కడప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ ధ్వం సం చేశారని.. ఒక్క వ్యవస్థ కూడా పనిచేయడం లేదని ఎమ్మెల్సీ సి.రామచంద్ర య్య అన్నారు. ఇలాంటి పాలనలో భాగస్వామిని కాకూడదనే వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరానని చెప్పారు. 'పార్టీలో నెలకొన్న అప్రజాస్వామిక విధానాలు నచ్చక వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తు న్నా.. నా రాజీనామా ఆమోదించాల్సిందిగా కోరుతు న్నా' అంటూ సోమవారం ఆయన సీఎం జగన్‌కు లే ఖ రాశారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఒకప్పుడు దక్షిణాదిన ఏపీ, తమిళనాడు పరిపాలనలో నంబర్‌వన్‌గా ఉండేవి. అప్పటో వ్యవస్థలు రా జ్యాంగం ప్రకారం పనిచేసేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలను సర్వనాశనం చేశారు. నాలాంటి సీనియర్ నాయకులు సీఎంను కలిసే అవకాశం లేదు. అసలు వైసీపీలో ఏం జరుగుతోందో ఎవరికి తెలియదు. ఇద్దరు ముగ్గురు సలహాదారులు మాత్రమే మాట్లాడుతున్నారు. రాజ్యాంగం ప్రకారం ఏ అంశంపై అయినా.. ప్రభుత్వ పాలసీ పై అయినా మంత్రులు మాట్లాడాలి. అయితే ఇక్కడ జీతగాళ్లు మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. రాష్ట్రం అప్పులపాలైందని.. 13 లక్షల కోట్లు అప్పులయ్యాయని.. అభివృద్ధే లేదని వాపోయారు. వైసీపీలో చేరాలని సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నోసార్లు తన చుట్టూ తిరిగితేనే చేరానన్నారు. 'కీలకమైన పదవులన్నీ రెడ్లకే ఇచ్చి సామాజిక న్యాయం పేరుతో బస్సు యాత్ర చేస్తున్నారు. తిరుపతిలో యాదవులు, బలిజలు ఎక్కువగా ఉంటే టీటీడీ, తుడా ఛైర్మన్ పదవులను రెడ్లకే ఇచ్చారు. ఇదేం సామాజిక న్యాయం? టీడీపీ ఆదేశిస్తే రాజంపేట నుంచి ఎన్నికల బరిలో దిగుతా. షర్మిల పార్టీతో జగన్‌కు పెద్ద నష్టమే జరుగుతుంది' అని చెప్పారు.

టీడీపీ దీక్షలో వైసీపీ కవ్వింపులు

- చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని టీడీపీ ఇన్‌చార్జి నాని దీక్ష
- వైసీపీ కార్యకర్తల కవ్వింపు చర్యలతో ఉద్రిక్తత
- పులివర్తి దీక్షను భగ్నం చేసిన పోలీసులు
- నిరసనగా ఒంటిపై పెట్రోలు పోసుకున్న నాని



ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న నాని

తిరుపతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ శ్రేణుల పోటాపోటీ దీక్షలతో తిరుపతిలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని ఎన్నికల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని తన అనుచరులతో కలసి తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం నిరాహార దీక్షకు దిగారు. మధ్యాహ్నం 2.30 గంటల తరువాత వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని కవ్వింపు చర్యలకు దిగారు. దళితుల ఓట్లను తొలగిస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ మరోవైపు దీక్షకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పోటాపోటీ నినాదాలు, తోపులాటలతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు వైసీపీ శ్రేణులను అక్కడ నుంచి పంపించేసి, పులివర్తి నానిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. శాంతి యుతంగా దీక్ష చేస్తున్న తమను అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొంటూ.. నాని ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. నానీని ఇంటికి తరలించిన కొద్దిసేపటికి స్వల్ప అస్వస్థతకు గురవడంతో పార్టీ నాయకులు స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ నేతల కుట్రలతోనే దీక్షను భగ్నం చేశారని, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరిగిందని టీడీపీ నేతలు ఆరోపించారు.



డిగ్రీ పట్టాలతో కట్టిన బొరుగుల పొట్లం సీపీఐ నారాయణకు విక్రయిస్తున్న తెలుగుయువత నేత రవి నాయుడు

డిగ్రీ పట్టాలతో పొట్లాలు కట్టి బతకాలా?

- తిరుపతిలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ వినూత్న నిరసన
- వారి వద్ద బొరుగులు కొనుగోలు చేసిన సీపీఐ నారాయణ

తిరుపతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ పట్టాలు.. పల్లీలు, బొరుగుల పొట్లాలు కట్టుకునేందుకు తప్ప ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పనికిరావని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు వ్యాఖ్యానించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలంటూ తిరుపతి మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ, బీటెక్ సర్టిఫికెట్లతో బొరుగులను పొట్లాలు కడుతూ సోమవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను నయవంచన చేసి గొంతుకోశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నేత నారాయణ వీరివద్దకు వచ్చి డబ్బులిచ్చి బొరుగులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ప్రకటిస్తావు జగన్ రెడ్డీ అంటూ తాను కూడా గత నాలుగేళ్లుగా ప్రశ్నిస్తూనే ఉన్నానన్నారు.

కేంద్రం చెప్పినా రోడ్లు వేయరా?: నారాయణ

నగరి, జనవరి 8: కేంద్రం చెప్పినా రోడ్లు వేయరా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సోమవారం ప్రశ్నించారు. 'చిత్తూరు జిల్లా నగరి మండల పరిధిలోని అయనంబాకం నా స్వగ్రామం. నాలుగేళ్ల కిందట సిమెంటు రోడ్లు మంజూరైనా పనులు చేపట్టలేదు. దీనిపై విచారిస్తే ప్రభుత్వం నిధులు మంజూరు చేయట్లేదని, తాము పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనిపై సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. రోడ్డు పనులు మొదలు పెట్టకపోవడంపై విచారణ చేపట్టి తక్షణం పనులు చేయాలని కేంద్రం ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరం' అని నారాయణ అన్నారు.

టీడీపీ శ్రేణులే లక్ష్యంగా బైండోవర్ అస్త్రం

- పర్చూరు నియోజకవర్గంలో స్టేషన్‌కు రావాలని ఆదేశాలు

బాపట్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ శ్రేణులను దిగ్బంధనం చేయడానికి అధికార వైసీపీ బైండోవర్ వ్యూహాన్ని అమలుచేసే ప్రయత్నాలు మొదలుపెట్టింది. దీనిలో భాగంగా పర్చూరు నియోజకవవర్గ వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతలు, కార్యక్తలకు ఆయా మండలాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లాలని పిలుపు వస్తోంది. ఇందుకు సంబంధించి సోమవారం చినగంజాం, కారంచేడు మండలాల పరిధిలో పలువురికి పిలుపు రావడం కలకలం రేపింది. వారిలో టీడీపీ శ్రేణులే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటాయి. అనంతర పరిణామాలతో వైసీపీ ప్రభుత్వం పోలీస్ యాక్టును అమలు చేసింది. అయినప్పటికీ టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున రోడ్లమీదకొచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు పెద్దఎత్తున కేసులు నమోదు చేశారు. ఒక్క బాపట్ల జిల్లాలనే 900 మందిపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు ఈ బైండోవర్ ముప్పును అప్పుడే హెచ్చరించారు. ఎడాపెడా కేసులు పెట్టి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బైండోవర్ అస్త్రాన్ని ఎక్కుపెడతారని అంచ నా వేశారు. ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న తంతు చూస్తుంటే అదే నిజమనిపిస్తోంది. అయితే.. బైండోవర్ అనేది ఆ మండల తహసీల్దార్ సమక్షంలో చేయాలి. ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి జాబితా తహసీల్దార్ కార్యాలయానికి వెళితే సదరు వ్యక్తిని అక్కడకు పిలిచి బైండోవర్ చేసి పంపించడం నిబంధన. కానీ ఇక్కడ ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాలని హు కుం జారీ చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు.

అల్లర్ల కేసు ఎత్తివేతపై భగ్గుమన్న దళితులు

- ప్రభుత్వ ఉత్తర్వుల రద్దుకు డిమాండ్
- అమలాపురంలో జీవో ప్రతుల దహనం
- జగన్‌కు దళితుల సత్తా చూపిస్తామని హెచ్చరిక

అమలాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో గతంలో జరిగిన అల్లర్ల కేసును ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. దళితులపై దాడిచేసి ఆస్తులు ధ్వంసం చేసిన నిందితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండగా ఉండి దళితులను అవమానిస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. సీఎంకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలిచ్చారు. కేసులు ఎత్తివేస్తూ జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అమలాపురం అల్లర్ల కేసు ఎత్తివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. జిల్లా దళిత సంఘ నాయకులు జంగా బాబూరావు, డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు తదితరుల నాయకత్వంలో ఆందోళన జరిగింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరును కోనసీమ జిల్లాకు పెడితే తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొందరు మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌ల ఇళ్లను దహనంచేసి, దళితులపై దాడులకు తెగబడ్డారని, అటువంటి వారిపై కేసులు ఎత్తేస్తూ దళితుల ఆత్మాభిమానాన్ని కించపరిచారని ఆరోపించారు. 'ఎక్కడో వంద అడుగుల పైబడి అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులంతా సీఎం జగన్ పక్షాన ఉండి ఓట్లు వేస్తారనుకుంటున్నారేమో, ఈసారి దళితుల సత్తా సీఎం జగన్‌కు తెలియజేస్తామ'ని నాయకులు హెచ్చరించారు. దళితుల సంక్షేమానికి సంబంధించి 27 పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేయడం వల్ల తమ కుటుంబాలకు తీవ్ర నష్టం జరిగిందని, దీనిపై ఉద్యమం చేపడతామని కోనసీమ దళిత సంఘ నేత జంగా బాబూరావు హెచ్చరించారు.

దళిత నేతలపై కేసులెందుకు ఎత్తివేయడం లేదు?

అమలాపురం అల్లర్ల కేసును ప్రభుత్వం ఎత్తివేసినప్పుడు అంబేడ్కర్ జిల్లా సాధన కోసం ఉద్యమం చేసిన దళిత నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులు ఎందుకు ఎత్తివేయడంలేదని దళిత నేతలు ప్రశ్నించారు. రాజోలు మండలం వేగివారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం దళితులపై కేసులు ఎత్తివేయడంలో కూడా వివక్షత చూపిస్తోందని మండిపడ్డారు.

బెయిలు రద్దు చేస్తే జగన్ మళ్లీ జైలుకే

- అందుకే కేంద్రం వద్ద సాగిల పడుతున్నాడు: జేడీ శీలం

కాకినాడ సిటీ, జనవరి 8: బెయిలు రద్దు చేస్తే సీఎం జగన్ మళ్లీ జైలుకు వెళ్లే పరిస్థితి ఉండడంతో కేంద్రం ఎదుట సాగిల పడుతున్నాడని మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం విమర్శించారు. దివంగత రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో రాష్ట్రంలో పార్టీ బలోపేతం కానుందన్నారు. కాకినాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భావసారుప్యతగల రాజకీయ పార్టీలు, దళిత, గిరిజన, మైనారిటీ ప్రజా సంఘాలతో సోమవారం సమావేశం నిర్వహించారు. జేడీ శీలం మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సూచనల మేరకు రాష్ట్ర బాధ్యతలు షర్మిల తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఓ ప్రైవేటు ఫంక్షన్ నిమిత్తం సోమవారం రాత్రి కాకినాడ విచ్చేశారు. ఆయన్ను మంత్రి పినిపే విశ్వరూప్, వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీయువకులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని తెలుసుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రూపొందించిన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్ పోర్టల్‌ను రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సోమవారం ఆవిష్కరించారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులు సహా ఐటీ, సాంకేతిక రంగాలపై యువత మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా 'ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్' సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేస్తూ ఈ వెబ్ పోర్టల్‌ను రూపొందించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుప్రీం అభిశంసన

బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించిన తీర్పు ప్రశంసనీయమైనది. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, కుటుంబీకుల హత్యలకు కారకులైన 11 మంది దోషులకు రెమిషన్ ఇచ్చి విడుదల చేసిన గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహాన్ని చవిచూసింది. రెండువారాల్లో వీరంతా జైలు అధికారులకు లొంగిపోవాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దోషులకు రెమిషన్ మంజూరు చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదనడంతో పాటు, ఒక దోషి గత ఏడాది సుప్రీంకోర్టు బెంచ్ నుంచి తెచ్చుకున్న ఆదేశాలను సైతం ప్రస్తుత తీర్పు రద్దుచేయడం విశేషమైనది.

అధికారాలను దుర్వినియోగం చేయడం వేరు, లేని అధికారాలను ప్రయోగించి ఇంతటి దుశ్చర్యకు పాల్పడటం వేరు. ఈ పదకొండుమంది దోషుల రెమిషన్ విషయంలో గుజరాత్ ప్రభుత్వం అన్ని విధాలుగా పక్షపాతంతో, నిస్సిగ్గుగా వ్యవహరించిందన్నది సుప్రీంకోర్టు తీర్పు సారాంశం. దోషులంతా జీవితఖైదు పడినవారు. సత్ప్రవర్తన పేరుతోనో, ఇతరత్రా చారిత్రక సందర్భాల్లోనో కొందరికి రెమిషన్ వర్తింపచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోలేదు. అయితే, సదరు కేసు విచారణ జరిగిన, శిక్ష విధించిన రాష్ట్రానికి మాత్రమే ఈ సిఫార్సు అధికారం ఉన్నందున, ఈ పదకొండుమంది విషయంలో ఆ పనిచేయాల్సింది మహారాష్ట్ర తప్ప, గుజరాత్ కాదు. మరణశిక్షపడిన ఖైదీలకు రెమిషన్ వర్తించదంటూ 2014నాటి చట్టం స్పష్టం చేస్తున్నందున, గుజరాత్ ప్రభుత్వం తెలివిగా 1992నాటి రెమిషన్ విధానాన్ని వీరికి వర్తింపచేసింది.

ఈ పదకొండు మందితోనూ గుజరాత్ ప్రభుత్వం కుమ్మక్కయిందని సుప్రీంకోర్టు ఇప్పుడు అంటున్నది కానీ, వీరి రెమిషన్‌కు సిఫార్సు చేయడానికి గుజరాత్ ప్రభుత్వం నియమించిన పానెల్ పూర్తిగా అధికారపెద్దలతో నిండిపోవడం, 2022 గుజరాత్ ఎన్నికలకు సరిగ్గా నాలుగునెలల ముందు వీరంతా విడుదల కావడం తెలిసినవే. వారి విడుదలను పాలకపక్షం ఓ పండుగలాగా నిర్వహించింది. తిలకాలు దిద్ది, హారతులు పట్టి, స్వీట్లు నోట్లో పెట్టి, ఊరేగించి మరీ వారిని జైలు నుంచి తీసుకువచ్చారు. ఆ తరువాత సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వీరందరినీ తమతోపాటు వేదికలమీద సైతం కూచోబెట్టుకున్నారు.

రాధేశ్యామ్ అనే పిటిషన్‌దారు సుప్రీంకోర్టును తప్పుదోవపట్టించారంటూనే, 2022 మే నెలలో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పును తప్పుబట్టడానికి, ఆ తీర్పుకు దోహదం చేసిన గుజరాత్ ప్రభుత్వం కుట్రను జస్టిస్ నాగరత్నమ్మ ఇప్పుడు ఏకిపారేశారు. రెమిషన్ విషయాన్ని మహారాష్ట్రతో తేల్చుకోమని గుజరాత్ కోర్టు చెబితే, మహారాష్ట్ర కాదు పొమ్మంటే, ఈ విషయాలన్నీ దాచి ఆ దోషి సుప్రీంకోర్టునుంచి గుజరాత్ ప్రభుత్వానికి అతడి విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా ఆదేశాలు ఇప్పించుకోగలిగాడు. దీనిపై రివ్యూ పిటిషన్ ఎందుకు వేయలేదని గుజరాత్ ప్రభుత్వాన్ని ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కానీ, ఆ ఒక్క పిటిషన్‌తో ఆ ఖైదీకే కాదు, అస్మదీయులందరికీ రెమిషన్ ఇచ్చి గుజరాత్ పాలకులు ఎన్నికలముందు తమ రాజకీయప్రయోజనం నెరవేర్చుకున్నారు.

మరో మూడేళ్ళలో చీఫ్ జస్టిస్ కాబోతున్న జస్టిస్ బీవీ నాగరత్న వెలువరించిన ఈ తీర్పు ప్రజాస్వామిక వాదుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. ఇటీవలి చాలా తీర్పులు ఆలయాల చుట్టూ, అధికారకేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వాల మెడలు వంచారామె అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దనోట్ల రద్దు తీర్పులో సైతం మిగతా నలుగురు న్యాయమూర్తులతో విభేదిస్తూ ఆమె రాసిన అసమ్మతి తీర్పు మోదీ నిర్ణయాన్ని మెత్తనిమాటలతో బాగా తప్పుబట్టింది. ప్రక్రియ యావత్తూ ఏకపక్షంగా సాగిందని, ఇది చట్టవ్యతిరేకమైన చర్యనీ తేల్చారామె. కులం, మతం, హోదాతో నిమిత్తం లేకుండా సమాజంలోని ప్రతీ మహిళా గౌరవాన్ని పొందాల్సిందే, ఒక మహిళపై అత్యంత పాశవికంగా వ్యవహరించినవారు కూడా రెమిషన్‌కు అర్హులవుతారా?, బాధితులను దృష్టిలో పెట్టుకున్నప్పుడే కదా అది పరిపూర్ణ న్యాయం అవుతుంది అంటూ జస్టిస్ బీవీ నాగరత్న ఇప్పుడు ఎంతో ఘాటుగా, లోతుగా ఇచ్చిన ఈ తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది.

రాహుల్ విఫల విన్యాసాలు

రాజకీయాల్లో ప్రజలను మాటలతో మభ్యపెట్టడం, కొత్త కొత్త నినాదాలను సృష్టించడంలో కాంగ్రెస్‌ను మించిన పార్టీ మరేదీ లేదు. ఆ పార్టీ లక్ష్యం ఒక్కటే– గాంధీ– నెహ్రూల కుటుంబానికి ఏదో రకంగా అధికారం దక్కేలా చూడడం. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ ఇందుకు విఫల పోరాటం చేస్తూనే ఉన్నది. జనవరి 14 నుంచి భారత్ జోడో న్యాయ యాత్రను జరిపేందుకు రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. భారత్ జోడోయాత్ర పేరుతో 2022–23లో రాహుల్ కొన్ని రాష్ట్రాలు తిరిగారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ యాత్రకు కొద్దిగా పేరు మార్చి మరికొన్ని రాష్ట్రాలు తిరగాలని రాహుల్ నిర్ణయించారు. విభిన్న సామాజిక వర్గాలను కలపడం జోడో యాత్ర లక్ష్యమైతే ఆ వర్గాలను కలపడమే కాక వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని సమకూర్చేందుకు పోరాడడం తాజా యాత్ర లక్ష్యమని కాంగ్రెస్ చెప్పుకుంది.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

రాహుల్ గాంధీని ఎన్నిసార్లు ఏ రూపంలో ప్రయోగించినా ఫలితం ఏమీ ఉండదు. 2004లో రాజకీయాల్లో ప్రవేశించిన రాహుల్ గాంధీ ఈ రెండు దశాబ్దాల్లో కాంగ్రెస్ పార్టీపై కానీ, దేశ ప్రజలపై కానీ చూపిన ప్రభావం అంటూ ఏమీ లేదు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా, యువజన కాంగ్రెస్ తదితర అనుబంధ సంస్థల ఇన్‌ఛార్జిగా, ఉపాధ్యక్షుడుగా, చివరకు అధ్యక్షుడుగా ఆయన ఏ బాధ్యత చేపట్టినా విజయవంతం కాలేకపోయారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఆయనే సారథ్యం వహించారు కదా. ఏమయింది? కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతింది. 2009లో 206 సీట్లు సాధించిన కాంగ్రెస్ 2014లో 44 సీట్లకు పడిపోయింది. 2019 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ఆయనే ప్రచార సారథ్యం వహించినప్పటికీ లోక్‌సభలో కాంగ్రెస్ పదిశాతం సీట్లను కూడా సాధించలేకపోయింది. దీనితో ఆయన అవమాన భారంతో సీనియర్లను నిందిస్తూ పార్టీ అధ్యక్ష పదవికే రాజీనామా చేశారు. అయినప్పటికీ ఒక కుటుంబానికి విధేయంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రాహుల్ తప్ప మరో గత్యంతరం లేకుండా పోయింది.

దేశంలో అన్ని వర్గాలను కలుపుతానంటూ జోడోయాత్ర నిర్వహించిన రాహుల్ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. మధ్యప్రదేశ్‌లో రాహుల్ తన సోదరి ప్రియాంకతో కలిసి 21 నియోజకవర్గాల్లో పర్యటిస్తే కాంగ్రెస్ కేవలం 4సీట్లలో గెలిచింది. ఆయన పర్యటించిన బుర్హన్‌పూర్, ఇండోర్, మాల్వా, ఉజ్జయిని ప్రాంతాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు. రాజస్థాన్‌లో 12 నియోజకవర్గాల్లో రాహుల్ యాత్ర సాగితే వాటిలో కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుంది. ఝూల్వార్, దౌసా, సవాయి, మధోపూర్, ఆల్వార్ జిల్లాల ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారు. తెలంగాణలో కూడా రాహుల్ యాత్ర వల్ల కాంగ్రెస్‌కు ప్రయోజనం జరిగిందని ప్రగల్భాలు పలుకుతున్నారు కాని 29 నియోజకవర్గాల్లో రాహుల్ పర్యటిస్తే కాంగ్రెస్ కేవలం 12 సీట్లలోనే గెలిచింది. హైదరాబాద్‌తో సహా అనేక ప్రాంతాల్లో రాహుల్ యాత్ర ప్రభావం ఏమీ లేదు. మొదటి విడత యాత్రలోనే రాహుల్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడ్డా మరో విడత యాత్రకోసం రాహుల్‌ను ప్రోత్సహించడం కాంగ్రెస్ భావ దారిద్ర్యానికి నిదర్శనం.



రెండు దశాబ్దాల క్రితం రాజకీయాల్లో ప్రవేశించిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీపై కానీ, దేశ ప్రజలపై కానీ చూపిన ప్రభావం ఏమీ లేదు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా, యువజన కాంగ్రెస్ తదితర అనుబంధ సంస్థల ఇన్‌ఛార్జిగా, పార్టీ ఉపాధ్యక్షుడుగా, చివరకు అధ్యక్షుడుగా ఆయన ఏ బాధ్యత చేపట్టినా విజయవంతం కాలేకపోయారు.

రెండో జోడో యాత్రకు రాహుల్ ఎందుకు పూనుకున్నారు? ఈ దేశంలో వివిధ వర్గాలను ఆయన యాత్ర కలుపుతుందట! రాహుల్ జోడో యాత్ర చేయకముందు భారతీయులంతా విడిపోయి ఉన్నారా? నిజానికి ఈ దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే కాదూ? కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు కాంగ్రెస్ హయాంలోనే హింసాకాండతో వేర్పాటువాదంతో భగ్గుమన్నాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో మత కల్లోలాలు జరిగాయి. ఢిల్లీలో 2 వేలమంది సిక్కుల ఊచకోత జరిగింది. కాంగ్రెస్ హయాంలోనే. పంజాబ్‌లో ఆపరేషన్ బ్లూస్టార్ జరిగింది. ఆ పార్టీ ప్రభుత్వాల హయాంలో జరిగినన్ని కుల, మత, ప్రాంతీయ ఘర్షణలు ఏ పార్టీ హయాంలో జరగలేదు. ఇదేమిటని ప్రశ్నించినందుకు ప్రతిపక్షాలను జైళ్లలో బంధించి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించారు. కుటుంబ పాలన, అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెచ్చరిల్లింది కాంగ్రెస్ హయాంలోనే. రాహుల్ యాత్ర ద్వారా కాంగ్రెస్ తన గత పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అందుకోసం తాను ప్రాయశ్చిత్త యాత్ర జరుపుతున్నట్లు రాహుల్ ప్రకటించాలి.

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు చేరుతున్నాయో లేదో తెలుసుకునేందుకు మోదీ, ఆయన మంత్రులు, బీజేపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నేరుగా ప్రజలను కలుసుకునేందుకు నవంబర్ 15న ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర అత్యంత విజయవంతమైంది. కేవలం 50 రోజుల్లోనే బీజేపీ నేతలు 11 కోట్ల మందిని చేరుకున్నారు. మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర భారత ప్రజలను ఏకం చేసింది. రాహుల్ జోడో యాత్ర ఏ వర్గాన్నీ ఏకం చేసిన దాఖలాలు లేవు. అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ ద్వారానే ప్రజలను ఏకం చేయగలమని మోదీ రుజువు చేశారు. కాని కులం పేరిట, మతం పేరిట ప్రజలను విడదీసిన చరిత్ర ఉన్న కాంగ్రెస్ ప్రజలను ఏ విధంగా ఏకం చేయగలుగుతుంది?

రెండో విడత యాత్రలో రాహుల్ ఈ దేశ ప్రజలకు ఆర్థిక సామాజిక న్యాయం అందిస్తామని చెబుతారట. తమకు ఆర్థిక, సామాజిక న్యాయం భారతీయ జనతా పార్టీ హయాంలోనే లభిస్తోందని ప్రజలు గ్రహించినందునే గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారు. మూడోసారి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారని ప్రజల ప్రతిస్పందనను బట్టి అర్థమవుతోంది. రాహుల్ యాత్ర జరుపుతోంది ప్రధానంగా తమ కుటుంబానికి న్యాయం అందించమని ప్రజలను వేడుకోవడం కోసమే. ఆ కుటుంబానికి న్యాయం చేయడమంటే దేశానికి అన్యాయం చేయడమే. కాంగ్రెస్ పార్టీ దౌర్భాగ్యం ఏమిటంటే ఒక కుటుంబం తమ భవిష్యత్తు కోసం ఆ పార్టీని వాడుకుంటుంటే, కుటుంబ భవిష్యత్తులోనే తమ భవిష్యత్తు ఉన్నదని ఆ పార్టీ నేతలు భావించడం!

కుటుంబ పరిధికి మించి ఆలోచించలేని దుస్థితిలో ఉన్నందువల్లే కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిలపై ఆధారపడుతోంది. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో పుట్టగతులు లేవు. ఆస్తుల పంపకంలో తనకు న్యాయం జరగనందుకే షర్మిల ఇప్పుడు అన్నమీద కోపంతో కాంగ్రెస్ పార్టీలో చేరారనడంలో సందేహం లేదు. జగనే కనుక ఆమెను చేరదీసి ఏదో పదవితో పాటు ఆస్తిని పంచి ఇచ్చి ఉంటే ఆమె జగనన్న బాణంగానే ఇప్పటి వరకూ పనిచేస్తుండేవారు కాదా? తెలంగాణలో షర్మిల ఎందుకు సొంత పార్టీ పెట్టారు? ఆ పార్టీని ఎందుకు మూసివేసి కాంగ్రెస్‌తో చేతులు కలిపారు? ఇప్పుడు ఆమె ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను ఉద్ధరించగలరని రాహుల్ గాంధీ ఆశపడుతున్నట్లు కనపడుతోంది. తెలంగాణ నుంచి పారిపోయిన నేత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను ఏమి ఉద్ధరించగలరు?

కృత్రిమ మేధపై పోరు తప్పదు!



సృష్టికి ప్రతి సృష్టి చేస్తోంది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ). ఇదొక విప్లవాత్మక పరిణామం– ముఖ్యంగా సమాచార రంగంలో. చాట్ జీపిటి, ఇతర ఎఐ వేదికలను సృష్టిస్తున్న, ఉత్పత్తి చేస్తున్న ఓపెన్ ఎఐ, మైక్రోసాఫ్ట్ కంపెనీలపై విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' కోర్టులో దావా వేసింది. తాము సంచితం చేసిన అపార పాత్రికేయ సమాచారాన్ని తమ అనుమతి లేకుండా చాట్ జీపిటి స్వేచ్ఛగా వినియోగించుకోవడం న్యాయవిరుద్ధమని ఆ సుప్రసిద్ధ పత్రిక ఘోషిస్తోంది. తమ వ్యాసాలు, వార్తలను విరివిగా వినియోగించుకుంటున్నందుకు చాట్ జీపిటి ఉత్పత్తిదారులు తమకు వందల కోట్ల డాలర్ల (ఈ మొత్తం కచ్చితంగా ఎంత అనేది ఇదమిత్థంగా తెలియదు)ను చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. 2024 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో అసంఖ్యాక ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును ఉపయోగించుకోనున్నారు. అయితే ఈ ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య పోరాటాల కంటే తమ మేధాసంపత్తి హక్కులను కాపాడుకునేందుకు ఆ అమెరికన్ మీడియా సంస్థ చేస్తున్న న్యాయపోరాటం చాలా ప్రత్యేకమైనది. న్యాయ నిర్ణయం ఎలా ఉంటుందనే విషయమై సకల దేశాల ప్రజలూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

మీడియా సంస్థలే కాదు, పలువురు సృజనశీలురు కూడా వైయక్తికంగానూ సమష్టిగానూ ఎఐ కంపెనీలపై తమ మేధో శ్రమను అనుమతి లేకుండా ఉపయోగించుకుంటున్నందుకు భారీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ న్యాయ స్థానాలకు వెళ్లారు. 'హాలీవుడ్ రిపోర్టర్' ఎడిటర్ జూలియన్ శాంక్టన్ నేతృత్వంలో పలువురు సాహిత్యేతర గ్రంథ రచయితలు ఒక కేసు వేశారు. ప్రతిష్ఠాత్మక పులిట్జర్ పురస్కార గ్రహీతలు కూడా ఎఐ కంపెనీలపై వ్యాజ్యాలలో భాగస్వాములు అవుతున్నారు. ప్రముఖ రచయితలు జోనాథన్ ఫ్రాంజెన్, జార్జి ఆరఆర్ మార్టిన్, జాన్ గ్రిషామ్‌లు ఈ వ్యాజ్యదారులలో అగ్రగాములుగా ఉన్నారు. కృత్రిమ మేధ నుంచి తమ వృత్తిగత మనుగడకు ఎనలేని ముప్పు వాటిల్లుతుందని హాలీవుడ్ సృజనాత్మక, సాంకేతిక కళాకారులు ఆందోళన చెందుతున్నారు. వీరు ఇప్పటికే సమ్మెలు చేసి, నిరసన ప్రదర్శనలు నిర్వహించి ఎఐతో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను విశాల ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. ఎఐ కంపెనీలకు వ్యతిరేకంగా న్యూయార్క్ టైమ్స్ చేస్తున్న న్యాయపోరాటమే, మరే వ్యాజ్యం కంటే కూడా ఎక్కువగా ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. దశాబ్దాలుగా ఆ పత్రిక తన పాత్రికేయ ప్రజ్ఞతో సంచితం చేసిన అపార సమాచారాన్ని చాట్ జీపిటి తన కార్యకలాపాలకు అనుమతి లేకుండా ఆధారం చేసుకోవడమే అందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు.

అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ మానవాళి ఆర్థిక, పారిశ్రామిక కార్యకలాపాలలో పెనుమార్పులను అనివార్యం చేస్తోంది. అంతేకాకుండా మానవ అస్తిత్వ విశిష్టత అయిన సృజనశీలతకే సవాల్‌గా పరిణమించింది. వ్యక్తుల, సంస్థల మేధాసంపత్తి హక్కులను హరించివేస్తోంది. ఈ ప్రమాదకర ధోరణిపై 'న్యూయార్క్ టైమ్స్'తో సహా సృజనశీలురు ఎందరో తమ వ్యక్తిగత స్థాయిలోనూ సమష్టిగానూ న్యాయపోరాటాలు చేస్తున్నారు.

సాహిత్యం, తత్వ శాస్త్రం, వేవ్ మెకానిక్స్, విండ్ సర్ఫింగ్ మొదలైన సమస్త వైవిధ్య జ్ఞాన రంగాలకు సంబంధించి ఇంటర్నెట్‌లో లభ్యమవుతున్న సమాచారాన్ని చాట్ జీపిటి స్వేచ్ఛగా వినియోగించుకుంటుంది. ఈ స్వేచ్ఛా వినియోగమే ఎఐకు తీవ్ర సవాళ్లను, న్యాయపరమైన సమస్యలను తీసుకువస్తోంది. దాని న్యాయబద్ధతను ప్రశ్నించేలా చేస్తోంది. వైజ్ఞానిక కాల్పనిక సాహిత్య దిగ్గజం ఐజాక్ అసిమోవ్ (1920–92) 1942లో రచించిన 'రన్ ఎరౌండ్' అనే కథలో ప్రస్తుత పరిణామాన్ని ఊహించారు. 'రోబోటిక్స్ మూడు నియమాల'ను ఆయన ఆ కథలో ప్రకటించారు. ఆ మూడింటిలో మొదటి సూత్రం ఒక రోబో ఒక మనిషికి హాని చేయబోదు లేదా నిష్క్రియాపరత్వంతో ఒక మనిషి తనకు హాని చేసేందుకు అనుమతించదు'. మిగతా రెండు నియమాలు దీని నుంచి నిష్పన్నమైనవే. మానవుల పట్ల రోబోలు హింసాత్మకంగా ప్రవర్తించడాన్ని అనుమతించకూడదన్న సత్య వచనాన్ని పలు తరాల పాఠకులు చదువుతూ వస్తున్నారు. అయితే ప్రస్తుత పరిణామాలు భిన్నమైనవి హింసకు ఇచ్చే నిర్వచనం ప్రకారం దాని పరిధిని విశాలం చేయవచ్చు. మానవుల విశిష్టతకు ముప్పు కలిగించే విధంగా యంత్రాలను అనుమతించకూడదన్న అర్థంలో అసిమోవ్ మొదటి నియమాన్ని చదవండి. అప్పుడు కృత్రిమ మేధపై జరుగుతున్న చర్చ వాస్తవికంగా లేదని అర్థమవుతుంది.

ఒక ఏడాది కాలంలోనే ఎఐ అనేక రంగాలలో ఉద్యోగాలను మటు మాయం చేయనున్నదనే విషయమై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అది ఆర్థికపరమైన ఆందోళన మాత్రమే. ప్రతీ సాంకేతిక విప్లవమూ అనేక విషయాలను అనావశ్యకం చేస్తుంది. కంప్యూటర్ విప్లవం గురించి చెప్పేదేముంది? టైపిస్టులు, టెలిఫోన్ స్విచ్ బోర్డ్ ఆపరేటర్లు, డేటా టాబ్యులేటర్లు, అకౌంటెంట్స్ అవసరం లేకుండా చేసింది. ఈ మార్పునే ఎఐ విప్లవం మరింత తీవ్రం చేస్తోంది. సాంకేతిక విప్లవాలు ఆర్థిక వ్యవస్థల్లో పెనుమార్పులను అనివార్యం చేస్తాయి. ఆ మార్పులు అల్లకల్లోలంగా ఉండడం కద్దు. విప్లవాత్మక మార్పు సంభవించిన కొద్దికాలానికే దాని మూలంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులు సర్వసాధారణమైపోతాయి. ప్రజలు వాటికి అలవాటుపడతారు. తమ శ్రమకు మరింత ప్రతిఫలం లభించే ప్రదేశాలకు కొంతమంది కార్మికులు వెళతారు. మరి కొంతమంది శ్రామికులు కొత్త పని వాతావరణంలో ఇమడలేక పాతకాలం చేతివృత్తులు మొదలైన వాటిని తమ జీవనాధారాలుగా చేసుకుంటారు. కొత్త సాంకేతికతలు ప్రభవించిన ప్రతీ సందర్భంలోనూ ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక వ్యవహారాలలో క్రియాశీలంగా ఉన్నవారికి అవి కొత్త కర్తవ్యాలను నిర్దేశిస్తాయి. వారు నిర్వహించే పాత్రలను మార్చివేస్తాయి. వారిపై బృహత్ కార్యభారాన్ని మోపుతాయి. ఈ అనూహ్య పరిస్థితులను తట్టుకుని నిలబడినవారు కొత్త సాంకేతికతను తమకు సహాయకారిగా పరిగణిస్తారు. రైతులు సాగు పనులను పర్యవేక్షించడానికే పరిమితం కాకుండా హార్వెస్టర్ల (కోతలు, నూర్పిళ్ల యంత్రాలు) డ్రైవర్లుగానూ పనిచేయవలసిరావడం తప్పనిసరి అవుతుంది. గృహ సేవకులు మైక్రోవేవ్ ఓవెన్ల, వాషింగ్ మెషీన్లను ఉపయోగించుకోవడం నేర్చుకుంటారు. చెప్పవచ్చిన దేమిటంటే చాట్ జీపిటి రంగంలోకి ప్రవేశించిన తరువాత దాని వినియోగదారులు అది నిర్దేశించే కొత్త కార్య సరళికి అలవాటుపడ్డారు. ఆవశ్యక నవీన నైపుణ్యాలను నేర్చుకున్నారు.

సమాచార రంగంలో వినూత్న సంచలనాలకు వేదిక అయిన చాట్ జీపిటిలో మనకు తరచు వచ్చే మొదటి ఆదేశం : 'నీవు నా సహాయకుడువి అని భావించుకోండి'. రేడియాలజీ నుంచి ఓషనోగ్రఫీ దాకా, డేటా ఎంట్రీ నుంచి ఈ–మెయిల్ మార్కెటింగ్ దాకా వివిధ రంగాలలో మనకు ఆ నవీన సాంకేతికత అనేకానేక విధాలుగా సహాయపడుతుంది. అయితే ఆ సహాయ చర్యలు చచ్చే చికాకు కలిగించేవి అని కూడా మనం గుర్తించాలి, అంగీకరించాలి.

సరే, మేధో సంపత్తి సంబంధిత వాణిజ్య రంగంలోకి ఎఐ ప్రవేశం ఉత్తేజాన్ని కలిగించింది, వ్యాకులతను సృష్టించింది; ఆరాటాన్ని పెంపొందించింది. సృజనశీలుర సొంత మేధో ఉత్పత్తులను అది అపారంగా నిక్షిప్తం చేసుకోవలసి ఉన్నది. ఎందుకంటే వినియోగదారుడు (యూజర్) అడిగిన సమాచారాన్ని సమకూర్చడానికి చాట్ జీపిటికి ఏదో ఒక మేధో సంపత్తి ఆధారం ఉండి తీరాలి. ముందుగా నిక్షిప్తం చేసిన సమాచారం ప్రాతిపదికన అది సమాధానాలు ఇవ్వడం సాధ్యమవుతుంది. ఇలా వినియోగదారుల ప్రశ్నలకు చాట్ జీపిటి ప్రతిస్పందనలు దాని సొంత మేధో సంపత్తిగా ఆవిర్భవిస్తాయి. అయితే మేధో సంపత్తిని సృష్టించే సృజనశీలురు ఈ ఎఐ ఉత్పత్తుల తీరుతెన్నులను సహజంగానే ఆక్షేపిస్తారు. ఎందుకంటే అది ఒక విధమైన చౌర్యం. ఎఐ చాలా ఉద్యోగాలను మటుమాయం చేయడం, డిజిటల్ టెక్నాలజీ తోడ్పాటుతో నకిలీ ఫోటోలు, దృశ్యాలు, గళాలు సృష్టించడం మొదలైనవి నూటికి నూరుశాతం వాస్తవాలు, అంతకు మించి ఎంతో ఆందోళనకర వ్యవహారాలూ పరిణామాలూ. ఇవన్నీ ఎఐ పుణ్యమేనని మరి చెప్పనవసరం లేదు. ఈ నకిలీ సృష్టికాండకు వ్యతిరేకంగా ఎంతో మంది హెచ్చరికలు చేస్తున్నారు. అయితే పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నవారు ఎవరూ కనిపించడం లేదు! ఈ కొత్త సంవత్సరంలో ఇతోధికంగా అభివృద్ధి చెందనున్న ఎఐ ఆధారిత పరిశ్రమలకు మొట్టమొదటి సవాల్ సృజనాత్మక మేధోశ్రమ చేసే వారి నుంచే వస్తుంది.

మానవాళి విశిష్టత ఏమిటి? మానవుని విలక్షణతను ఎలా అర్థం చేసుకోవాలి? మానుషత్వాన్ని ఎలా నిర్వచించాలి? సహస్రాబ్దాలుగా సకల సమాజాలలోని విజ్ఞులు ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి ఆరాటపడుతున్నారు. ఏ దివ్యశక్తి మానవుడిని జీవకోటిలో ప్రత్యేకంగా నిలబెట్టింది? భాషా? చింతనా సామర్థ్యమా? ఆత్మీయ సమూహం, సొంత సమాజం సమష్టి అనుభవాలను పదిలపరచి భావి తరాలకు అందివ్వడమా? కృత్రిమ మేధ మౌలికతను ప్రశ్నిస్తున్న సవాళ్లు, ఆ అతి నవీన సాంకేతికత తీరుతెన్నులపై ఆక్షేపణల నుంచి అంతిమంగా ఆ ప్రశ్నలకు నిశ్చితమైన, నిర్ణయాత్మకమైన సమాధానాలు లభించే అవకాశమున్నది. మేధో నైపుణ్యాలు విలువకట్టలేని మానవ సంపద. తమ సృజనశీలతను రక్షించుకునే విషయంలో మానవులు ఎటువంటి రాజీకి అంగీకరించరు.

మానవ సృజనాత్మకత వెల లేనిది. వెల నిర్ణయించేందుకు ఎవరూ సాహసించలేనిది. పాత్రికేయ ప్రజ్ఞ ఆ సృజనాత్మకత ఫలితమే. కనుకనే దశాబ్దాలుగా ఆ ప్రజ్ఞతో తాము సంచితం చేసిన విజ్ఞాన, సమాచార భాండారాన్ని తన సొంతం అన్నట్టుగా చాట్ జీపిటి వినియోగించుకోవడాన్ని విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' నిరసిస్తోంది. అనిర్దిష్ట మొత్తంలో వందల కోట్ల డాలర్లను తమకు చెల్లించి తీరాల్సిందేనని ఖండితంగా డిమాండ్ చేస్తూ ఆ అధునాతన సాంకేతికత ఉత్పత్తిదారులు అయిన ఎఐ కంపెనీలపై కోర్టులో దావా వేసింది. తమను ఇంత శక్తిమంతులుగా, అపర సృష్టికర్తలుగా చేసిన సృజనాత్మక శ్రమను ఇప్పుడు ఒక యంత్రానికి వదలివేసేందుకు మానవులు అంగీకరిస్తారా? అంగీకరించరు. ఎందుకంటే అలా యాంత్రిక బానిసలు కావడం వల్ల మానవ జీవితం ఎటువంటి మినహాయింపు లేకుండా పూర్తిగా అర్థరహితమై పోతుంది. మరి కింకర్తవ్యమేమిటి? ఈ ధరిత్రిపై నడయాడుతున్న సృజనశీలురు అందరూ కృత్రిమ మేధకు వ్యతిరేకంగా సమైక్యమవడమే.

● ప్రతీక్ కంజీలాల్
ఎడిటర్, ది 'ఇండియా కేబుల్'

ఉక్కు ప్రైవేటీకరణ.. ఉత్తరాంధ్రకు శాపం

మూలిగే నక్కపై తాటిపండు పడినట్టుంది ఉత్తరాంధ్ర పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న ఈ ప్రాంతపు ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయాలు, విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణతో మరింత దిగజారనున్నాయి. ఈ జిల్లాల్లోని ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. పర్యవసానంగా వలసలు రెట్టింపయ్యే పరిస్థితులు నెలకొననున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థల్ని దశలవారీగా ప్రైవేటీకరించాలని సంకల్పించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ దిశగా ఒక్కో అడుగు వేసుకుంటూ ముందుకు సాగుతోంది. దీంట్లో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం విక్రయించాలని 2021 జనవరి 21న నిర్ణయం తీసుకుంది. పిడుగు లాంటి ఈ వార్త ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసుల్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. వ్యూహాత్మక విక్రయం పేరుతో ప్రారంభమైన ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయం, ఇప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాలకు శాపం కానుంది. పరిశ్రమలోని కొంత భాగాన్ని జిందాల్‌కు కట్టబెట్టడం కోసం 2023 డిసెంబరు 19న ఎంఓయు కుదుర్చుకోవడం తాజాగా కార్మికుల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. రక్షణరంగ ఉత్పత్తులు, రైల్వే, ఎల్ఐసీ, కోల్ ఇండియాలను ప్రైవేటుపరం చేయడానికి తెగబడిన కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటుకు ధారాదత్తం చేయడానికి గుట్టుచప్పుడు కాకుండా తలుపులు తెరిచింది. పరిశ్రమను ప్రైవేటుపరం చేయబోమని కార్మికులతో నిన్నమొన్నటి వరకూ నమ్మబలికిన కేంద్రం, తాజాగా ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్–3ను మూడో కంటికి తెలియకుండా జిందాల్‌కు ధారాదత్తం చేసింది. ఈ పరిణామం వేలాది కార్మిక కుటుంబాల్ని కలవరపాటుకు గురి చేసింది.



1966లో 'విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఊపిరి పోసుకున్న ఉక్కు ఉద్యమం రాష్ట్రం దద్దరిల్లేలా నాలుగేళ్లపాటు సాగి, భారతదేశపు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసుకుంది. ఈ పరిశ్రమ కోసం విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, జగిత్యాల ప్రాంతాలకు చెందిన సుమారు 35 మంది అసువులు బాసారు. మరెంతో మంది గాయాల బారినపడి ఆసుపత్రుల పాలయ్యారు. ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో చివరికి 1970 ఏప్రిల్ 17న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటన చేశారు. 1978లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం తొలి విడతగా వెయ్యి కోట్లు కేటాయించింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్లాంట్ నిర్మాణం కోసం 64 గ్రామాలను ఖాళీ చేసి, 17 వేల మంది నిర్వాసితులు 22 వేల ఎకరాల భూములను త్యాగం చేశారు. అమరుల త్యాగాల నుంచి ఉద్భవించిన విశాఖ ఉక్కు పరిశ్రమ ఇప్పుడు 32 వేల మంది ఉద్యోగులు రేయింబవళ్లు చేస్తున్న శ్రమ ఫలితంగా సుమారు 20 వేల కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ పరిస్థితుల్లో సుమారు 16 నెలలుగా మూసి ఉన్న బ్లాస్ట్ ఫర్నేస్–3ని జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కి అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 19న దొంగచాటుగా ఎంఓయు చేయడం పట్ల కార్మికులు రగిలిపోతున్నారు. సంస్థ ప్రైవేటీకరణ వల్ల ప్రస్తుతం పరిశ్రమలో వేలల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్య వందలకు పడిపోయే అవకాశం ఉంది. ఉద్యోగాల భర్తీలో యాభై శాతం నిర్వాసితులకు కేటాయించాలని నిబంధన కూడా భవిష్యత్తులో అమలు కాకపోవచ్చు. ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు, రోస్టర్లు కనుమరుగవుతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఆ ఒప్పందం వల్ల నెలవారీ అమ్మకాలు రూ.500 కోట్లకు చేరుతాయని రూ.50 నుంచి వంద కోట్ల నష్టాలు తగ్గుతాయని, రూ.800 నుంచి రూ.900 కోట్ల రుణం కూడా లభిస్తుందని యాజమాన్యం ఇచ్చిన వివరణ కార్మికుల్ని సంతృప్తిపరచేదిగా లేదు. అందువల్ల కార్మికులు పరిశ్రమను కాపాడుకోడానికి అన్ని విధాలా సమాయత్తమవుతున్నారు. కావాలనే ప్లాంటులో నష్టాలను చూపించి, ఆ కారణంగా పరిశ్రమను ప్రైవేటుపరం చేయాల్సి వచ్చిందని నమ్మబలుకుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణవైపు వేస్తున్న అడుగులు వెనక్కి తీసుకోవాలి. ప్లాంటు కోసం సొంతంగా గనులు కేటాయించాలన్న చిరకాల డిమాండ్‌పై ఇకనైనా దృష్టి పెట్టాలి. పరిశ్రమ నష్టాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన ముడిసరుకు కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతున్న విధానాలను ఉపసంహరించాలి. లేని పక్షంలో ఉత్తరాంధ్రలో మరో ప్రజా ఉద్యమం అనివార్యం కాకతప్పదు.

విద్యాభారత వైతాళికురాలు

'ఫాతిమాషేక్' ఈ మధ్య కాలంలో బాగా వినబడుతున్న ఒక ప్రముఖమైన పేరు. ఆధునిక భారతదేశ తొలి టీచర్ సావిత్రిబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా, సంస్కర్తగా ఆమె పని చేశారు. ఒక్క ఫాతిమాషేక్ కాదు సామాజికంగా అనేక ఉద్యమాలు, సంస్కరణల్లో పాటుపడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ మహిళలను చరిత్రలో కనుమరుగు చేశారు. అందువల్ల భారత సమాజానికి వారి వీరోచిత పోరాటాలు, త్యాగాలు, బలాలు, చైతన్యాలు భావి తరాలకు తెలియకుండా పోయాయి. అట్లా పోవడానికి ఆధిపత్య కుల, ఆధిపత్య మత వివక్షలే కారణం. వారి చరిత్రలు అక్కడక్కడా ఆయా ప్రాంతాల్లో, స్థానిక భాషల్లో, స్థానిక చరిత్రల్లో, మట్టి పొరల్లో తవ్వి తీస్తే దొరుకుతున్నాయి.

ఫాతిమాషేక్ ఆధునిక భారతదేశ తొలి ముస్లిం టీచర్ అనే విషయం సావిత్రిబాయి పూలే తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలేకి రాసిన లేఖలో బయటపడింది. ఆ లేఖను ఆసరాగా చేసుకుని బ్రిటిష్ మిషనరీ లేఖలు, రిపోర్టులు, వ్యాసాలు, ఉర్దూ పుస్తకాలు, మరాఠి పుస్తకాలు, పత్రికలు, హిందీ పుస్తకాలు, సాహిత్యాలు, పుణె నగర స్థానిక మౌఖిక సమాచారాన్ని బట్టి జరిగిన పరిశోధనల్లో ఫాతిమాషేక్ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలియవచ్చినా ఆమె గురించిన సమాచారం లభ్యం కాలేదు. పుణె బుధవార్‌పేట్‌లో మౌఖికంగా చాలా సమాచారం ప్రచారంలో ఉందనీ, దీని ఆధారంగా ఫాతిమాషేక్ మీద విస్తృత సాహిత్యం వచ్చిందనీ పరిశోధక విశ్లేషణ.

భారతదేశం భిన్న సమాజాల అస్తిత్వ దేశం. దేశానికి అన్ని సమాజాల, సమూహాల సేవ, చైతన్యాల చరిత్రలు స్ఫూర్తి కావాలి. కుల, మత, జెండర్ సామాజిక అస్తిత్వాల చరిత్రలు తెలిసినప్పుడే ఆయా సమూహాల మధ్య పరస్పర గౌరవం, సామరస్య, మానవీయ స్నేహాలకు బలమైన పునాదులు ఏర్పడతాయి.


స్థానిక మౌఖిక సమాచారం విస్తృత వ్యాప్తిలో ఉన్నందువల్ల మహారాష్ట్ర బహుజన కులాల ఉద్యమకారులు, రచయితలు, చరిత్రకారులు, పరిశోధకులు, కళాకారులు ఎక్కడ, ఏ ఉద్యమం చేసినా సావిత్రిబాయి, జ్యోతిరావ్ పూలేలతో పాటు ఫాతిమాషేక్ స్మరణను ప్రస్తావించడం భాగమైనందువల్ల ఆ ఉదాత్తురాలి గురించి విశాల దేశానికి వెల్లడి అయింది. విద్యారంగంలో విస్మరించలేని కృషి చేసినందువల్లే ఫాతిమా చరిత్రను మహారాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ పాఠ్య పుస్తకం రెండవ తరగతి బాలభారతిగా పెట్టడం అనివార్యమైంది. కానీ ఫాతిమా ఒక్క ఉర్దూ వాళ్ళకే పాఠాలు చెప్పలేదు. అన్ని కులాల, మతాల వాళ్లను, మహిళలను విద్యావంతులను చేసిన గొప్ప సామాజిక అధ్యాపకురాలు. అట్లాంటి అధ్యాపకురాలిని ఉర్దూ పాఠం వరకే కుదించడం ఆమె విశాల మానవీయ చరిత్రకు అన్యాయం చేసినట్లే అవుతుంది. ఆమె చరిత్రను మరాఠీ పాఠ్యాంశాల్లోనే కాక మొత్తం భారతీయ భాషల్లోకి కూడా తేవాల్సి ఉంది.

అన్ని కులాల, మతాల వాళ్లను, మహిళలను విద్యావంతులను చేసిన గొప్ప సామాజిక అధ్యాపకురాలు ఫాతిమాషేక్. అన్ని భారతీయ భాషలలోని పాఠ్యపుస్తకాలలోనూ ఆమె చరిత్ర ఉండాలి.

ఫాతిమాషేక్ పుణెలోని గంజిపేట్ నివాసి. ఆమె జననం జనవరి 9, 1831. వీరి కుటుంబం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి గంజిపేట్‌లో స్థిరపడిన చేనేత వస్త్ర వ్యాపారులు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుని అన్న ఉస్మాన్ షేక్ ఆలనలో పెరిగింది. అణగారిన కులాలకు, మహిళలకు పాఠశాలలు పెట్టేందుకు, కులవివక్షను వ్యతిరేకిస్తున్న పూలే దంపతులను జ్యోతిబా తండ్రి బైటకు వెళ్లగొట్టినప్పుడు వారికి ఆశ్రయం ఇవ్వడమే గాక తమ ఇంటిలోని ఒక భాగాన్ని పాఠశాలగా ఇచ్చిన ఉదాత్తుడు ఉస్మాన్ షేక్.

ఎన్నో నిషేధాల్ని ధిక్కరించి బడుగువర్గాలవారి కోసం విద్యావ్యవస్థల్ని ఏర్పాటు చేసే గొప్ప లక్ష్యాలున్న పూలే దంపతులకు అండగా నిలిచారు ఫాతిమా, ఆమె సోదరుడు ఉస్మాన్. అట్లనే జ్యోతిరావ్ పూలే చదువు మధ్యలో ఆగిపోతే, తిరిగి జ్యోతిరావ్‌ను పాఠశాలకు పంపాలని ఆయన తండ్రిని ఒప్పించి, చివరికి ఒక మంచి మిషనరీ స్కూల్లో చేర్పించిన పండితుడు, బహుభాషాకోవిదుడు గంజిపేట్ నివాసి మున్షీ గఫార్‌బేగ్. తల్లిదండ్రుల్లేని ఫాతిమా ఆమె అన్న ఉస్మాన్‌కి కూడా ఆయనే పెద్దదిక్కు. ఈయన సహకారంతోనే ఫాతిమా కుటుంబం గంజిపేటలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నది. అట్లా జ్యోతిరావ్‌కు ముస్లిం సమాజాలతో చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ సంబంధాల వల్లనే ఆయన 'మానవ మహమ్మద్' అనే స్తుతి గీతం రాశారు.

ఫాతిమాషేక్‌కి మరాఠి, ఇంగ్లీషు విద్యలతో పాటు విద్యాబోధన శిక్షణ కూడా పూలే దంపతులే అందించారు. ఫాతిమాషేక్, సావిత్రిబాయి పూలేలు కలిసి అహ్మద్‌నగర్‌లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి బాలికా పాఠశాలల్ని గొప్పగా తీర్చిదిద్దారు. పూలే దంపతులు బాలికలకు ప్రత్యేక పాఠశాలలను 1848లోనే పెట్టి ఇంకా అనేక పాఠశాలల్ని నడిపారు. ఆ పాఠశాలలకు అధ్యాపకులుగా పూలే దంపతులు ఎక్కువగా బహుజన కులాల విద్యావంతులను ప్రోత్సహించారు.



బాలికల పాఠశాలలకు మగ టీచర్లుంటే తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని పంపేవారు కాదు. అసలు ఆడపిల్లలకు 'చదువు చెరుపు' అనే భావనలో ఉండేవారు. మహిళా టీచర్లు లేరు. అట్లాంటి పరిస్థితుల్లో సావిత్రిబాయి చదువుకొని వారికి పాఠాలు చెప్పింది. ఆమె ఆదర్శంగా ఫాతిమా కూడా పూలే పాఠశాలలో చదువుకొని పాఠాలు చెప్పడానికి ముందుకొచ్చింది. వీరిద్దరూ అహ్మద్‌నగర్‌లోని 'మేడమ్ సింథియా ఫెరారె' మిషనరీలో పూర్తిస్థాయి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలో టీచర్ ట్రైనింగ్ చేసిన తొలి మహిళా అధ్యాపకులుగా సర్టిఫికెట్ పొందారు. అట్లా ఉపాధ్యాయ వృత్తివిద్యా శిక్షణ పొందిన తొలి ముస్లిం మహిళ ఫాతిమాషేక్.

పాఠశాలకు తమ ఆడపిల్లల్ని పంపని ఇండ్లకు పోయి బాలికా విద్య ప్రాముఖ్యత, అవసరాన్ని చెప్పి, తిరిగి బాలికలను పాఠశాలకు రప్పించేవారు సావిత్రిబాయి, ఫాతిమా. దీనిని ముస్లిం సమాజాలు, మత పెద్దలు తీవ్రంగా వ్యతిరేకించేవారు, దాడులు చేసేవారు. పాఠశాలకు వెళ్ళనిచ్చేవారు కాదు. ఇంకో వైపు హిందూ అగ్రవర్ణాల నుంచి కూడా దాడులు, వ్యతిరేకతలు, అడ్డంకులెదురయ్యేవి. వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొన్నది ఫాతిమాషేక్. పరదా చాటు ఇంటి నుంచి బైటకొచ్చి ఇల్లిల్లూ తిరిగి ఇతర బాలికలతో పాటు ముస్లిం బాలికలను కూడా పాఠశాలలో చేర్పించడం ఒక ముస్లిం మహిళగా పెద్ద సాహసమే. ఎన్ని కష్టాలెదురైనా బాలికా పాఠశాలలను ధైర్యంగా కర్తవ్య దీక్షతో ఉపాధ్యాయినిగా ముందుకు నడిపారు. సావిత్రిబాయి ఆరోగ్యం బాగోలేక పుట్టింటికి పోయినపుడు... ఫాతిమా సేవలుండగా పాఠశాలలకు లోటు రాదు, ఆమెకు ఎక్కువ శ్రమ ఇస్తున్నానని జ్యోతిరావు పూలేకి రాసిన ఉత్తరాన్ని బట్టి ఫాతిమాషేక్ వారికి ఎంత ప్రథమురాలో అర్థం అవుతుంది. ఇదే ఫాతిమాషేక్ చరిత్రకు ఆయువు పట్టు.

పూలే పాఠశాల నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా అణగారిన కులాలకు, మతాల సమాజాలకు ఉపాధ్యాయినిగా, సామాజిక కార్యకర్తగా, సంఘసంస్కర్తగా, సావిత్రిబాయి పూలే సహచరిణిగా ఫాతిమా చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటారు. ఆధునిక భారతదేశ మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ గురించి సమగ్రంగా తెలుగు ప్రజలకు తెలియజేసిన జర్నలిస్టు, పరిశోధకులు, రచయిత సయ్యద్ నసీర్ అహమ్మద్ అభినందనీయులు.

■ సుభద్ర జె.

ఉంటాయా.. ఊడుతాయా?

వైసీపీలో టికెట్లు దక్కని వారితోపాటు టికెట్లు దక్కించుకున్న వారిలోనూ అసంతృప్తి.. అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ సెంట్రల్ టికెట్ దక్కించుకున్న వెలంపల్లి శ్రీనివాసరావును ఆ స్థానం నుంచి తప్పించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై స్పష్టత ఉన్న వెలంపల్లి ఇప్పటికే ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో నిమగ్నమైనట్టు సమాచారం. మరోవైపు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టికెట్ దక్కించుకున్న షేక్ ఆసిఫ్ విషయంలోనూ చివరి నిమిషంలో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

వైసీపీలో సీట్ల లొల్లి



మచిలీపట్నం ఎంపీగా సారథిని నిలిపే యోచన

సుముఖత చూపని సారథి

- వెలంపల్లి, ఆసిఫ్ టికెట్లపై సందిగ్ధత
- పశ్చిమ నుంచే పోటీకి వెలంపల్లి మొగ్గు
- బీజేపీ పెద్దలను కలిసినట్టు ప్రచారం
- సీఎంవోకు క్యూకట్టిన రెండు జిల్లాల ఎమ్మెల్యేలు
- పేర్ని, కొడాలి, కైలే, సింహాద్రి, పార్థసారథి
- ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కూ సీఎంవో నుంచి పిలుపు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన ప్రస్తుత పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లికి సెంట్రల్ టికెట్ కూడా దక్కకపోవచ్చని సమాచారం. సెంట్రల్ నుంచి తనకు టికెట్ ఖరారు చేయడంపై వెలంపల్లి పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం అక్కడి నుంచి పోటీ చేస్తే తాను ఓడిపోవడం ఖాయమన్న విషయాన్ని తన సన్నిహితుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. తనకు పట్టున్న పశ్చిమ నుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు సగమైనా ఉండేవని, సెంట్రల్ నుంచి గెలుపు అసాధ్యమని వెలంపల్లి తన సహచరులతో వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. చాలా మందికి టికెట్లు గల్లంతవుతుండటంతో కనీసం తమ నాయకుడికి ఎక్కడో ఒకచోట టికెట్ ఇవ్వడంతో పరువు దక్కిందన్న భావనలో వెలంపల్లి శిబిరం ఉంది. సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే సొంత పార్టీ నాయకులే సహాయ నిరాకరణ చేస్తారన్న భయం వెలంపల్లిని వెంటాడుతోంది. మరోవైపు కాపు, బ్రాహ్మణ సామాజికవర్గాల ఆధిపత్యం ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో నెట్టుకురావడం కష్టమన్న భావనలో వెలంపల్లి శిబిరం ఉంది. వీటికితోడు ఇప్పటికే స్థానికేతరుడన్న ప్రచారం నియోజకవర్గంలో ఊపందుకుంది.

మొండితోకకు నో.. సారథికి బుజ్జగింపులు

ఎన్టీఆర్ జిల్లా నుంచి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి టికెట్ నిరాకరించిన వైసీపీ అధిష్ఠానం. రక్షణనిధికి సైతం టికెట్ ఇవ్వడం లేదని స్పష్టం చేసింది. తాజాగా నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుకు సైతం టికెట్ ఇవ్వడం లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదే విషయాన్ని సోమవారం ఎమ్మెల్యే సోదరుడు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌ని పిలిచి తెలియజేసినట్టు సమాచారం. కృష్ణా జిల్లా నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు సోమవారం సీఎంవోకి తరలివెళ్లారు. పేర్ని నాని, కొడలి నాని, కైలే అనిల్‌కుమార్, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేశ్ సీఎంవోకి వచ్చారు. పార్థసారథిని బుజ్జగించడంలో భాగంగా సీఎంవోకి పిలిపించినట్టు సమాచారం. సారథికి పెనమలూరు టికెట్ కాకుండా మచిలీపట్నం ఎంపీ స్థానం ఇవ్వాలన్న యోచనలో వైసీపీ పెద్దలు ఉన్నారు. అయితే ఎంపీగా పోటీకి సారథి విముఖత చూపుతున్నారు. మంత్రిగా తనకు అవకాశం ఇవ్వలేదన్న అసంతృప్తితోపాటు ఈసారి వైసీపీ అధికారంలోకి రావడం కష్టమేనన్న ఆలోచనలో ఉన్న సారథి టీడీపీ నుంచి బరిలోకి దిగాలని యోచిస్తున్నారు. పెనమలూరు నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న సారథికి టీడీపీ పెద్దలు నూజివీడు నుంచి బరిలోకి దిగాలని సూచిస్తున్నారు. ఈ పంచాయితీ తెగకముందే వైసీపీ పెద్దల నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు అందరూ సహకరిస్తారని, మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని పార్టీ పెద్దలు సారథిని కోరినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనకు సారథి నో చెప్పినట్టు సమాచారం.

చాపకింద నీరులా గౌతం ప్రయత్నాలు

ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతం రెడ్డి చాపకింద నీరులా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని పైకి చెబుతున్నా స్థానిక నాయకులకే టికెట్ దక్కించుకునే ప్రయత్నాలు చేయడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశంగా ఉంది. అందులో భాగంగా 30వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ జానారెడ్డి పేరును తెరపైకి తెస్తున్నారు. జానారెడ్డి సైతం సెంట్రల్ సీటు కోసం తన ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. మరోవైపు వెలంపల్లి సైతం పశ్చిమ నుంచే పోటీలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. అవసరమైతే పార్టీ మారి అయినా పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలను వెలంపల్లి కలిశారన్న ప్రచారం జరుగుతోంది.

నగరంలో సీఈసీ

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు స్వాగతం పలికిన అధికారులు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న భారత ఎన్నికల సంఘం చీఫ్ రాజీవ్ కుమార్

గన్నవరం, జనవరి 8 : భారత ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా స్వాగతం పలికారు. సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి బయలుదేరి ఎయిర్ ఇండియా విమానంలో రాజీవ్ కుమార్‌తోపాటు ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ గన్న వరం విమానాశ్రయానికి చేరారు. వారికి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి కృష్ణ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వాగతం పలికారు. నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో పార్లమెంట్, అసెంబ్లీ - 2024 ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించే సదస్సులో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ పాల్గొననున్నారు. విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన నగరంలోని నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. నోవాటెల్ హోటల్ వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్‌వి.నాగేశ్వరరావు స్వాగతం పలికారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు





మున్సిపల్ కార్మికులను బలవంతంగా లాగుతున్న పోలీసులు

విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది. కొద్దిరోజులుగా విజయవాడలోని ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న కార్మి కులు సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో కలెక్టరేట్ చుట్టుపక్కల ప్రాంతాలకు కార్మికులు గుంపులు గుంపులుగా చేరుకున్నారు. అక్కడి నుంచి బ్యాచ్‌ల వారీగా కలెక్టరేట్‌కు చేరుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు అన్ని మార్గాలను మూసివేశారు. మ్యూజియం రోడ్డులోను మూసివేసి బారికేడ్లు పెట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన ఉండడంతో అర్జీదారులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత లోపలకు పంపారు. అర్జీదారుల ముసుగులో కొంతమంది కార్మికులు కలెక్టరేట్‌లోకి ప్రవేశించి నినాదాలు చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేసి వాహనాల్లోకి ఎక్కించారు. 100 మంది కార్మికులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తమను అణచివేయాలని చూస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు అరెస్టు చేయడంతో కార్మికులు ఎదురుతిరిగారు. దీనితో ఇద్దరికీ మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో కొంతమంది కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వారిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అనంతరం పూచీకతులపై విడుదల చేశారు.

కమిషనరేట్‌కు కొత్త ముఖాలు

ఎన్నికల నేపథ్యంలో భారీగా బదిలీలు

రేంజ్ పరిధిలో 26 మంది బదిలీ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు కొత్త ముఖాలు రాబోతున్నాయి. విజయవాడ నగరంలో పనిచేస్తున్న మెజారిటీ ఇన్‌స్పెక్టర్లు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. కాకినాడ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి ఇన్‌స్పెక్టర్లు ఇక్కడికి వస్తున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో మొత్తం 26 మంది ఇన్‌స్పెక్టర్లను మార్పు చేస్తూ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో విజయవాడ నగరం శాంతిభద్రతల స్టేషన్లు, సీసీఎస్, ట్రాఫిక్ స్టేషన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లను ఏలూరు రేంజ్‌కు బదిలీ చేశారు. కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఇప్పటికే బదిలీలపై వచ్చిన ఇన్‌స్పెక్టర్లు పోలీసు కమిషనర్ టి.కాంతిరాణాను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. రేంజ్ నుంచి బదిలీపై వచ్చిన వారికి కొద్దిరోజుల్లో పోస్టింగ్‌లు ఇస్తారు. కాకినాడ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న కె.కిషోర్‌బాబును ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఉన్న తిప్పా గణేష్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ్‌కుమార్, పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెం నుంచి ఎస్‌ఎస్‌ఎస్‌వీ నాగరాజు, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సర్కిల్ నుంచి బలమూరి వెంకటేశ్వరరావును ఎన్టీఆర్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఏలూరు రేంజ్‌లో వీఆర్‌లో కోమాకుల శివాజీని ఇక్కడికి పంపారు. విజయవాడ కొత్తపేట ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్రహ్మణ్యం, గుణదల ఇన్‌స్పెక్టర్ పి.కృష్ణమోహన్, ట్రాఫిక్‌లో ఉన్న పేరవలి రామచంద్రరావు, అబ్దుల్ సలాం, బి.బాలమురళీకృష్ణ, వి.జానకిరామయ్య, ఎస్‌ఈబీలో ఉన్న కేవీ కృష్ణకుమార్, సీసీఎస్‌లో ఉన్న పి.కృష్ణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ పి.సత్యానందం, సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ బీహెచ్ వెంకటేశ్వర్లు, గవర్నరుపేట ఇన్‌స్పెక్టర్ ఎ.నాగమురళీ, కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఎంవీ దుర్గారావు, నున్న ఇన్‌స్పెక్టర్ కాగిత శ్రీనివాసరావును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేశారు. విజయవాడ ట్రాఫిక్ 1 ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్, ట్రాఫిక్ 2 ఇన్‌స్పెక్టర్ కె.క్రిష్టోఫర్, ట్రాఫిక్ 3 ఇన్‌స్పెక్టర్ ఐడీ సువర్ణరావును రేంజ్‌కు బదిలీ రేశారు. సీసీఎస్‌లో ఉన్న ఎం.రామ్‌కుమార్, వి.శ్రీనివాసరావు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ జీవీ వినయ్‌మోహన్, వీఆర్‌లో ఉన్న ఆర్.అంకబాబును ఏలూరు రేంజ్‌కి బదిలీ చేశారు.

పందెంకోళ్లు రెడీ

పుంజు ధర రూ.50వేల నుంచి రూ.లక్షల్లో

- పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు



హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 8 : తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగైన సంక్రాంతి సందర్భంగా మూడురోజుల పాటు మూడు జిల్లాల్లో నిర్వహించే కోడిపందేలకు పుంజులను వివిధ ప్రాంతాల్లో సిద్ధం చేస్తున్నారు. పందేనికి ఎంపిక చేసుకున్న పుంజును బట్టి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో డిమాండ్ ఉంటుంది. ఎంపిక చేసుకున్న పుంజులను ప్రత్యేక ఏర్పాట్లతో రూ.వేలల్లో ఖర్చుపెట్టి మరీ తయారు చేయిస్తున్నారు. పందెం కోడికి పెట్టే పౌష్టికాహారం ఖర్చే రూ.30 వేలకుపైగా ఉంటుందంటే పందెం రాయుళ్లు ఎంత భారీగా ఖర్చు చేస్తున్నారో అర్థమవుతోంది. కృష్ణా, గోదావరి జిల్లాలోని బాపులపాడు, నూజివీడు రూరల్, పెదపాడు, పెనమలూరు తదితర మండలాల్లో కొందరు పందెంరాయుళ్లు నిర్వహిస్తున్న కేంద్రాల్లోకి ఇతరులెవరూ రాకుండా సీసీ కెమెరాలో నిఘా ఏర్పాట్లు చేశారంటే ఎంత జాగ్రత్తగా కోడిపుంజులను పందేలకి సిద్ధం చేస్తున్నారో తెలుస్తోంది. సంక్రాంతికి మాత్రమే పందెంకోళ్ల వ్యాపారం రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకూ జరుగుతుందని కేంద్ర నిర్వాహకుడు ఒకరు తెలిపారు. ఎంపిక చేసుకున్న పుంజులను ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యులు పర్యవేక్షిస్తారని, పందెం గెలిచేందుకు ప్రత్యేక వ్యాయామం, పౌష్టికాహారం అందిస్తూ సంక్రాంతికి బరిలో దించుతామన్నారు.

ఆన్‌లైన్ ద్వారా కూడా కోడిపుంజు రెడీ

దేశ, విదేశాల్లో నివసించే వారికి సొంత ఊరిలో జరిగే కోడి పందేలపై ఆసక్తితో ఆన్‌లైన్‌లో పుంజులను కొనుగోలు చేసి పెంపకందారులకు అడ్వాన్స్‌లు కూడా కట్టేస్తున్నారు. పందెం కోళ్ల పెంపకం, బరిలో దిగేందుకు చేసే సన్నద్ధత తదితర వివరాలను వీడియో కాల్ ద్వారా చూస్తూ సూచనలు కూడా చేస్తుంటారని నిర్వాహకులు తెలిపారు.

కొవ్వు పట్టకుండా ప్రత్యేక వ్యాయామాలు



- పందేనికి సిద్ధం చేసే కోడి శరీరాకృతిని బట్టి ఉడకబెట్టిన మటన్, బాదం, వెల్లులి, ఖర్జూరాలతో పాటు కోడిగుడ్డును ఆహారంగా ఇస్తామని తెలిపారు. పౌష్టికాహారం వల్ల కోళ్లకు కొవ్వు పెరగకుండా ప్రత్యేక వ్యాయామాలు చేయిస్తూ బరిలో ఉన్న కోడిపై ఎగిరి విరుచుపడేందుకు (నీటి తొట్లో ఈత, ఎత్తుపై నుంచి వదిలివేయడం) రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేయిస్తూ పందానికి సిద్ధం చేస్తుంటామని నిర్వాహకులు తెలిపారు. శరీరం గట్టి పడేందుకు వేప, కుంకుడు, వెదురు, తుమ్మబెరడు, పసుపు కొమ్ములు తదితర 20 రకాల వాటితో కాసి మరిగించిన ద్రావణంలో చల్లార్చిన తర్వాత పందెం కోడిని ఉంచి పై నుంచి నీళ్ల పోతలు పోస్తామన్నారు. తరువాత లిక్కర్ (మందు) ఆవిరి పట్టిన గుడ్డతో కోడి శరీరం తుడవడంతో బరిలో దిగిన తర్వాత దెబ్బలు తట్టుకునే విధంగా కోడి శరీరం తయారవుతుంది. అందుకే పందెం గెలిచినా, ఓడినా కోడిపుంజు ధర వేలల్లో ఉంటుంది.
- కోడిపందేలపై సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ప్రవాసాంధ్రులకు కూడా ఆసక్తి పెరగడంతో రానురాను కోడిపుంజుల పెంపకం కుటీర పరిశ్రమగా మారి వృద్ధి చెందుతోంది. ఆసక్తి పెరిగిన కొద్దీ కోడిపందేలకు పుంజులను సిద్ధం చేయడంలో వినూత్న ప్రక్రియలు చోటుచేసుకోవడం వాటి లాభాలు కనబడటంతో కొందరు కోడి పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



• బెదిరింపులకు భయపడం

'ఎస్మా ప్రయోగించినా... పోలీసులను ఉసిగొల్పినా... ఉద్యోగం తొలగించినా... వెనుకడుగు వేయం. మాకు ఇచ్చిన హామీని అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తాం' అంటూ అంగన్వాడీలు నినదించారు. 28వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీలకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుగా నిలుస్తున్నాయి. - ధర్నాచౌక్

కారుకు మోటార్ సైకిల్ అడ్డు తీయలేదని

రాళ్లతో కొట్టి వ్యక్తి హత్య

ఇద్దరిపై కేసు నమోదు

- పాయకాపురంలో దారుణం

- 6లో..

భూ హక్కు చట్టం వస్తే పేదల ఆస్తులకు రెక్కలు

- న్యాయవాదుల దీక్షకు లక్ష్మీనారాయణ సంఘీభావం

- 6లో..



న్యాయవాదుల నిరసనదీక్షలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

భూ హక్కు చట్టం వస్తే పేదల ఆస్తులకు రెక్కలు

» న్యాయవాదుల దీక్షకు లక్ష్మీనారాయణ సంఘీభావం

విజయవాడ లీగల్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022 అమలులోకి వస్తే కనీస న్యాయశాస్త్ర అవగాహన లేని వారు ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్లవుతారని, దీనివల్ల పేదల ఆస్తులకు రెక్కలొచ్చినట్టేనని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. భూ హక్కు చట్టంకు వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రిజిస్టర్‌లో ఒకసారి భూ హక్కుదారుని పేరు నమోదైన తర్వాత ఈ భూములపై ఎవరూ కోర్టులకు వెళ్లే అవకాశం వుండదనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజల ఆస్తి హక్కును న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి ప్రభుత్వ అధికారులకు అప్పగించి వారిని ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్లుగా నియమిస్తే అవినీతిమయం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన సంపూర్ణ మద్దతు న్యాయవాదులకు వుంటుందన్నారు. దీక్షలో న్యాయవాదులు ఆలూరి సుధాకర్, చిలువేరు మార్కండేయ, ఆవుల వెంకటరావు, ఎస్.రాంప్రసాద్, ఎం.ప్రేమలత, జి.జీవన ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26వ తేదీన మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారత గణతంత్ర జిల్లాస్థాయి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన సమావేశపు హాలులో సోమవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గణతంత్ర వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశభక్తిని చాటేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చాటిచెప్పేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఉత్తమ సేవాపురస్కారాల జాబితాను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 9 నుంచి 11వ తేదీవరకు జరగనున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పి.రోజా, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజుతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్రమంత్రి గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులతో జిల్లా పంచాయతీ అధికారి సమన్వయం చేసుకుని కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎస్‌వో పార్వతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



జేసీ అపరాజిత సింగ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా

అపరాజిత సింగ్‌కు ఘనంగా వీడ్కోలు

మచిలీపట్నం టౌన్, జనవరి 8 : కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన అపరాజిత సింగ్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. జెడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, డీఆర్వో రోజా, ఆర్డీవో వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అపరాజితసింగ్ చేసిన కృషిని అధికారులు ప్రస్తావించారు. జ్ఞాపికలు, శాలువాలతో ఆమెను సత్కరించారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి : ఢిల్లీరావు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 8 : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావులు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. స్పందనలో 161 అర్జీలు నమోదుకాగా.. రెవెన్యూ 84, పోలీస్ శాఖకు 19 అర్జీలు వచ్చాయి. పంచాయితీరాజ్-7, పౌరసరఫరాలు-6, హౌసింగ్-5 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కారం వుండాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బందరులో తెలుగు యువత ర్యాలీ, ధర్నా

మచిలీపట్నం టౌన్, జనవరి 8 : నాలుగేళ్లుగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగ యువతకు సీఎం జగన్ మొండిచేయి చూపారని కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుంచి తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దండమూడి చౌదరి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో జగన్ ప్రతీఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం తెలుగు యువత అధ్యక్షుడు సలీం, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అహమ్మద్ బేగ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం సమర్పించారు.

అంగన్వాడీలపై ఎస్మా దుర్మార్గం

భగ్గుమన్న కార్మిక సంఘాలు

» తక్షణం ప్రభుత్వం రద్దు చేయాలి
» ఉద్యోగులు, కార్మికుల సమ్మెకు మద్దతు
» సమ్మె పరిష్కరించకుంటే బంద్‌కు సిద్ధం
» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



వన్‌టౌన్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ నేతలు

గవర్నర్‌పేట/వన్‌టౌన్, జనవరి 8 : సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్‌పై ఎస్మా ప్రయోగించడాన్ని అప్రజాస్వామిక చర్య అని, అలాంటి జీవోలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్స్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల జీతాలు పెంచాలని, ఎస్మా చట్టం రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, సమ్మెను పరిష్కరించకపోతే రాష్ట్ర బంద్‌కు కూడా వెళతామని సమావేశంలో వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిని బట్టి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని నేతలు స్పష్టం చేశారు. జై



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

భారత్ (నేషనల్) పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించాలని కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చొరవ చూపకుండా సమ్మె చేస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ, అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగితే వారిపై ఎస్మా ప్రయోగించి జనవరి 8లోగా విధుల్లో చేరాలని అంగన్వాడీలకు డెడ్‌లైన్ విధించి బెదిరించడం హేయమైన చర్య అన్నారు. సమస్యలపై సంబంధిత సంఘాలతో చర్చించి సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, అంగన్వాడీలు లక్షమందికి పైగా పిల్లలు, మహిళలు, గర్భిణీలకు సేవలందిస్తున్నారని, సేవలు పొందుతున్న వారు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. గతంలో ఇచ్చిన హామీని మాత్రమే అమలు చేయమని వారు అడుగుతున్నారని, కొత్తగా కోరిన డిమాండ్లు కాదని అన్నారు. కార్మికుల సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా ఉంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా బంద్

» సీపీఎం హెచ్చరిక

మునిసిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేతలు మధు, చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సీఐటీయూ ఇచ్చిన పిలుపుమేరకు మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ శ్రేణులు బందర్‌రోడ్డులోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు సీహెచ్ బాబూరావు, బోయ సత్తిబాబు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జ్యోతిబసుతో పాటు సుమారు 50 మందిని గవర్నరుపేట పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మధు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు, నాయకులు ఈవీ నారాయణ, వెంకట్రావు, ఎస్.సుబ్బారెడ్డి, ఐద్వా మహిళా సంఘం పశ్చిమ నగర కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ స్టేషన్ ఎదుట కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ, కార్మికులను అరెస్టు దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలన తీరుపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త బంద్ అవసరం వస్తుందని హెచ్చరించారు.

ఎస్మా జగన్ పైశాచికానికి పరాకాష్ట

» తిరువూరు సభ సక్సెస్‌తో జగన్‌పై ప్రజా వ్యతిరేకత తేటతెల్లం
» రంగుల పిచ్చితో రాష్ట్రాన్ని నాశనం చేశారు
» కాంట్రాక్టర్లు బ్లాక్ లిస్టులో పెట్టిన ప్రభుత్వం ఇదే
» ప్రజల తలసరి అప్పు రూ.15లక్షలు దాటింది : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, జనవరి 8 : లక్షకు పైగా అంగన్వాడీ మహిళలు 29 రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోకుండా ఎస్మా ప్రయోగించటం జగన్ పైశాచికానికి పరాకాష్ట అని మాజీ మంత్రి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. తిరువూరు సభ విజయవంతంతో జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, చంద్రబాబుపై ప్రజలకు ఉన్న విశ్వాసం తేటతెల్లమైందని స్పష్టం చేశారు. సోమవారం తన నివాసంలో విలేకర్ల సమావేశంలో నెట్టెం మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వాలు తప్పులు చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టేవని, జగన్ హయాంలో రివర్స్ జరుగుతోందని కాంట్రాక్టర్లే ప్రభుత్వాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అమలు చేసిన వంద సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ రానున్న వంద రోజుల్లో ఇంటికి వెళ్లటం ఖాయమన్నారు. మద్యం, ఇసుక, విద్యుత్ చార్జీల రూపంలో ప్రజల డబ్బు లాగేసుకుని.. సగటున నాలుగున్నరేళ్లలో తలసరి రూ.15లక్షల అప్పులు చేశాడని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పథకాలకు జగన్ రంగులు వేసుకుని.. ప్రజాధనాన్ని రూ.3500 కోట్లు దుర్వినియోగం చేశాడని, సర్వే రాళ్ల నుంచి పాస్ బుక్‌ల వరకు తన చిత్రాలు వేసు కోవటం ఆయన పిచ్చికి పరాకాష్ట అని విమర్శించారు. చంద్రబాబును తప్పుడు కేసులో ఇరికిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కుల మత ప్రాంతాలకు అతీతంగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారని, చంద్రబాబుకున్న విశ్వసనీయత అదని నెట్టెం అన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ఎంఎస్ బేగ్, ఎస్.రామకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గింజుపల్లి రమేష్, గట్టిడి దుర్గాప్రసాద్, కట్టా నరసింహారావు, మేకా వెంకటేశ్వర్లు, అన్వర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రా కదలిరా సభ విజయవంతంపై
శావల దేవదత్ కృతజ్ఞతలు

తిరువూరు : పట్టణంలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 'రా కదలిరా' బహిరంగ సభ విజయవంతం చేసిన పార్టీశ్రేణులు, ప్రజలకు నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే.. సైకో జగన్‌రెడ్డి మద్యం, గంజాయి మాఫీయాను దిగుమతి చేశాడని ఆరోపించారు. సైకో పాలనకు చరమగీతం పలికి సైకిల్ పాలన తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కౌన్సిలర్లు షేక్ అబ్దుల్ హుస్సేన్, నాళ్లా సురేంద్ర, బీసీసెల్ నాయకుడు పి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

వైసీపీ పని ముగిసినట్టే

» మాజీమంత్రి దేవినేని ఉమా



రెడ్డిగూడెం, జనవరి 8 : రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలను మార్చినా వైసీపీ ఓటమి తలరాతను ఎవరూ మార్చలేరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. రెడ్డిగూడెంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, 'రా కదిలిరా' సభలకు వస్తున్న అశేష జనాన్ని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి, మంత్రులు పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. జగన్ తన ఎమ్మెల్యేలను నమ్మడం లేదని, జనం జగన్‌ను నమ్మడం లేదన్నారు. మూడు ముక్కలాటతో అమరావతిని నాశనం చేశాడన్నారు. ఒక్క చాన్స్ అని ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చి గుద్దులు గుద్దుతున్నాడన్నారు. పట్టిసీమను పాడు పెట్టాడన్నారు. డీఎస్సీకి దిక్కులేదన్నారు. అన్న క్యాంటీన్ కట్, పండుగ కానుకలు కట్, పెళ్లి కానుక కట్, చంద్రన్న బీమా కట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్, రైతుల సబ్సిడీలు కట్ ఇలా 100కు పైగా సంక్షేమ పథకాలు రద్దు చేశాడన్నారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని, ముక్త కంఠంతో ఏపీ హేట్స్ జగన్ అని అంటున్నారన్నారు. సమావేశంలో ముప్పిడి నాగేశ్వర రెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు, పోతురాజు బాలకృష్ణ, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, బెల్లంకొండ రాజ, ఇశ్రాయేలు, మల్లాది పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు పీడబ్ల్యూడీ తప్పనిసరి

» ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి
» విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు



విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 8 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి ముఖ్యమైనదని, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. సోమవారం పింగళి వెంకయ్య సమావేశమందిరంలో భారత ఎన్నికల సంఘం-సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు నమోదు, పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిజబిలిటీ) మార్కింగ్, హోం ఓటింగ్ తదితరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం 40 శాతం, అంతకంటే అధిక వైకల్యమున్న వారికి, 80 ఏళ్లు, ఆపై వయసున్న వయోవృద్ధులకు ఇంటి దగ్గర నుంచే ఓటు వేసే హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు వినియోగించుకోవడం ముఖ్యమని, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలతో పాటు బీఎల్‌వోల ద్వారా తమ ఓటు వివరాలు తెలుసుకోవాలన్నారు. ఒకవేళ ఓటు నమోదు కాకుంటే వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు. 40 శాతం, అంతకంటే అధిక వైకల్యమున్నవారు 80 ఏళ్లు ఆపై వయసున్న వయోవృద్ధులు ఇంటిదగ్గిరి నుంచే హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకొనేందుకు తప్పనిసరిగా ఫారం 8 సహాయంతో పీడబ్ల్యూడీ మార్కింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ అంశంపై విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాలు తమ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో హోం ఓటింగ్ విధానాన్ని పూర్తిస్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పోలింగ్, భద్రతా సిబ్బంది వున్న ప్రత్యేక బృందం హోం ఓటింగ్‌లో భాగస్వామ్యమవుతుందని, వీడియోగ్రఫీ కూడా చేయడం జరుగుతుందని వివరించారు. త్వరలో ఓటు, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, జిల్లా యువజన సంక్షేమ అధికారి, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాస్‌లతో పాటు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేమూరి బాబురావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రబాబు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు బి.రమేష్, ఎస్‌కే చాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు చట్టరీత్యా నేరం

కృష్ణలంక : కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలో కోడి పందేలు జరగకుండా చర్యలపై సోమవారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కోడిపందేలు నిర్వహించడం-పాల్గొనడం చట్టరీత్యా నేరమని ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్ట ప్రకారం కోడిపందేలను నిషేధించడం జరిగిందన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడా కోడి పందేలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్, ఏడీ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన, వైసీపీ జెండాలతో పార్టీశ్రేణుల నినాదాలు

విగ్రహావిష్కరణలోనూ జగన్ జపం!

» రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత
» జనసేన నేతపట్ల దురుసుగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు
» కార్యక్రమంపై ఆసక్తి చూపని కాపు సామాజిక వర్గం

మైలవరం, జనవరి 8 : పట్టణంలో రాధా, రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. పార్టీలకు అతీతంగా అని చెప్పినా అంతా వైసీపీ హవానే కొనసాగింది. దానిని జీర్ణించుకోలేని జనసేన నేతలు పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. పోటా పోటీగా రెండు పార్టీలు జెండాలను ప్రదర్శించారు. వేదికపై వైసీపీ నేతలు జగన్ జపం చేయడంతో జనసేన నేతలు విస్మయం వ్యక్తం చేశారు. జనసేన మైలవరం నియోజవకర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) వేదికపై మాట్లాడుతుండగా రంగాను ఎవరు చంపారో చెప్పాలని త్రీవస్థాయిలో వైసీపీ నేతలు వత్తిడి తేవడంతో పాటు దురుసుగా ప్రవర్తించారు. రంగా విగ్రహావిష్కరణకు రాధా రంగా మిత్ర మండలి దూరంగా ఉండటానికి కారణం అక్కడ వైసీపీ ఆధిపత్యమే అనే టాక్ వినపడుతోంది.

బీసీలు సంఘటితం కావాలి

» గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జనవరి 8 : టీడీపీ హయాంలో బీసీల సంక్షేమానికి జరిగిన కృషిని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నేతలు దిశా నిర్దేశం చేశారు. గుడివాడలో సోమవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము మాట్లాడుతూ, పార్టీకి బీసీలు గుండెకాయ లాంటివారన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి టీడీపీ విజయానికి



కృషి చేయాలని కోరారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ, బీసీ కార్పొరేషన్‌కి చెందిన రూ.75 వేల కోట్ల నిధులను జగన్ దారి మళ్లించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) మాట్లాడుతూ, చట్టసభల్లో, మంత్రివర్గంలో బీసీలకు స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బీసీలకు సబ్ ప్లాన్ కింద 43 వేల కోట్ల రూపాయలు తెలుగుదేశం పార్టీ ఖర్చు పెట్టిందన్నారు. బీసీలకు మంచి రోజులు రావాలంటే చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కృష్ణా జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నెరుసు కాశీ, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు అంగడాల శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ వద్ద మృతుడి బంధువుల ఆందోళన

కారుకు మోటార్ సైకిల్ అడ్డు తీయలేదని

రాళ్లతో కొట్టి వ్యక్తి హత్య


» ఇద్దరిపై కేసు నమోదు
» పాయకాపురంలో దారుణం



పాయకాపురం, జనవరి 8 : నగర శివారు పాయకాపురంలో దారుణం చోటు చేసుకుంది. కేవలం కారుకు మోటార్ సైకిల్ అడ్డువచ్చిందని ఇద్దరు యువకులు మరో వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. రాళ్లతో తలపై కొట్టి అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి నెట్టివేశారు. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేలుకుట్ల మాలకొండయ్య (41) స్థానిక ఎల్‌బీఎస్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ముఠా కార్మికుడైన మాలకొండయ్య ఆదివారం రాత్రి స్నేహితులు వెంకటేశ్వరరావు, రామయ్యలతో కలిసి పైపుల రోడ్డు నుంచి ఎల్‌బీఎస్‌నగర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. లక్ష్మీనగర్ ప్రాంతానికి రాగానే వీరి వాహనానికి ట్రావెల్ బస్సు అడ్డు వచ్చింది. బస్సు మలుపు తిరుగుతుండటంతో మోటార్ సైకిల్‌ను ఆపారు. అంతలో వెనుక నుంచి వచ్చిన కారులో వచ్చినవారు హారన్ మోగించడంతో వెళ్లేందుకు దారి లేదు కదా అని సమాధానం చెప్పారు. దాంతో కారులో ఉన్న వరుసకు తోడల్లుళ్లయిన కంచర్ల సాయి(28), ఆత్మకూరి రామరాజు(27)లు వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు తోపులాటకు దిగటంతో ఆగ్రహంతో రెచ్చిపోయిన సాయి, రామరాజు మోటార్ సైకిల్‌పై ఉన్న మాలకొండయ్య, వెంకటేశ్వరరావులపై దాడికి దిగారు. దాడిలో వెంకటేశ్వరరావు పక్కకు పడిపోగా మాలకొండయ్య తలపై నాపరాయితో దాడిచేశారు. కాళ్లతో విచక్షణా రహితంగా తన్ని పక్కనే ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి తోసేసి కారులో వెళ్లిపోయారు. స్థానికులు, బాధితుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మాలకొండయ్య సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో బంధువులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేయడంతో వారు శాంతించారు. కంచర్ల సాయి, ఆత్మకూరిరామరాజులపై 302, 323 సెక్షన్లకింద పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిష్ఠానం ఆదేశిస్తే మైలవరం నుంచి పోటీ చేస్తా

» కొండపల్లి వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి



ఇబ్రహీంపట్నం, జనవరి 8 : మైలవరం ఎమ్మెల్యే సీటు బీసీలకు ఇస్తే తనకు ఇవ్వాలని, అధిష్ఠానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని కొండపల్లి మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు స్థానికులను కోరుకుటున్నారని, మాజీమంత్రి దేవినేని ఉమాకు తాను వ్యతిరేకం కాదన్నారు. స్థానికురాలిగా ఎమ్మెల్యే సీటు కోరుకోవడం తప్పు కాదన్నారు. టీడీపీ బీసీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. సీటు కోరుతూ కేంద్ర కార్యాలయానికి తెలిపామన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తానన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా గుండు శ్రీనివాసరావు



కృష్ణలంక, జనవరి 8 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా గుండు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు తూర్పు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పుష్పగుచ్ఛంతో అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన గుండు శ్రీను అనతి కాలంలోనే రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గుండు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కష్టించి పనిచేస్తానన్నారు. టీడీపీ 20వ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, గోగుల రమేష్, లక్ష్మి, పేరేపి ఈశ్వర్ పాల్గొన్నారు.

అవినాష్...ముందు నీ స్థాయి తెలుసుకో

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడే అర్హత వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్‌కు లేదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. చంద్రబాబును పాయింట్ అవుట్ చేసే స్థాయి అవినాష్‌కు లేదన్నారు. అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో గద్దె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పేరు ప్రస్తావించే ముందు తన స్థాయి ఏమిటో అవినాష్ గుర్తుంచుకోవాలని సూచించారు. ఎంపీ కేశినేని నానికి చంద్రబాబు తగిన గౌరవం ఇవ్వలేదని అవినాష్ మాట్లాడటం సరికాదని అన్నారు. మా పార్టీ వ్యవహారాలు అవినాష్‌కు ఎందుకని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి వైఖరి తెలుసుకుని తర్వాత చంద్రబాబు గురించి మాట్లాడితే మంచిదని అన్నారు.

జనం జగన్‌ను నమ్మడం లేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన ఎమ్మెల్యేలను నమ్మడం లేదని, రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మడం లేదని గద్దె తెలిపారు. వైసీపీ సర్కార్ 95 శాతం ప్రజల మద్దతు కోల్పోయిందని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, ఈశ్వర్ పేరేపి తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలనకు త్వరలో ముగింపు

● టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, జనవరి 8: ధ్వంసాలతో ప్రారంభమైన జగన్‌రెడ్డి అరాచకపాలనకు ప్రజలు త్వరలో ముగింపు పలకనున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. సోమవారం విజయవాడ జెండా చెట్టు సమీపంలో ఉన్న టీడీపీ పశ్చిమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చడంతో తన అరాచక పాలన ప్రారంభమైనదని విమర్శించారు. నా అక్కాచెల్లెళ్లు అంటూ జగన్‌రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి వ్యవహార తీరు నచ్చక ఆయన పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు తమ పదవులకు రాజీనామా చేసి బయటకు వస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

19న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

● వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వరాజ్య మైదానంలో చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న జరగనున్నదని ఈ కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ కోరారు. సోమవారం పంజాసెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ వైసీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహంతో పాటు ఆహ్లాదంగా ఉండేలా అనేక నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. ఈ నిర్మాణం విజయవాడకే కాకుండా రాష్ట్రానికి తలమానికగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

సీవీఆర్ స్కూల్ వార్షికోత్సవం

గవర్నర్‌పేట, జనవరి 8: 23వ డివిజన్‌లోని సీవీఆర్ మున్సిపల్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామిలు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.సినీ గాయకుడు మనో, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆయేషా, కుమార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు మద్దతుగా పాదయాత్ర

భవానీపురం, జనవరి 8: నగరంలో మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 14 రోజుల నుంచి జరుగుతున్న సమ్మెకు ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం భవానీపురం నుంచి సితార సెంటర్ వరకు పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు బోయి సత్తిబాబు మాట్లాడుతూ కార్మికుల సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. యూనియన్ నాయకులు వి. సాములు, రాజ్యం, నూకరాజు, కొండా లక్ష్మిలు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాబోయే మన జనసేన టీడీపీ

పాతరాజరాజేశ్వరి పేట, జనవరి 8 : ఇంటింటికీ రాబోయే మన జనసేన టీడీపీ ప్రభుత్వ కార్యక్రమాన్ని 35వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎస్ఎస్ ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోతిన మహేశ్ మాట్లాడుతూ రాజధాని అమరావతి ఉండాలన్నా, పరిశ్రమలు రావాలన్నా, పెట్టుబడులు రావాలన్నా, యువకులు, మహిళలు, కార్మికులు, రైతులకు మంచి జరగాలన్నా జనసేన టీడీపీకి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని, ఫ్యాన్‌కి ఓటేస్తే మాత్రం ఉరేసుకున్నట్టేనని ప్రజలకు వివరించారు. నాయకులు కృష్ణ, నవీన్‌రాజ్, సుమన్ నాయక్, వడ్డని శ్యామ్, సోమి గోవింద్, కొరగంజి వెంకటరమణ పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ

ఉద్యోగాలు సాధించిన పాఠకులకు సత్కారం

గవర్నర్‌పేట, జనవరి 8: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రిఫరెన్స్ విభాగంలో పుస్తకాలు చదువుకుని ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ ఎస్సై ఉద్యోగాలు సాధించిన యు. యోగేష్, కె. సౌజన్యలతో పాటు ఆర్‌ఆర్‌బీ పరీక్షలో పీవోగా ఉద్యోగం సాధించిన వి. అనిల్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జమలపూర్ణమ్మ మాట్లాడుతూ నిరుద్యోగులు తమకు అవసరమైన పుస్తకం పేరు రాసి అధికారులకు ఇస్తే వాటిని వెంటనే కొనుగోలు చేసేలా ఆన్ డిమాండ్ బుక్ సిస్టం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలని తోటి విద్యార్థులతో పంచుకున్నారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది కె. రాం బాబు, పాఠకులు, రిఫరెన్స్ కోసం వస్తున్న నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో బొండా ఉమామహేశ్వరరావు

గుణదల, జనవరి 8: మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే ఏ కుటుంబం అయినా సంతోషంగా ఉంటుందని సెంట్రల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే పథకాల జాబితాతో కూడిన భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమం స్థానిక ఒకటవ డివిజన్లో సోమవారం ప్రారంభించారు. ఒకటవ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ పపులమిల్లు సెంటర్ నుంచి పాదయాత్రగా బయలుదేరి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప వైసీపీ పాలనలో ఒకటవ డివిజన్లో జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పారు.



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తున్న బొండా ఉమా

టీడీపీ హయాంలో వచ్చిన కరెంటు బిల్లుతో పోల్చుకుంటే వైసీపీ పాలనలో నాల్గురెట్లు ఎక్కువ వస్తుందన్న విషయం అందరూ గ్రహించాలన్నారు. సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో చేసి పేదల్ని ధనికులుగా చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందని అభిప్రాయపడ్డారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, పిన్నమనేని రితీష్, భార్గవ్, ఎస్‌కె జాన్ వలి, వేములపల్లి పెదబాబు, మాదాల సత్య, దివ్య, కోటేశ్వరి, జనసేన నాయకులు గోపాల్, కెంబూరి శ్రీను, సత్య పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

ఏఐటీయూసీ రాష్ట్ర నేత ఆసుల రంగనాయకులు

చిట్టినగర్, జనవరి 8: పారిశుధ్య కార్మికులను జగన్ ప్రభుత్వం దగా చేసిందని, జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆందోళనలో భాగంగా సోమవారం సర్కిల్-1 కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలన్నారు. లేకపోతే పారిశుధ్య కార్మికులు ఉదయం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం కార్మికులకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు నేరుగా వివరించి కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. యూనియన్ నాయకులు పోరుమిళ్ల సుబ్బరాయుడు, తుపాకుల నాగేశ్వరరావు, జిక్కి జేమ్స్, ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి కొట్టు రమణారావు, వెంకటేశ్వరరావు, భారతి పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



గాలిపటాలతో విద్యార్థులు

వన్‌టౌన్, జనవరి 8: కూరపాటి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య తెలిపారు. మొదటి రోజు గాలిపటాలు ఎగురవేయించారు. రెండోరోజు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మూడో రోజు సోమవారం బొమ్మల కొలువు, సుమారు 140 మంది చిన్నపిల్లలకు భోగిపళ్లు పోశారు. ముగింపు కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి కూరపాటి లక్ష్మీనారాయణరావు విచ్చేసి బొమ్మల కొలువును ప్రారంభించారు. అనంతరం పిల్లలకు భోగిపళ్లు పోసి ఆశీస్సులు అందజేశారు. పాఠశాల కమిటీ సభ్యులు కూరపాటి చంటి, శ్రీరామ్ రజిత్‌లు రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ప్రిన్సిపాల్

భారతీనగర్: గురునానక్ కాలనీలోని సిటిజన్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం ప్రిన్సిపాల్ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ జయలక్ష్మి చిన్నారులకు భోగిపళ్లు పోశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బడ్డీకొట్టు ధ్వంసం చేసిన వైసీపీ కార్యకర్తపై ఫిర్యాదు

రాణిగారితోట, జనవరి 8: జీవనోపాధి కోసం ఎమ్మెల్యే ఇచ్చిన బడ్డీకొట్టు స్థానిక వైసీపీ కార్యకర్త ధ్వంసం చేయడం పై స్థానిక టీడీపీ నాయకులు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం రాణిగారితోటలో జరిగింది. రాణిగారితోట 17వ డివిజన్ ఫీడర్‌రోడ్డులో గత నాలుగేళ్ల క్రితం ఒక మహిళ జీవనోపాధి నిమిత్తం నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బడ్డీకొట్టు అందజేశారు. దానిని ఆ మహిళా విజయకృష్ణ థియేటర్ సమీపంలో ఫీడర్ రోడ్డులో పెట్టుకుని కొంతకాలం నడిపింది. అయితే అనారోగ్య కారణంగా కొంతకాలం నుంచి ఆమె దానిని తీయడం లేదు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే వైసీపీ కార్యకర్త తాజుద్దీన్ సోమవారం బడ్డీకొట్టును పగలకొట్టించాడు. విషయం తెలుసుకున్న టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ ఇతర నాయకులు సంఘటన స్థలానికి వెళ్లి తాజుద్దీన్‌ను నిలదీశారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాజుద్దీన్ వేరే వారికి కొట్టు పెట్టించేందుకు తమ ఎమ్మెల్యే ఇచ్చిన కొట్టును తొలగించాడని, ఇటువంటి సంఘటనలు వివాదాలకు దారితీసే అవకాశం ఉందని, పోలీసులు ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఫుడ్‌లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు జరిమానాలు

వన్‌టౌన్, జనవరి 8: జిల్లాలో ఫుడ్ లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించి వ్యాపారాలు నిర్వహిస్తున్న 37 మంది వ్యాపారస్తులపై రూ.2లక్షల30వేల జరిమానా విధించినట్లు జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి షేక్ గౌస్ మొహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆహార సంబంధాల వ్యాపారాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించినట్లు తెలిపారు. అధికారులు వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. వారిని జేసీ ముందు హాజరుపరిచారు.

వాసవీ క్లబ్ ఐక్యత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్, జనవరి 8: కొత్తపేటలోని మద్ది సుబ్బారావు ఇంగ్లీష్ మీడియం స్కూల్ కాన్ఫరెన్స్ హాలులో వాసవి క్లబ్ ఐక్యత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా నూతన క్లబ్ బ్యానర్‌ను ఆవిష్కరించి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దింటకుర్తి త్రిమూర్తులు, కార్యదర్శిగా లక్ష్మీ శ్రీనివాసరావు, కోశాధికారిగా మల్లేశ్వరరావులను నియమించారు. వీరిచే క్లబ్ గవర్నర్ సతీష్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తాను నిర్వాహకులు సత్కరించారు. అరవిందకుమార్ అధ్యక్షత వహించిన సురేష్, రోజా, శ్రీధర్, మురళి, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం, జనవరి 8: స్థానిక మొగల్ ఎగ్జిబిషన్ హాలులో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. సోమవారం మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు చెప్పారు.ఆసక్తి కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలు ఈ ఉత్సవ్ -2024లో పాల్గొనవచ్చని డైరెక్టర్ ఏ.పూర్ణిమ చెప్పారు. మహిళా ఉత్సవ్‌లో పాల్గొనే ఔత్సాహికులు ఈ నెల 28లోగా తమ దరఖాస్తులను మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో అందించాలని విజ్ఞప్తి చేశారు

ఫ్యూచర్‌పాత్ స్కూల్ విద్యార్థినికి అభినందన

పాతరాజరాజేశ్వరిపేట, జనవరి 8 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి లీడ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఫ్యూచర్‌పాత్ విద్యార్థిని రన్నరప్‌గా నిలవడం అభినందనీయమని విశ్రాంత విద్యాశాఖాధికారి సీవీఎల్ నరసింహారావు అన్నారు. స్థానిక 34వ డివిజన్, కేదారేశ్వరపేటలోని ఫ్యూచర్‌పాత్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ప్రతిభ కనబరచిన సోనవాల్‌కు స్కూల్ కరస్పాండెంట్ మామిడి శ్రీనివాసరావు అభినందన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీవీఎల్ నరసింహారావు పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. స్కూల్ కరస్పాండెంట్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ సోనమాల్ రన్నరప్‌గా నిలవడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ప్రిన్సిపాల్ ఎం. మాధురి, ఇన్‌చార్జ్ జాస్మిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్, జనవరి 8: ఎన్‌టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ను సోమవారం జగ్గయ్యపేటలోని ఆయన కార్యాలయంలో విజయవాడ పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7న తిరువూరులో జరిగిన రా..కదలి..రా బహిరంగ సభను జయప్రదం చేసినందుకు ఆయనను దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. నాయకులు రాధాకృష్ణ ఉన్నారు.

చెత్త ఉంటే..ఫోన్ చేయండి

● కార్పొరేటర్ శర్వాణీమూర్తి



సత్యనారాయణపురం, జనవరి 8: 33వ డివిజన్‌లో పారిశుధ్య సమస్యను పరిష్కరించడానికి సొంత ఖర్చులతో 20మంది ప్రైవేటు సిబ్బందిని గురువారం నియమించానని స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మె వలన డివిజన్‌లో చెత్త పేరుకుపోయిందని, సమ్మె ముగిసే వరకూ డివిజన్‌లో 20మంది వర్కర్స్‌లు ఇంటింటికి వచ్చి చెత్త తీసుకు వెళతారని తెలిపారు. ప్రతీ ఇంటికి చెత్త తీసుకు వెళ్లే వాహనం వస్తుందని డివిజన్‌లో ఎవరూ చెత్తను రోడ్లపైన వేయ వద్దన్నారు. డివిజన్‌లో చెత్త సమస్య ఎక్కడ ఉన్నా కార్పొరేటర్ కార్యాలయంలో కాని , 9866085262 నంబర్‌లో కాని సంప్రదించాలన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్

● ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.సందీప్

వన్‌టౌన్, జనవరి 8: దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి, విక్రయాలు గణనీయంగా పెరిగాయని ఆంధ్ర ప్రదేశ్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.సందీప్ అన్నారు. కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం, ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఐఓటీ సొల్యూషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అనే అంశంపై సోమవారం నుంచి ఈ నెల 13 వరకు జరగనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో మొబైల్స్ తయారీదారులు ఈవీ టెక్నాలజీలో భారీగా పెట్టుబడులు పెట్టారన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అనేక రకాల ఎలక్ట్రిక్ మోడల్స్‌ను విడుదల చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.మణికంఠ, ఈఈఈ విభాగాధిపతి ఏ.శేఖర్ సునీల్, కో- ఆర్డినేటర్ డాక్టర్ వై.రాజేంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాట తీస్తా..



నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాననేమో.. ప్రతి ఏడాది సంక్రాంతి వస్తే చాలు.. ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తుతూ నాపై ట్రోల్స్ చేయడం కొన్ని వెబ్‌సైట్స్‌కి పరిపాటైపోయింది. ఏడెనిమిదేళ్ల నుంచి ఇదే తంతు. నిన్నటి 'హను-మాన్' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీగారు ఈ థియేటర్ల వ్యవహారంపై ఎంతో పాజిటివ్‌గా మాట్లాడారు. 'సమస్యను ఎలా పరిష్కరించాలో దిల్ రాజుకి తెలుసు.. ఈ విషయాల్లో తనకు అనుభవం ఉంది' అంటూ నా గురించి కూడా గౌరవంగా స్పందించారు. ఆ మాటల్ని వేరే విధంగా మార్చి రెండు ప్రముఖ వెబ్‌సైట్లు పిచ్చి రాతలు రాశాయ్. మీ వెబ్‌సైట్ రేటింగ్ పెంచుకోవటానికి వేరే వాళ్లను ఎందుకు బలి చేస్తున్నారు? అంటే దిల్ రాజు ఏం రియాక్టవ్వడు, సర్దుకుని పోతాడు అనుకుంటున్నారా? తాట తీస్తా..' అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు హెచ్చరిక జారీ చేశారు. తన గురించి అవాస్తవాలు రాశారంటూ.. రెండు వెబ్ సైట్లపై(ఆంధ్రజ్యోతి కాదు) దిల్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల జంటగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్'. రచయిత గోపీ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.రమణారెడ్డి నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం హైదరాబాద్‌లో దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడారు. 'చాలా రోజులుగా ఓపికపడుతూ వచ్చాను. నా వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఏ ప్రొడ్యూసరైనా మీకు చెప్పాడా? దమ్ముంటే ఆ ప్రొడ్యూసర్‌నీ నన్నూ ఒక వేదికపై కూర్చోబెట్టి ప్రశ్నించండి. వ్యాపారపరంగా వచ్చే సమస్యల్ని అడ్వాంటేజ్‌గా తీసుకొని నన్ను బ్లేమ్ చేయడానికి వెబ్‌సైట్లనీ, యూట్యూబ్ ఛానల్స్‌ని కొందరు వాడుకుంటున్నారు. సంక్రాంతి రిలీజ్‌ల గురించి ఛాంబర్‌లో మీటింగ్ పెట్టాం. థియేటర్ల కొరత రాకూడదని నిర్మాతను రిక్వెస్ట్ చేసి రవితేజగారి సినిమాను సంక్రాంతి నుంచి పక్కకు జరిపాం. ఇది ఎంత కష్టమైన పనో తెలుసా?.. ఇంకోడెవడో రాశాడు. 'దిల్ రాజు తమిళ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాడు' అని. ఎవడు చెప్పాడ్రా.. నేను రిలీజ్ చేస్తున్నానని? నీ దగ్గర రుజువు ఉందా? ఆ తమిళ సినిమా రిలీజ్‌ను వాయిదా వేయించిందే నేను. విషయం తెలియకుండా అబద్ధాలు ఎందుకు రాస్తారు? మళ్లీ చెబుతున్నా.. తేలిగ్గా తీసుకోకండి.. ఇక నుంచి నా గురించి అబద్ధాలు రాసి, కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తే ఊరుకోను, తాటతీస్తా..' అంటూ ఉద్వేగంగా స్పందించారు దిల్‌రాజు.

కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది



'ఈ సముద్రం చేపలకంటే కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది. అందుకే దీన్ని ఎర్రసముద్రం అంటారు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలోనిదీ డైలాగ్. కొరటాల శివ దర్శకుడు. సోమవారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రోమాంచిత పోరాట ఘట్టాలు, పతాక స్థాయి భావోద్వేగాలతో గ్లింప్స్ ఆద్యంతం అలరించింది. ఆగ్రహం నిండిన కళ్లతో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. సముద్రపు దొంగలు నౌకలను దోచుకోవడం, వారిని ఎన్టీఆర్ ఊచకోత కోసే సన్నివేశాలతో యాక్షన్ హంగామా కనిపించింది. అనిరుధ్ రవిచంద్రన్ ఇచ్చిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' చిత్రం తొలిభాగం విడుదలవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, మురళీశర్మ కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

'నా సామిరంగ' మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుంది



కీరవాణి

'నాగార్జునకు సరిగ్గా సరిపోయే టైటిల్ 'నా సామిరంగ'. 32ఏళ్ల క్రితం నాగార్జునతో నేను చేసిన 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' ఎంతటి విజయాన్ని సాధించిందో.. సంక్రాంతికి రానున్న 'నా సామిరంగ' కూడా అంతటి విజయాన్ని సాధిస్తుందని నా నమ్మకం. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' పల్లెటూరి నేపథ్యంతో కూడిన వినోదాత్మక చిత్రం. 'నా సామిరంగ' కూడా సేమ్ టు సేమ్. కాబట్టి ఇది మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుందని ఆశిస్తున్నా.' అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అన్నారు. అక్కినేని నాగార్జున హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన చిత్రం 'నా సామిరంగ'. కీరవాణి స్వరాలందించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీరవాణి విలేకరులతో మాట్లాడారు. 'రీరికార్డింగ్ సమయంలో ఓ సందర్భం పాట రాయాలనే ఆలోచనకు దోహదం చేసింది. దాంతో ఇందులో ఓ పాట రాశాను. ఈ సినిమాలో సంగీతం స్వచ్ఛంగా ఉంటుంది. క్వాలిటీ తగ్గకుండా వేగంగా సినిమా తీయగలగడం దర్శకుడు విజయ్ బిన్నీ ప్రత్యేకత. అతను స్వతహాగా డాన్స్ మాస్టర్. కాబట్టి డాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ట్యూన్స్ తీసుకుంటాడనుకున్నాను. కానీ అద్భుతమైన మూడు మెలోడీస్‌ని నా నుంచి తీసుకున్నాడు. దర్శకుడిగా అతనిలోని పరిపక్వత నాకప్పుడు అర్థమైంది' అని కీరవాణి అన్నారు. ఇటీవలి సినిమాల్లో జైలర్, యానిమల్ చిత్రాల సంగీతం బావుందని ఆయన చెప్పారు. 'హరిహరవీరమల్లు' సినిమాకు సంబంధించిన మూడు పాటల రీకార్డింగ్ పూర్తయిందని, అలాగే, చిరంజీవి 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయని అన్నారు. రాజమౌళి సినిమాకు సంబంధించిన మ్యూజిక్ పనులు ఇంకా మొదలవ్వలేదని కీరవాణి తెలిపారు.

ఉపేంద్ర ఫాంటసీ ప్రపంచం



కన్నడ నటుడు ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యు ఐ ది మూవీ'. కె.పి. శ్రీకాంత్‌తో కలిసి లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్ అండ్ వీనస్ ఎంటర్‌టైనర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అల్లు అరవింద్ అతిథిగా విచ్చేశారు. ప్రేక్షకులను ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుందని, 90శాతం వీఎఫ్‌ఎక్స్‌తో ఉపేంద్ర ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించారని నిర్మాతలు చెబుతున్నారు. 'ఎటు చూసినా చీకటి. దాన్నుంచి తప్పించుకోవడం ఎలా?' అంటూ ఉపేంద్ర వాయిస్‌తో టీజర్ మొదలైంది. చివరిగా ఎద్దుపై ఉపేంద్ర వీరోచితమైన ఎంట్రీ, సినిమాలోని ఆయన పాత్రకు అద్దం పట్టేలా ఉంది. రీష్మా నానయ్య, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, పి.శివశంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీశ్ బి.లోక్‌నాథ్, కెమెరా: హెచ్‌సీ వేణుగోపాల్.


ఫైటర్ ప్రణయ గీతం



బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న చిత్రం 'ఫైటర్'. 'వార్, పఠాన్' చిత్రాలతో ఘన విజయాలను అందుకున్న సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం ఈ చిత్రం నుంచి 'హీర్ ఆస్మానీ' గీతాన్ని విడుదల చేశారు. ఈ రొమాంటిక్ గీతంలో హృతిక్‌రోషన్, దీపికా పదుకొనే సరికొత్త స్టెప్పులతో అలరించారు. ఈ చిత్రంలో హృతిక్ ఎయిర్‌ఫోర్స్ పైలెట్‌గా కనిపించనున్నారు. వయాకామ్ 18 స్టూడియోస్, మార్ ఫ్లిక్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. అనిల్ కపూర్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

యానిమల్ లాంటి సినిమాలు సమాజానికి ప్రమాదకరం

జావెద్ అక్తర్



సందీప్‌రెడ్డి వంగా లేటెస్ట్ బ్లాక్‌బాస్టర్ 'యానిమల్' నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అలాగే.. గత ఏడాది అత్యంత చర్చనీయాంశమైన సినిమాగా 'యానిమల్' నిలిచింది. ఈ సినిమా గురించి ప్రముఖ రచయిత జావెద్ అక్తర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివెల్‌కి హాజరైన ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ "యానిమల్' లాంటి సినిమా విజయాన్ని సాధించడం సమాజానికి ప్రమాదకరం. ఓ విధంగా ఆ సినిమా తీసిన వాళ్లే కాదు, చూసినవాళ్లూ దోషులే. సినిమా చాలా శక్తిమంతమైంది. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి సినిమాకుంది. ఇలాంటి సినిమాల వల్ల సమాజంలో నైతికత లోపిస్తే.. అందుకు చూసిన ప్రేక్షకులు కూడా బాధ్యులే అవుతారు. ఓ స్త్రీని ఓ పురుషుడు తన షూ నాకమనడం. స్త్రీ అని కూడా చూడకుండా చెంప చెళ్లుమనిపించడం.. ఇలాంటి సన్నివేశాలున్న సినిమా బాక్సాఫీస్ దగ్గర విజయం సాధించిందంటే చూస్తున్న ప్రేక్షకుల మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు అక్తర్. ఇంకా మాట్లాడుతూ 'జనంలో ఈ జాడ్యం నేటిది కాదు. ఏనాటిదో.. ముప్పైఏళ్ల క్రితమే 'చోలీకే పీచే క్యాహై..' అంటూ సాగే పాటను విపరీతంగా ఆదరించారు. సృజనాత్మకరంగంలో ఎలాంటి వాటిని ఆదరించాలి.. ఎలాంటివాటిని తిప్పికొట్టాలి అనే విషయాలపై ప్రేక్షకులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అన్నారు జావెద్ అక్తర్. ఇదిలావుంటే సందీప్‌రెడ్డి వంగ దర్శకత్వంలో రణబీర్‌కపూర్ హీరోగా నటించిన 'యానిమల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 896కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది.

రిలీజ్‌కు రెడీగా తిరగబడరా సామి



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు యూనిట్ తెలిపింది. సెంటిమెంట్, రొమాన్స్, యాక్షన్ అంశాలతో రూపొందించామనీ, ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామనీ మేకర్స్ తెలిపారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘు బాబు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జెబి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: జవహర్‌రెడ్డి ఎంఎన్.

రవితేజ చేతుల మీదుగా లవ్ మౌళి గీతమాలిక



నవదీప్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో నీ స్పేస్ సంస్థ నిర్మిస్తోంది. రవితేజ చేతుల మీదుగా ఈ చిత్రంలోని పాటలను యూనిట్ విడుదల చేసింది. 'నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' దగ్గరగా అనిపించింది. అందుకే ఈ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాను' అని నవదీప్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత.

ఈతరం శ్రీరంగ నీతులు



రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగ నీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకుడు. వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మాత. 'శ్రీరంగ నీతులు' టీజర్‌ను విడుదల చేసి చిత్రబృందం ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ తరం యువత ఆలోచనలు, భావోద్వేగాల ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిద'న్నారు. కుటుంబ అనుబంధాలు, వినోదం.. ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్. సినిమాటోగ్రఫీ: టీజో టామీ

గురు శిష్యుల కాంబినేషన్‌లో



సుకుమార్ శిష్యుడు యశస్వీ దర్శకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. సుకుమార్ సొంత నిర్మాణ సంస్థ 'సుకుమార్ రైటింగ్స్'లో ఈ చిత్రం తెరకెక్కనుంది. దీపక్ సరోజ్ కథానాయకుడిగా యశస్వీ దర్శకత్వం వహించిన 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆ చిత్రం సుకుమార్‌కు బాగా నచ్చడంతో యశస్వికి తన బేనర్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చారని నిర్మాణ సంస్థ తెలిపింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది.

కరెంట్ షాక్‌తో యష్ అభిమానుల కన్నుమూత

కన్నడ హీరో యష్ పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకొంది. సోమవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా కర్ణాటకలోని గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సూరణగి గ్రామంలో ఘనంగా వేడుకను నిర్వహించేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. ఫ్లెక్సీని సిద్ధం చేసి, దాన్ని నిలబెట్టి కట్టే ప్రయత్నం చేస్తుండగా ఇనుప కడ్డీలకు విద్యుత్ తీగలు తగలడంతో హనుమంత హరిజన(21), మురళి నడవినమని(20), నవీన్‌గాజి (19) మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

దర్శకుడు కే జయదేవ్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కే జయదేవ్ కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయదేవ్ దర్శకత్వం వహించిన 'కోరంగి నుంచి' చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారతరత్న సీఎన్ఆర్ రావుపై ఫిల్మ్ డివిజన్‌కు ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్ట్ కెఎన్‌టి శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు.

ఓపెన్‌హైమర్‌కు గోల్డెన్‌గ్లోబ్ పురస్కారాలు



హాలీవుడ్ చిత్రం 'ఓపెన్ హైమర్' గోల్డెన్‌గ్లోబ్ అవార్డుల్లో మెరిసింది. పలు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకొని సత్తా చాటింది. 81వ గోల్డెన్ గ్లోబ్ వేడుకలు అమెరికాలోని బేవర్లీహిల్స్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఓపెన్‌హైమర్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఇదే చిత్రానికిగాను ఉత్తమ దర్శకుడిగా క్రిస్టోఫర్ నోలన్, ఉత్తమనటుడిగా సిలియన్ మర్ఫీ, ఉత్తమ సహాయ నటుడిగా రాబర్ట్ డౌనీ జూనియర్ అవార్డులు గెలుచుకోగా ఉత్తమ ఒరిజినల్ స్కోర్ విభాగంలో లుడ్విగ్ గోరాన్సన్ పురస్కారం అందుకున్నారు. బార్బీ చిత్రానికి ఉత్తమ ఒరిజినల్ సాంగ్, బాక్సాఫీస్ ఎచీవ్‌మెంట్ అవార్డు దక్కాయి.

ఆయుర్వేదం

కర్పూరం రసాయనాలతో తయారైన కృత్రిమ పదార్థం కాదు. కర్పూరం చెట్ల ఆకులు, కొమ్మల నుంచి కర్పూరాన్ని తయారు చేస్తారు. కర్పూరంలో చాలా రకాలుంటాయి. ప్రతి కర్పూరం భిన్నమైన స్వభావాలనూ, ప్రభావాలనూ కలిగి ఉంటుంది.

ఈ కర్పూరం అపూర్వం

కర్పూరం చెట్టు వేరు, ఆకులు, కొమ్మలను నీళ్లలో మరిగించి, డిస్టిలేషన్ పద్ధతిలో తయారుచేసే కర్పూరం పచ్చ కర్పూరం. టర్పంటైన్ నుంచి రసాయనిక ప్రక్రియ ద్వారా సేకరించేది హారతి కర్పూరం. ఇది ఔషధ తయారీకి పనికిరాదు. చిన్నపిల్లల శరీరాల్లో దోషాలను హరించడానికి ఆముదంతో కలిపి పట్టించేది రస కర్పూరం. వీటన్నిటికంటే భిన్నమైనది, ఔషధ గుణాలను కలిగి ఉన్నది భీమసేని కర్పూరం. నేరుగా ఉపయోగించడానికి వీలుగా మొక్క నుంచి లభించే అపక్వ కర్పూరమిది. దీన్ని ఔషధ తయారీలో విరివిగా వాడుతూ ఉంటారు. తెల్లని మేఘంలా కనిపించే కర్పూరం సితాభ్ర కర్పూరం. మంచు లాంటి రేణువులను కలిగి ఉండేది, హిమవాలుక కర్పూరం మంచును పోలిన రేణువులను కలిగి ఉంటుంది. ఘనసార కర్పూరం మేఘాన్ని తలపించేలా ఉంటుంది. మంచులా చల్లగా ఉండేది హిమ కర్పూరం. ఇవే కాకుండా ఉదయ భాస్కరవు, కమ్మ కర్పూరము మొదలైన ఎన్నో రకాల కర్పూరాలున్నాయి. ఆయు



ర్వేద చికిత్సలో కర్పూరాన్ని విస్తృతంగా వాడతారు. వీటిలో ప్రధానమైనది భీమసేని కర్పూరం. దీని ఉపయోగాలు ఇవే!

- ఈ కర్పూరాన్ని పొడి చేసి, వేడి నీళ్లలో వేసి ఆవిరి పీల్చితే జలుబు తగ్గుతుంది, ముక్కు దిబ్బెడ వదులుతుంది. తర్వాత ఈ పొడికి ఎసెన్షియల్ ఆయిల్ కలిపి గొంతు, భుజాలు, ఛాతీ మీద రుద్దుకోవాలి.
- శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారితే, భీమసేని కర్పూరాన్ని వస్త్రంతో చుట్టి వాసన పీల్చాలి. ఇలా చేస్తే ఊపిరితిత్తులు విప్పారి, ఎక్కువ ఆక్సీజన్‌ను పీల్చుకోగలుగుతాం!
- పంటి నొప్పి వేధిస్తుంటే, ఆ ప్రదేశంలో ఈ కర్పూరం ముక్కను కొద్దిసేపు ఉంచుకోవాలి. భీమసేని కర్పూరాన్ని వంటకాల్లో కూడా వాడుకోవచ్చు. కడుపు లోపలికి తీసుకోవడం ద్వారా శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోతాయి.
- ఈ కర్పూరం పొడిని కొబ్బరి నూనెలో కలిపి తల మర్దన చేస్తే కమ్మని నిద్ర పడుతుంది. అలాగే పడగ్గదిలో ఈ కర్పూరాన్ని మండించినప్పుడు వెలువడే వాసన కూడా నిద్ర పట్టేలా చేస్తుంది.
- ఈ కర్పూరం పొడిని బాదం నూనె లేదా కొబ్బరి నూనెలో కలిపి తలకు పట్టించి, మర్దన చేసి గంట తర్వాత తలస్నానం చేస్తే వెంట్రుకలు దట్టంగా పెరుగుతాయి.
- కర్పూరం పొడిలో కొద్దిగా నీళ్లు కలిపి ముద్దలా చేసి ముఖానికి పూసుకుని, పది నిమిషాల తర్వాత కడిగేసే మొటిమలు తగ్గుముఖం పడతాయి.

ఉమెన్స్ హెల్త్

నెలసరి క్రమం తప్పితే?

గర్భం దాల్చినప్పుడు, మెనోపాజ్‌కు చేరుకున్నప్పుడు తప్ప మహిళల నెలసరి ఎప్పుడూ క్రమం తప్పదు. అలా తప్పిందంటే అందుకు శారీరక సమస్యే కారణం అయి ఉంటుంది.



అధిక ఒత్తిడి: కొంతకాలంపాటు ఒత్తిడి కొనసాగితే, మహిళల శరీరం ఆ ఒత్తిడిని తట్టుకోవడానికి అవసరమయ్యే శక్తి కోసం అండాల విడుదలను ఆపేస్తుంది. ఏదైనా జరగకూడనిది జరిగినా, అడ్రినలిన్ అవసరానికి మించి స్రవించి, దాని ప్రభావం వల్ల ఈస్ట్రోజెన్, పునరుత్పత్తి హార్మోన్ల స్రావాల్లో తేడా రావొచ్చు. ఈస్ట్రోజెన్ తగినంత లేనప్పుడు గర్భాశయంలో పలచని పొర ఏర్పడే పరిస్థితి ఉండదు. ఫలితంగా నెలసరి రాదు.

ఆహార లోపం: యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు, ప్రోబయాటిక్స్ లోపించిన, ఉత్ప్రేరకాలు ఎక్కువగా ఉన్న డైట్ వల్ల అడ్రినలిన్, థైరాయిడ్ గ్రంథులు దెబ్బ తింటాయి. ఉదాహరణకు చక్కెరలు ఎక్కువగా ఉండి, హైడ్రోజెనేటెడ్ ఫ్యాట్స్, కృత్రిమ రంగులు, పురుగు మందులు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల థైరాయిడ్, అడ్రినల్ సమస్యలు తలెత్తుతాయి. కార్టిసాల్ స్రావం పెరిగితే మిగతా హార్మోన్లు, మరీ ముఖ్యంగా సెక్సువల్ హార్మోన్ల ప్రభావం కుంటుపడుతుంది.

బరువు తగ్గడం: మీ బాడీ మాస్ ఇండెక్స్ 18 - 19 కంటే తక్కువకు పడిపోయినా నెలసరి క్రమం తప్పుతుంది. బరువు తగ్గడం కోసం విపరీతంగా కడుపు మాడ్చుకునే వాళ్లలో రక్తహీనత ఏర్పడుతుంది. ఫలితంగా నెలసరి స్రావం తగ్గడం, ఆలస్యమవడం జరుగుతూ ఉంటుంది.

హెల్తీ హ్యాబిట్

తల నొప్పా?



తలనొప్పి ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ఒక్కరినీ వేధిస్తుంది. అయితే తలనొప్పి మొదలవగానే చటుక్కున టాబ్లెట్ వేసేసుకోకుండా ఇవిగో ఈ చిట్కాలు ప్రయత్నించి చూడండి.

- **నీళ్లు తాగండి:** ఒంట్లో నీటి శాతం తగ్గినా తలనొప్పి వస్తుంది. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగండి.
- **పుచ్చకాయ తినండి:** పుచ్చకాయలో ఉండే ఖనిజ లవణాలు చెమట ద్వారా శరీరం కోల్పోయిన లవణాల్ని భర్తీ చేస్తాయి. కాబట్టి పుచ్చకాయ తింటే లవణాల కొరత మూలంగా వచ్చే తలనొప్పి తగ్గుతుంది.
- **కాఫీ తాగొచ్చు:** కాఫీలోని కెఫీన్ న్యూరాన్లను ఉత్తేజపరుస్తుంది. కాబట్టి ఒత్తిడి మూలంగా వచ్చే తలనొప్పి విరుగుడుకు ఓ కప్పు కాఫీ తాగండి.
- **పెప్పర్‌మింట్ ఆయిల్:** శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా కూడా తలనొప్పి రావొచ్చు. ఈ రకం తలనొప్పి తగ్గాలంటే కణతల దగ్గర పెప్పర్‌మింట్ ఆయిల్‌తో మర్దన చేయండి.
- **కారంగా తినండి:** ముక్కు పక్కల, ఎముకల అడుగున ఉండే గాలి గదుల్లో ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా తలనొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి తగ్గాలంటే కారంగా ఉండే పదార్థాలు తినాలి. కారం ఘాటుకు ఆ ప్రదేశాలు ప్రేరేపితమై ఇన్‌ఫెక్షన్‌ను కరిగించి ముక్కు ద్వారా బయటకు తెప్పిస్తాయి.

వ్యాక్సిన్స్



కొవిడ్‌తో వ్యాక్సిన్ల పట్ల మనందరిలో అవగాహన పెరిగింది. అయితే ఇతర వ్యాధుల నుంచి రక్షణ కల్పించే వ్యాక్సిన్లు కూడా పెద్దలకు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుని, వ్యాధులకు అడ్డుకట్ట వేద్దాం!

పెద్దల టీకాలు

పిల్లలకే వ్యాక్సిన్లు అనుకునేవాళ్లం. కానీ పెద్దలకు కూడా వ్యాక్సిన్లు అవసరమనే విషయం మనకు కొవిడ్ నేర్పింది. నిజానికి యుక్తవయస్కులూ, పెద్దలూ తప్పనిసరిగా తీసుకోవలసిన వ్యాక్సిన్లు కొన్ని ఉన్నాయి. రోగనిరోధకశక్తి పెరుగుదలకూ, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకూ, శ్వాసకోశ వ్యాధుల అడ్డుకట్టకూ వీటిని తీసుకోవడం అవసరం. వైరస్ స్ట్రెయిన్, రకాన్ని బట్టి వేర్వేరు దేశాల్లో వేర్వేరు వ్యాక్సిన్లు తయారవుతూ ఉంటాయి. రూపాలు మార్చుకుంటూ ఉండే వైరస్‌లకు తగ్గట్టుగా కొత్త వ్యాక్సిన్లు నిరంతరంగా తయారవుతూనే ఉంటాయి. కాబట్టి భయాలు, అపోహలు వీడి ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లతో వ్యాధులకు అడ్డుకట్ట వేస్తూ ఉండాలి.

14 నుంచి 65 ఏళ్ల వాళ్ల కోసం...

- **ఇన్‌ఫ్లూయెంజా:** ఏడాదికోసారి ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది స్వైన్ ఫ్లూ లాంటి శ్వాసకోశ వ్యాధులను నియంత్రిస్తుంది.
- **టెటనస్, డిఫ్తీరియా, పెరిట్యూసిస్:** చిన్నప్పుడు టెటనస్ వ్యాక్సిన్ వేసుకోని వాళ్లు 18 ఏళ్ల వయసుకు వచ్చిన తర్వాత, ఈ వ్యాక్సిన్‌ను ప్రతి పదేళ్లకోసారి వేయించుకుంటూ ఉండాలి.
- **వెరిసెల్లా:** చిన్నప్పుడు చికెన్ పాక్స్ వ్యాక్సిన్ వేయించుకోని వాళ్లు, 18 ఏళ్ల తర్వాత, 65 ఏళ్ల లోపు ఎప్పుడైనా వెరిసెల్లా వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. హై రిస్క్ ఉన్నవాళ్లు రెండు డోసులు వేయించుకోవాలి.
- **హెచ్‌పివి:** గర్భాశయ ముఖద్వారా కేన్సర్ నివారణ కోసం 14 నుంచి 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు ఈ వ్యాక్సిన్ వేయించాలి. ఈ వయసులో తీసుకోనివాళ్లు, 26 ఏళ్ల వరకూ కూడా ఈ వ్యాక్సిన్‌ను వేయించుకోవచ్చు. 19 నుంచి 21, లేదా 22 నుంచి 26 ఏళ్ల మధ్య హెచ్‌పివి మూడు డోసులు వేయించుకోవచ్చు.
- **మీజిల్స్, మంప్స్, రుబెల్లా:** ఈ మూడు వ్యాధులకు అడ్డుకట్ట వేయడం కోసం ఎమ్‌ఎమ్‌ఆర్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. చిన్న వయసులో టీకాలు వేయించుకోని వాళ్లకు ఈ వ్యాధులు వస్తుంటాయి. గతంలో 30 ఏళ్ల వాళ్లలో కూడా మీజిల్స్ కనిపించేవి. దీన్ని నివారించడం కోసం ప్రెగ్నెన్సీకి ముందు మహిళలు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఇలా చేయడం వల్ల పుట్టబోయే బిడ్డకూ, తల్లికీ ఈ వ్యాధులు సోకే అవకాశాలు తగ్గుతాయి.
- **టైఫాయిడ్:** ఈ వ్యాక్సిన్ చిన్నప్పుడు వేసుకోనివాళ్లు, 18 ఏళ్ల తర్వాత, 65 ఏళ్ల లోపు వేయించుకోవచ్చు. దీనిని రెండు డోసులు తీసుకోవాలి. వయసును బట్టి డోసులను నిర్ణయిస్తారు.
- **హెపటైటిస్ ఎ, బి:** వయసును బట్టి ఈ వ్యాక్సిన్ వేస్తారు. హెపటైటిస్ ఎ రెండు డోసులు, బి మూడు డోసులు వేస్తారు.

ఎప్పుడు, ఎలా?

కొన్ని రకాల వ్యాక్సిన్లను కలిపి వేయించుకోవచ్చు. కొన్ని రకాల వ్యాక్సిన్లకు రెండు వారాల గ్యాప్ అవసరం ఉంటుంది. కొన్ని వ్యాక్సిన్ల విషయంలో రెండు వ్యాక్సిన్లు ఒకేసారి కలిపి వేసుకోవచ్చు. కొవిడ్ వ్యాక్సిన్ సమయంలో ఇతర వ్యాక్సిన్లు వేసుకోకూడదనే ఆంక్షలు ప్రారంభంలో ఉండేవి. ఇప్పుడు అలాంటి ఆంక్షలు లేవు. ఇతర వ్యాక్సిన్లను వైద్యుల సలహా మేరకు వేసుకోవచ్చు. వ్యాక్సిన్లను వేయించుకోవడం ద్వారా, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఫ్లూ, కిడ్నీ ఫెయిల్యూర్ మొదలైన సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు. శరీర రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసి, వ్యాధికారక క్రిములతో పోరాడడానికి తగినట్టుగా మన శరీరాన్ని సిద్ధం చేసే వ్యాక్సిన్లను ఎవరైనా, ఎప్పుడైనా వైద్యుల సలహా మేరకు వేయించుకోవచ్చు. వ్యాక్సిన్లు తీసుకున్న తర్వాత దుష్ప్రభావాలు తలెత్తే అవకాశాలు కూడా బాగా తగ్గిపోయాయి. కాబట్టి ఎవరైనా నిర్భయంగా వ్యాక్సిన్లను తీసుకోవచ్చు.

ఇన్‌ఫ్లూయెంజా- రూ.2 వేలు

ఎ, బి, సి అనే మూడు రకాల ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌లు ఉంటాయి. వీటిని నియంత్రించడం కోసం ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. పిల్లలు మొదలు పెద్దల వరకూ వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. ఆస్తమా లాంటి శ్వాసకోశ వ్యాధుల నియంత్రణకు ఈ వ్యాక్సిన్ అత్యవసరం. ఐదు కంపెనీలు ఈ వ్యాక్సిన్‌ను తయారు చేస్తున్నాయి.

న్యూమోకోకల్- రూ.2 నుంచి 4 వేలు

ఈ వ్యాక్సిన్‌లో రెండు రకాలుంటాయి. పెద్దల్లో సిపిఒడి, ఆస్తమా, గుండె జబ్బు, కాలేయ జబ్బు, న్యుమోనియాల నివారణకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. 45 నుంచి 65 సంవత్సరాల లోపు వాళ్లు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. 60 నుంచి 65 సంవత్సరాల వారికి ఒక డోసు వ్యాక్సిన్ సరిపోతుంది. ఆరోగ్య రంగంలో పని చేసేవాళ్లు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఏడాదికోసారి వేయించుకుంటే, జీవితాంతం పని చేస్తుంది. ఈ వ్యాక్సిన్‌తో న్యుమోనియాకు 60 నుంచి 70% మేరకు చెక్ పెట్టవచ్చు.

షింగ్రిక్స్- రూ.10 వేలు

పెద్దలకు చికెన్ పాక్స్ సోకినప్పుడు, నరాల పనితీరును దెబ్బ తిని బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పెద్దలు ముందస్తుగానే షింగ్రిక్స్ వ్యాక్సిన్ తీసుకోవాలి. పెద్ద వయసులో వచ్చే చికెన్‌పాక్స్‌తో నరాలు దెబ్బతిని భరించలేనంత నొప్పి వేధిస్తుంది. కాబట్టి ఈ వ్యాధి సోకకుండా 50 ఏళ్లు దాటిన వాళ్లు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. ఈ వ్యాక్సిన్‌లో రెండు డోసులుంటాయి. దీంతో పెద్దల్లో వచ్చే తట్టు, పక్షవాతాలను కూడా నివారించుకోవచ్చు.

డిపిటి- రూ.2,500

పదేళ్లకోసారి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలి. డిఫ్తీరియా, టెటనస్‌లను అరికట్టడానికి ఈ వ్యాక్సిన్ తోడ్పడుతుంది. 50 ఏళ్లు పైబడిన వాళ్లు ఎవరైనా ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు.

డాక్టర్ విజయ్‌కుమార్ చెన్నంశెట్టి
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.



సెల్ఫ్ కేర్



గోళ్ల గోడు..!

కంటికి కనిపించని రుగ్మతలు గోళ్లలో ప్రతిబింబిస్తాయి. కాబట్టి వాటిలో చోటుచేసుకునే తేడాలను గమనిస్తూ, వాటిని బట్టి వైద్యులను కలుస్తూ ఉండాలి.

తెల్ల పట్టీలు: 'మోర్క్స్ నెయిల్స్' అనే స్థితిలో గోళ్ల మీద అడ్డంగా రెండు తెల్లని పట్టీలు ఏర్పడతాయి. ఇవి కేన్సర్ చికిత్సలో ఇచ్చే కీమోథెరపీ వల్ల ఏర్పడవచ్చు, లేదా కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధుల వల్ల కూడా తలెత్తవచ్చు.

గోరు కిందకి వంగిపోవడం: 'నెయిల్ క్లబ్బింగ్' అనే ఈ స్థితిలో సాధారణంగా చివర్లో కొద్దిగా పైపైపుకి తిరగాల్సిన గోళ్లు, కింది వైపుకు వంగి ఉంటాయి. కాలేయ వ్యాధులు, హృద్రోగాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్, హెచ్‌ఐవి ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు గోళ్లు ఇలా వంగిపోయే అవకాశం ఉంటుంది.

ఎర్ర గీతలు: 'బ్యూస్ లైన్స్' అనే ఈ గీతలు గోళ్లకు గాయమైనా, కీమోథెరపీ తీసుకుంటున్నా, విపరీతమైన జ్వరం వచ్చినా, మధుమేహం, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్ వచ్చినా, జింక్ లోపమున్నా కనిపిస్తాయి.

స్పూన్ నెయిల్స్: 'కాయిలోనైఖియా' అనే ఈ సమస్యలో గోళ్లు పలచగా, చదునుగా ఉంటాయి. కొంతమందిలో గోరు మధ్యలో లోపలికి వంగిపోయి ఉంటాయి. ఈ సమస్య విపరీతమైన ఐరన్ లోపం, పదేపదే పేలుడు, ట్రామాకు గురవడం వల్ల తలెత్తుతుంది.

తెల్ల గోళ్లు: 'టెర్రీస్ నెయిల్స్' అనే ఈ సమస్యలో గోళ్లు తెల్లగా, అంచుల్లో ముదురు రంగు పట్టీలు ఏర్పడతాయి. కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్, మధుమేహం, హెచ్‌ఐవి ఇన్‌ఫెక్షన్లలో గోళ్లు ఇలా మారే వీలుంది.

అవేర్‌నెస్

కాళ్ల మీద కొత్తగా పుండ్లు తలెత్తితే, వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అవి వెరికోజ్ వెయిన్ సమస్య మూలంగా ఏర్పడిన పుండ్లు అయి ఉండవచ్చు. అలాంటప్పుడు, మూల కారణాన్ని చికిత్సతో సరిదిద్దుకోవాలి.



ఆ పుండ్ల పట్ల నిర్లక్ష్యం వద్దు

వెరికోజ్ వెయిన్స్ సమస్య మందులతో తగ్గదు. కాళ్ల మీద వచ్చిన నలుపును ఎటువంటి ఆయింట్‌మెంట్లు, నూనెలూ తగ్గించలేవు. ఇలా చేయకూడదు కూడా! వెరికోజ్ వెయిన్స్‌ను తగ్గించాలంటే 'కన్జర్వేటివ్ లేదా సర్జికల్' పద్ధతులనే అవలంబించాలి. కన్జర్వేటివ్ మెథడ్‌లో వెరికోజ్ వెయిన్స్ సమస్య తీవ్రం కాకుండా, కొన్నాళ్లపాటు సాక్స్ వేసుకోవచ్చు. సాక్స్‌కు బదులుగా చేతికందిన గుడ్డలు కట్టేయకూడదు. సాక్స్ పద్ధతి కూడా ప్రారంభదశలో ఉన్న వెరికోజ్ వెయిన్స్‌కే పని చేస్తుంది. సాక్స్ కొంతవరకూ సమస్యను కంట్రోల్ చేస్తుంది కానీ నయం చేయదు. ఎప్పుడు సాక్స్ వేయడం మానేస్తే అప్పుడు తిరిగి వెరికోజ్ వెయిన్స్ ఉబ్బడం మొదలు పెడతాయి. కాబట్టి శాశ్వతంగా ఈ సమస్య తొలగించుకోవాలంటే లేజర్ సర్జరీని ఆశ్రయించాలి. పాత రోజుల్లో ఉబ్బిన సిరలను కత్తిరించి తీసేసే వాళ్లు. దీని ఫలితం 60 శాతమే! ఈ సర్జరీలో మత్తు ఇచ్చి, కోసి, సిరలను తీసేస్తారు. కాబట్టి కుట్లు పడతాయి. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాలి. కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. ఈ సర్జరీకి ప్రత్యామ్నాయంగా లేజర్ సర్జరీ అందుబాటులోకొచ్చింది. దీన్లో వెరికోజ్ వెయిన్స్‌ను నిర్ధారించుకోవడం కోసం వాడే స్కానింగ్ మిషన్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి, ఏ సిరలు పని చేయట్లేదో వాటిలోకి లేజర్ ఫైబర్‌ను పంపిస్తారు. ఆ సన్నని ఫైబర్ ద్వారా చిన్న జల్లెడను పంపించి, కవాటాలు తిరిగి మూసుపోకుండా నియంత్రిస్తారు. 15 నిమిషాలు పట్టే ఈ సర్జరీ తర్వాత గంటకే ఇంటికెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచే పనులన్నీ చేసుకోవచ్చు.

కాళ్ల మీద పుండ్లు

మధుమేహంతో సంబంధం లేని 'నాన్ డయాబెటిక్ అల్సర్లు' వెరికోజ్ వెయిన్స్ వల్లే ఏర్పడతాయి. ఈ సమస్యను పుండుగానే చూస్తారే తప్ప అది ఏర్పడడానికి కారణం గురించి ఆలోచించరు. చర్మం రంగు మారితే చర్మ వైద్యులను కలిసి, పైపూతలు, ఆయింట్‌మెంట్లు పూయడం చేస్తుంటారు. పుండు పడితే యాంటిబయాటిక్ క్రీమ్‌లు వాడుతూ ఉంటారు. ఇలా వెరికోజ్ వెయిన్స్ వల్ల ఏర్పడిన పుండ్లు నిర్లక్ష్యానికి గురై మరీ పెద్దవైతే పూర్తిగా కాలే తొలగించాల్సిన దుస్థితికీ దారితీయొచ్చు. కాబట్టి అకారణంగా కాళ్ల మీద పుండ్లు ఏర్పడితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

గర్భిణుల్లో...

30 నుంచి 50 ఏళ్ల లోపు మహిళల్లో వెరికోజ్ వెయిన్స్ సమస్య మొదలవ్వొచ్చు. మరీ ముఖ్యంగా గర్భిణుల్లో ఈ ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఎక్కువ. గర్భంతో ఉన్నప్పుడు పెరిగిన శరీర బరువు వల్ల కాళ్లలోని సిరల మీద ఒత్తిడి పడుతుంది. దాంతో వెరికోజ్ వెయిన్స్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. మరీ ముఖ్యంగా తల్లితండ్రుల్లో ఎవరికైనా వెరికోజ్ వెయిన్స్ ఉంటే గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. గర్భంతో ఉన్నా వైద్యుల సూచనల మేరకు పిక్కల కదలికలు పెంచే వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలి. కొందరు గర్భిణుల్లో గర్భంతో ఉన్నప్పుడు కనిపించే వెరికోజ్ వెయిన్స్ ప్రసవం తర్వాత తగ్గిపోవచ్చు. ఇంకొందరికి ప్రసవం తర్వాత కూడా కొనసాగవచ్చు.

అదితి తల్లిదండ్రుల 'సూట్' కష్టాలు



న్యూఢిల్లీ: క్రీడా అవార్డుల ప్రదానోత్సవం కోసం ఇక్కడకు వచ్చిన యువ ఆర్చర్ అదితి గోపీచంద్ తల్లిదండ్రులు వణికిస్తున్న చలిలో ఢిల్లీ వీధుల్లో 'సూట్' కొనుక్కునే పనిలో పడ్డారు. రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగే కార్యక్రమంలో ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అదితి అర్జున అవార్డును అందుకోనుంది. దీన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు మహారాష్ట్రలోని సతార నుంచి ఆమె తల్లిదండ్రులు గోపీచంద్, శైలా స్వామి వచ్చారు. అయితే, అవార్డుల కార్యక్రమానికి హాజరుకావాలంటే ప్రత్యేక డ్రెస్ కోడ్ పాటించాలని ఢిల్లీ వచ్చాకే వారికి తెలిసిందట. దీంతో తగిన దుస్తుల కోసం ఢిల్లీలోని పాలికా బజార్‌లో షాపింగ్ చేస్తున్నట్టు తెలిపాడు. అదితి తండ్రి ఓ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

వహ్వా.. ఇషా

ఒలింపిక్ బెర్త్ ఖరారు




వరుణ్ తోమర్ కూడా..

తొలిరోజు భారత్‌కు 4 స్వర్ణాలు

ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్

జకార్త: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ మరో రెండు బెర్త్‌లు దక్కించుకుంది. సోమవారం ఇక్కడ ప్రారంభమైన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్, వరుణ్ తోమర్ మహిళలు, పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ విభాగాల్లో ఈ బెర్త్‌లు అందించారు. ఇషా 243.1 పాయింట్ల స్కోరుతో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. పాకిస్థాన్‌కు చెందిన కిష్మాలా తలత్ రజతం, ఇషా సహచరి రిథమ్ సాంగ్వాన్ కాంస్యం దక్కించుకున్నారు. అనంతరం ఇషా, రిథమ్, సురభి రావ్‌తో కూడిన భారత జట్టు 1736 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకుంది. ఇక యూపీకి చెందిన 20 ఏళ్ల తోమర్ 239.6 పాయింట్లు స్కోరు చేయడం ద్వారా పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. అర్జున్ చీమా రజతం నెగ్గాడు. అంతకుముందు 10 మీ. ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో తోమర్, చీమా, ఉజ్వల్ మాలిక్ త్రయం 1740 పాయింట్లతో పసిడి పతకం నెగ్గింది. ఈ రెండింటితో కలిపి..విశ్వక్రీడల షూటింగ్‌లో భారత్‌కు ఇప్పటివరకు మొత్తం 15 స్థానాలు ఖరారయ్యాయి. ఇక.. ఆసియా క్వాలిఫయర్స్ తొలిరోజు వ్యక్తిగత కేటగిరిలో రెండు, టీమ్ విభాగంలో లభించిన మరో రెండు స్వర్ణాలు సహా.. భారత్ మొత్తం ఆరు పతకాలను సొంతం చేసుకుంది.

జర్మన్ సాకర్ దిగ్గజం బెకన్‌బావర్ అస్తమయం





మ్యూనిచ్: జర్మనీ దిగ్గజ ఫుట్‌బాలర్ ఫ్రాంజ్ బెకన్‌బావర్ (78) కన్నుమూశాడు. 'ఆదివారం ఆయన నిద్రలోనే ప్రశాంతంగా మరణించారు' అని ఫ్రాంజ్ కుటుంబం సోమవారం వెల్లడించింది. అయితే ఆయన మృతికి కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ప్రపంచ సాకర్ 'ఆల్ టైమ్ గ్రేట్'లో ఒకడైన బెకన్‌బావర్ కెప్టెన్, మేనేజర్‌గా రెండుసార్లు జర్మనీ జట్టుకు ప్రతిష్ఠాత్మక ఫిఫా కప్‌ను అందించాడు. అతడి సారథ్యంలో జర్మనీ జట్టు 1974లో విశ్వవిజేతగా నిలిచింది. అలాగే ఫ్రాంజ్ మేనేజర్‌గా తిరిగి 1990లో రెండోసారి ఫిఫా కప్ సొంతం చేసుకుంది. అందుకే బెకన్‌బావర్ నాయకత్వ లక్షణాలకు చిహ్నంగా అతడిని 'డెర్ కైజర్' అని పిలుస్తారు. జర్మన్ భాషలో 'కైజర్' అంటే చక్రవర్తి అని అర్థం. వరల్డ్ ఫుట్‌బాల్‌లో ఆటగాడిగా, మేనేజర్‌గా ఫిఫా కప్ అందుకున్న త్రయంలో ఒకడు బెకన్‌బావర్. మిగిలిన ఇద్దరు బ్రెజిల్‌కు చెందిన మారియో జగాలో, ఫ్రాన్స్ ఆటగాడు డిడెర్ డిషాంప్. 1945లో జన్మించిన ఫ్రాంజ్.. మిడ్‌ఫీల్డర్‌గా 103 మ్యాచ్‌ల్లో జర్మనీకి ప్రాతినిథ్యం వహించాడు. 1974-76 మధ్య బేయర్న్ మ్యూనిచ్‌కు వరుసగా మూడుసార్లు యూరోపియన్ కప్ అందించాడు. ఫ్రాంజ్ రెండుసార్లు 'బాలెన్ డి ఓర్' అవార్డులు అందుకున్నాడు.

అమెరికాలో మన మారథాన్ వీరుడు నవీన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అమెరికాలో స్థిరపడిన తెలుగు అథ్లెట్ అప్పలనేని నవీన్‌కు పరుగే ఊపిరి. 2015లో మారథాన్లలో పాల్గొనడం ప్రారంభించిన ఈ వెటరన్ అథ్లెట్ ఇప్పటికి 58 మారథాన్ పోటీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. నవీన్ స్వస్థలం ప్రకాశం జిల్లా అన్నంభొట్లవారిపాలెం. అమెరికాలోని నార్త్ కరోలినాలో స్థిరపడిన నవీన్ 2015లో 'చారిటీ రన్'తో తన మారథాన్ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 50 మారథాన్‌లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ తెలుగుతేజం ఎనిమిదేళ్ల వ్యవధిలోనే తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. ప్రతి 3-4 నెలలకు ఒక మారథాన్‌ను పూర్తి చేసే నవీన్, 2021లో జూన్‌లో వరసగా మూడ్రోజుల్లో మూడు మారథాన్లను పూర్తి చేసి, ఔరా అనిపించాడు. జూన్ 10న ఇదహో, 11న వ్యోమింగ్, 12న ఉటాహ్ మారథాన్లను దిగ్విజయంగా పూర్తి చేశాడు. మారథాన్లు కాకుండా దాదాపుగా 100కి పైగా పరుగు పోటీల్లోనూ పాల్గొన్నాడు. ఇందులో హాఫ్ మారథాన్లతో పాటు 10కే, 5కే రన్‌లు ఉన్నాయి. నవీన్ అనేక మంది ఔత్సాహిక రన్నర్లకు కూడా శిక్షణ ఇస్తున్నాడు. నవీన్ శిష్యుల్లో ఇప్పటివరకు దాదాపు 100 మంది మారథాన్లు, హాఫ్ మారథాన్లు పూర్తి చేశారు. వీరిలో 10 మంది 13 ఏళ్ల లోపు బాలురు హాఫ్ మారథాన్‌ల్లో పతకాలు సాధించారు. కేన్సర్‌తో పోరాడుతున్న తన స్నేహితుడిలో ప్రేరణ కలిగించడానికి ఈ మారథాన్ యజ్ఞానికి శ్రీకారం చుట్టిన నవీన్, అతడు ఆ మహమ్మారి వ్యాధిని జయించడానికి తోడ్పడ్డాడు.

టెస్ట్ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



ప్రిటోరియా: స్వల్ప కాల తన టెస్ట్ క్రికెట్ కెరీర్‌కు దక్షిణాఫ్రికా కీపర్, బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సోమవారం వీడ్కోలు పలికాడు. 2019లో రాంచీలో భారత్‌పై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన 32 ఏళ్ల క్లాసెన్ కేవలం నాలుగు టెస్టులే ఆడాడు. గత ఏడాది జొహాన్నెస్‌బర్గ్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆఖరిది. అయితే తెల్లబంతుల ఫార్మాట్‌కు అందుబాటులో ఉంటానని క్లాసెన్ తెలిపాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అతడు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

బంగ్లా కెప్టెన్ షకీబ్ ఇక పార్లమెంట్ సభ్యుడు



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు కెప్టెన్ షకీబ్ అల్ హసన్ దేశ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన సాధారణ ఎన్నికల్లో..ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ తరఫున మగురా నియోజకవర్గం నుంచి షకీబ్ పోటీ చేశాడు. 1.79 లక్షల భారీ మెజార్టీతో విజయం సాధించాడు. పార్లమెంట్‌కు ఎన్నికైనా..క్రికెట్‌లో కొనసాగుతానని 36 ఏళ్ల షకీబ్ స్పష్టంజేశాడు.

'తొలి' సిరీస్ దక్కేనా?



ఒత్తిడిలో భారత్

నేడు ఆసీస్‌తో ఆఖరి టీ20

రాత్రి 7.00 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..

ముంబై: స్వదేశంలో ఆస్ట్రేలియాపై తొలి టీ20 సిరీస్ కోసం భారత మహిళల జట్టు ఉవ్విళ్లూరుతోంది. ఆదివారంనాటి రెండో మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధిస్తారని అభిమానులు భావించినా.. అన్ని విభాగాల్లోనూ విఫలమై హర్మన్‌ప్రీత్ సేన నిరాశ పరిచింది. మంగళవారం ఇరు జట్ల మధ్య నిర్ణాయక మూడో టీ20 జరుగనుంది. ఈ సువర్ణావకాశాన్ని చేజారనీయకుండా చక్కటి ఫలితంతో సిరీస్‌ను ముగించాలన్న ఆలోచనలో భారత్ ఉంది. అటు ఆసీస్ మాత్రం ఎప్పటిమాదిరే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. మొత్తంగా ఆసీస్ మహిళా జట్టుతో జరిగిన ఐదు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ 2015-16లో మాత్రమే (ఆసీస్ గడ్డపై) సిరీస్ నెగ్గింది. ఆ జట్టు భారత పర్యటనకు రావడం ఇది మూడోసారి.

బ్యాటర్లపైనే భారం: ఓపెనర్లు షఫాలీ, మంధాన దూకుడుతో తొలి టీ20లో తొమ్మిది వికెట్లతో నెగ్గినా.. రెండో మ్యాచ్‌లో మాత్రం బ్యాటింగ్ ఆర్డర్ ఆకట్టుకోలేకపోయింది. బౌలర్లు కాస్త ప్రయత్నించినప్పటికీ స్వల్ప ఛేదనే కావడంతో ఆసీస్‌పై ఒత్తిడి లేకుండా పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తోంది. అన్ని ఫార్మాట్లలో కలిపి గత పది మ్యాచ్‌ల్లో ఆమె అర్ధసెంచరీ కూడా చేయలేపోయింది. దాదాపుగా సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతోంది. జెమీమా, రిచా ఎక్కువ సేపు క్రీజులో నిలిస్తే భారీ స్కోరు ఖాయమే. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మాత్రం రెండు విభాగాల్లోనూ అండగా నిలుస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్లు పరుగుల కోసం ఇబ్బందిపడ్డాయి. దీంతో నేటి మ్యాచ్‌లోనూ టాస్ గెలిచిన జట్టు చేజింగ్ వైపే మొగ్గు చూపవచ్చు.

పరాగ్ రికార్డు శతకం



రాయ్‌పూర్: కెప్టెన్ రియాన్ పరాగ్ (87 బంతుల్లో 11 ఫోర్లు, 12 సిక్స్‌లతో 155) రంజీల్లో రెండో వేగవంతమైన సెంచరీతో చెలరేగినా.. అసోంకు ఓటమి తప్పలేదు. గ్రూప్-బిలో ఛత్తీస్ గఢ్ 10 వికెట్లతో అసోంను చిత్తు చేసింది. ఫాలో-ఆన్ ఆడిన అసోం రెండో ఇన్నింగ్స్‌లో 254 పరుగులకు కుప్పకూలింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛత్తీస్‌గఢ్ 20 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ 327, అసోం 159 రన్స్ చేశాయి. ఇక, పరాగ్ రికార్డుస్థాయిలో 56 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకొన్నాడు. 2016లో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఢిల్లీ ఆటగాడు రిషబ్ పంత్ 48 బంతుల్లోనే సెంచరీ చేశాడు.

ఆంధ్రకు 3 పాయింట్లు

బెంగాల్‌తో రంజీ మ్యాచ్ డ్రా

విశాఖ: గ్రూప్-బిలో బెంగాల్‌తో ఆంధ్ర రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రికీ భుయ్(175) డబుల్ సెంచరీ మిస్ అయినా.. జట్టుకు 36 పరుగుల తొలిఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించాడు. ఆటకు నాలుగో, చివరిరోజైన సోమవారం 339/6తో తొలిఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 445 రన్స్‌కు ఆలౌటైంది. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ 82/1 స్కోరు చేసింది. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 409 రన్స్ చేసింది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఆంధ్రకు 3, బెంగాల్‌కు ఒక పాయింట్ దక్కాయి.

అందరూ తాగేవాళ్లే: ప్రవీణ్



న్యూఢిల్లీ: భారత మాజీ పేసర్ ప్రవీణ్ కుమార్ ఆటలోకన్నా మైదానం వెలుపల ప్రవర్తనపై తరచూ వార్తల్లో ఉండేవాడు. అయితే తనపై అకారణంగా తాగుబోతనే నింద పడిందని, గతంలో జట్టులో ఉన్న ఆటగాళ్లందరికీ మద్యం అలవాటు ఉండేదని ప్రవీణ్ తేల్చాడు. 2007-2012 మధ్య ప్రవీణ్ భారత జట్టులో కొనసాగాడు. 'నేను జట్టులో ఉన్నప్పుడు మందు తాగొద్దని సీనియర్లు సలహా ఇచ్చేవారు. కానీ ఆ పని అందరూ చేసేవారు. కానీ నేనొక్కడినే తాగుతాననే చెడ్డపేరు వచ్చేలా చేశారు' అని ప్రవీణ్ తెలిపాడు. సచిన్, ద్రవిడ్, గంగూలీలాంటి వారు అలా చెప్పేవారా? అనే ప్రశ్నకు.. 'పేరు చెప్పను కానీ, ఆ క్రికెటర్ ఎవరో అందరికీ తెలుసు' అని అన్నాడు.

బరిలో ప్రణయ్, సేన్, శ్రీకాంత్

నేటినుంచి మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: కొత్త సీజన్..పైగా ఒలింపిక్స్‌కు క్వాలిఫై కావాల్సిన తరుణం..ఈ నేపథ్యంలో భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్ మంగళవారం మొదలయ్యే మలేసియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం అందుకోవాలని భావిస్తున్నారు. వచ్చే ఏప్రిల్ ఆఖరికి బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉన్నవారే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. దీంతో తదుపరి 4 నెలలు మన షట్లర్లకు కీలకం కానుంది. మలేసియా ఓపెన్ తొలిరౌండ్లో ఆంద్రియాస్ ఆంటొన్సెన్‌తో ప్రణయ్, వెంగ్ హాంగ్‌తో లక్ష్యసేన్, ఆరోసీడ్ జొనాథన్ క్రిస్టీతో శ్రీకాంత్ తలపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో షోహిబుల్/మౌలానా జంటతో రెండో సీడ్ సాత్విక్/చిరాగ్ ద్వయం మొదటిరౌండ్ ఆడనుంది. మోకాలి గాయం కారణంగా పీవీ సింధు ఈ టోర్నీకి దూరంగా ఉంది.

సెలెక్టర్లకు అంత ధైర్యం లేదు



ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ: అఫ్ఘాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్ కోసం రోహిత్, విరాట్‌ల ఎంపికపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా భిన్నంగా స్పందించాడు. ఏడాది కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చిన వీరు.. రాబోయే టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఆడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఇద్దరిలో ఎవరో ఒక్కరినే జట్టులోకి ఎంపిక చేసే ధైర్యం ఏ సెలెక్టర్‌కూ లేదని ఆకాశ్ చోప్రా స్పష్టం చేశాడు. ఇద్దరినీ పక్కనబెట్టడమో.. లేదా తీసుకోవడమో చేయాల్సిందేనని చెప్పాడు. మరోవైపు హార్దిక్, సూర్యకుమార్, రుతురాజ్ గాయాలతో బాధపడుతుండడం, శ్రేయా‌స్‌కు రెస్ట్ ఇవ్వడంతో ఇద్దరు సీనియర్లను జట్టులోకి తీసుకున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

'ఎంఎఫ్' ఆస్తులు.. రూ.50 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: గత ఏడాది (2023).. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లోకి పెట్టుబడులు వెల్లువెత్తడంతో పరిశ్రమ ఆస్తులు రూ.11 లక్షల కోట్ల మేర పెరిగి రూ.50 లక్షల కోట్ల మార్కును అధిగమించాయి. ఈక్విటీ మార్కెట్లు ఆశావహంగా ఉండడం, ఆర్థిక స్థిరత్వంపై ఏర్పడిన చైతన్యం, శక్తివంతమైన ఆర్థిక వృద్ధి ఇందుకు దోహదపడ్డాయి. తక్కువ వ్యయంతో దీర్ఘకాలిక సంపద సృష్టికి మార్గాలు అందించగల తన సామర్థ్యాన్ని ఎంఎఫ్ పరిశ్రమ నిరూపించుకోగలిగిందని, అదే ఈ విజయానికి కారణమని మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ అసోసియేషన్ (ఏఎంఎఫ్ఐ) తెలిపింది. దేశంలో ఎంఎఫ్‌ల ఆస్తుల విలువ పెరగడం వరుసగా ఇది 11వ సంవత్సరం.

- 2023లో ఎంఎఫ్‌లలోకి రూ.2.74 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా సిస్టమాటిక్ పెట్టుబడి ప్లాన్లు (సిప్) రూ.1.84 లక్షల కోట్ల నిధులు ఆకర్షించాయి.
- ఈ నిధుల రాకతో ఎంఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) 27 శాతం పెరిగి రూ.10.9 లక్షల కోట్లు జోడయింది. 2022లో నమోదు చేసిన 5.7 శాతం వృద్ధి, రూ.2.65 లక్షల కోట్ల ఏయూఎంల పెరుగుదల కన్నా ఇది చాలా అధికం.
- ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ 2022లో రూ.39.88 లక్షల కోట్లు కాగా 2023 ముగిసే నాటికి రూ.50.78 లక్షల కోట్లకు పెరిగింది.
- ఎంఎఫ్ సంస్థల ఏయూఎం తొలి రూ.10 లక్షల కోట్ల మైలురాయిని చేరడానికి సుమారు 50 సంవత్సరాలు పట్టగా రూ.40 లక్షల కోట్ల నుంచి రూ.50 లక్షల కోట్లకు చేరడానికి కేవలం ఏడాది పట్టింది.
- సిప్‌ల పట్ల రిటైల్ ఇన్వెస్టర్లు అధికంగా మొగ్గు చూపారు. 2023లో సిప్‌లలోకి రూ.1.84 లక్షల కోట్ల నిధులు వచ్చాయి.
- ఆటుపోట్లు అధికంగా ఉన్న, ప్రతికూల ఆర్థిక వాతావరణంలో బంగారం పెట్టుబడికి చక్కని రక్షణ కల్పిస్తుందని ఇన్వెస్టర్లు భావిస్తారు. ఈ కారణంగా గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ.2,200 కోట్లు వచ్చాయి..

దేశంలో తగ్గిన ఆదాయ అంతరాలు



సరైన బాటలోనే వృద్ధి రేటు: ఎస్‌బీఐ రీసెర్చ్

న్యూఢిల్లీ: దేశంలో ఆదాయ అంతరాలు తగ్గాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉండే వ్యక్తులు 2013-22 మధ్య కాలంలో ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 295 శాతం పెరిగిన విషయాన్ని గుర్తు చేసింది. ఇదే సమయంలో రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల సంఖ్యా 291 శాతం పెరిగిందని తెలిపింది. 2021-22 అసెస్‌మెంట్ ఇయర్‌లో ఏడు కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయగా 2023-24 అసెస్‌మెంట్ ఇయర్‌కి ఈ సంఖ్య 8.2 కోట్లకు చేరినట్టు పేర్కొంది. ఆదాయ అంతరాల పరిశీలనకు ప్రామాణికంగా భావించే జినీ కోఎఫిషియెన్సీ ప్రకారం చూసినా ఆదాయ అంతరాలు 2014-22 ఆర్థిక సంవత్సరాల మధ్య అంతరం 0.472 నుంచి 0.403కి తగ్గిన విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ గుర్తు చేసింది.

సజావుగానే వృద్ధి రేటు

కొవిడ్ తర్వాత భారత ఆర్థిక వృద్ధి రేటు ఇంగ్లీషు అక్షరం 'కే' రూపంలో కొన్ని రంగాల్లో పెరిగి, కొన్ని రంగాల్లో క్షీణిస్తుందంటూ కొంతమంది ఆర్థిక వేత్తలు వేసిన అంచనాలనీ ఎస్‌బీఐ తోసిపుచ్చింది. వీరి అంచనాలు దురుద్దేశాలతో కూడినవని తెలిపింది. ప్రస్తుతం అన్ని రంగాలు సరైన వృద్ధి బాటులోనే ఉన్నట్టు తెలిపింది. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో సహా పలువురు ఆర్థికవేత్తలు కొవిడ్ తర్వాత భారత ఆర్థిక వృద్ధి రేటు 'కే' రూపంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆటో రిక్షాలకు ఊరట

థర్డ్ పార్టీ ప్రీమియంపై పరిమితి

న్యూఢిల్లీ: ఆటో రిక్షాల థర్డ్ పార్టీ ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రకారం డీజిల్ లేదా గ్యాస్‌తో నడిచే ఆటోలపై వసూలు చేసే థర్డ్ పార్టీ ప్రీమియం ఒక్కో వాహనంపై రూ.2,371, ఒక్కో ప్రయాణికుడిపై రూ.1,134 మించకూడదని స్పష్టం చేసింది. ఇక ఎలక్ట్రిక్ రిక్షాల (ఈ-రిక్షా)పై వసూలు చేసే థర్డ్ పార్టీ ప్రీమియాన్ని ఒక్కో వాహనానికి రూ.1,539, ఒక్కో ప్రయాణికుడికి రూ.737కు పరిమితం చేసింది. ఆరుగురి కంటే తక్కువ మంది ప్రయాణించే ఆటో రిక్షాలకు మాత్రమే ఈ పరిమితి వర్తిస్తుంది. కేంద్ర రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2022లో జారీ చేసిన నిబంధనల ప్రకారం డీజిల్ లేదా గ్యాస్‌తో నడిచే ఆటో రిక్షాలు థర్డ్ పార్టీ ప్రీమియం కింద ఒక్కో ఆటోపై రూ.2,539, ఒక్కో ప్రయాణికుడిపై రూ.1,214 చెల్లించాలి. అదే ఈ-ఆటోలైతే ఒక్కో వాహనంపై రూ.1,648, ఒక్కో ప్రయాణికుడిపై రూ.789 థర్డ్ పార్టీ ప్రీమియంగా చెల్లించాల్సి వచ్చేది.

తాన్లా బోర్డులోకి ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తాన్లా ప్లాట్‌ఫామ్స్ బోర్డులో ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మకు స్థానం లభించింది. దీంతో కంపెనీ బోర్డులో మొత్తం డైరెక్టర్ల సంఖ్య ఏడుకు చేరుతుందని తాన్లా వ్యవస్థాపక చైర్మన్, సీఈఓ ఉదయ్ రెడ్డి తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రయాణంలో శర్మ కీలక పాత్ర పోషించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఆయనకు దాదాపు ఐదు దశాబ్దాల అనుభవం ఉంది. 2015 నుంచి 2020 వరకూ టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)కు ఆర్‌ఎస్ శర్మ చైర్మన్‌గా సేవలు అందించారు. 1978 నుంచి ఐఏఎస్ అధికారిగా పని చేశారు. శర్మ వంటి విశేష అనుభవం ఉన్న వ్యక్తి తాన్లా బోర్డులో చేరడంతో ఆయనకు ఉన్న అపార అనుభవం కంపెనీ విజయానికి బాగా ఉపయోగపడుతుందని ఉదయ్ రెడ్డి అన్నారు.

బిజినెస్

ప్రతికూల పవనాలతో పతన బాటలోకి


సెన్సెక్స్ 671 పాయింట్లు డౌన్

ముంబై: ప్రపంచ మార్కెట్లలో బలహీనతలు సోమవారం భారత ఈక్విటీ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు రెండు రోజుల లాభాలకు తెర దించి నష్టాలతో ముగిశాయి. దీంతో సెన్సెక్స్ 670.93 పాయింట్ల నష్టంతో 71,355.22 వద్ద ముగిసింది. ఒక దశలో సూచీ 725.11 పాయింట్లు నష్టపోయి 71,301.04 స్థాయికి దిగజారింది. నిఫ్టీ 197.80 పాయింట్ల నష్టంతో 21,513 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2,91,756.23 కోట్లు దిగజారి రూ.3,66,40,965.08 కోట్ల వద్ద స్థిరపడింది.

బజాజ్ ఆటో రూ.4,000 కోట్లతో బైబ్యాక్: బజాజ్ ఆటో లిమిటెడ్.. రూ.4,000 కోట్లతో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. బైబ్యాక్‌లో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖ విలువతో కూడిన 40 లక్షల షేర్లను వెనక్కు తీసుకోనుంది. ఒక్కో షేరును రూ.10,000తో బైబ్యాక్ చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది.

కేజీ బేసిన్‌లో ఉత్పత్తి షురూ : ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ ఎట్టకేలకు కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని తన డీ-5 బ్లాక్ నుంచి చమురు, గ్యాస్ ఉత్పత్తి ప్రారంభించింది. ఆదివారం నుంచి ఈ ఉత్పత్తి ప్రారంభమైనట్టు తెలిపింది. అయితే రోజుకు ఎంత పరిమాణంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నదీ కంపెనీ వెల్లడించలేదు. ఆంధ్ర ప్రదేశ్ తీరానికి 35 కిలోమీటర్ల దూరంలో రిలయన్స్ డీ-6 బ్లాక్ పక్కనే ఈ క్షేత్రం ఉంది. సముద్ర మట్టానికి 3,000 నుంచి 3,200 మీటర్ల లోతులో ఉన్న ఈ బ్లాక్ అభివృద్ధి కోసం ఓఎన్‌జీసీ దాదాపు 512 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఈ క్షేత్రంలో 2.35 కోట్ల టన్నుల చమురు, 50.71 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు సమాచారం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▼	57,800 ▼	77,800 ▼
ముంబై	62,192 ▼	56,968 ▼	71,386 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	560	విశాఖపట్నం	625
9 జనవరి		వరంగల్	562
చిత్తూరు	583	దజను గుడ్లు రూ.72	
గోదావరి	565		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75	గోదావరి	84
వరంగల్	75	విజయవాడ	84
కరీంనగర్	75	గుంటూరు	82
మహబూబ్‌నగర్	75	ఒంగోలు	82
కర్నూలు	75	చిత్తూరు	78
విశాఖపట్నం	79		

జీ-సోనీ విలీనం కథ కంచికి!

ముంబై: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీ)లో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విలీనం కథ కంచికి చేరుతున్నట్టు సమాచారం. విలీనం తర్వాత ఏర్పడే కొత్త కంపెనీకి జీ నెట్‌వర్క్ ప్రమోటర్ సుభాష్ చంద్ర కుమారుడు పునీత్ గోయెంకా సీఈఓ కావడాన్ని సోనీ వ్యతిరేకిస్తోంది. జీలో ఆయన అక్రమాలపై సెబీ దర్యాప్తు జరుపుతున్నందున గోయెంకాను ఎట్టిపరిస్థితుల్లోనూ విలీన కంపెనీకి సీఈఓగా అంగీకరించే ప్రసక్తే లేదని సోనీ పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఈ విలీనం ద్వారా దాదాపు 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.83,200 కోట్లు) మీడియా దిగ్గజం ఏర్పడుతుందని భావించారు. అయితే తాజా పరిణామాలతో ఆ ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ఫ్లిప్‌కార్ట్‌లో కొలువుల కోత

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్'లోనూ ఉద్యోగుల తీసివేత ప్రారంభమవుతోంది. ఉన్న ఉద్యోగుల్లో 5 నుంచి 7 శాతం మందిని 'పనితీరు' పేరుతో ఇంటికి పంపించాలని కంపెనీ నిర్ణయించినట్టు సమాచారం. మార్చిలోగా 'పనితీరు' పేరుతో 1,500 మందిపై వేటు వేయాలని కంపెనీ నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం.

మెర్సిడెస్ రూ.200 కోట్ల పెట్టుబడి

- ఈ ఏడాది కొత్తగా 12 మోడళ్లు
- మార్కెట్లోకి సరికొత్త జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీ



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్.. కొత్త ఉత్పత్తులు, తయారీ కార్యకలాపాలు, డిజిటైజేషన్ వంటి కార్యకలాపాలపై ఈ ఏడాది రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. 2023 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 17,408 కార్లు విక్రయించిన కంపెనీ తన స్థానం మరింత పటిష్ఠం చేసుకోవడం కోసం విభిన్న చర్యలు తీసుకుంటున్నట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు. కాగా కంపెనీకి 2024 సంవత్సరం ప్రత్యేకమైనదని, తాము భారత మార్కెట్లోకి అడుగుపెట్టి ఈ ఏడాదితో 30 ఏళ్లు పూర్తవుతాయని అయ్యర్ తెలిపారు. దేశీయ లగ్జరీ మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునే లక్ష్యంతో ఈ ఏడాది 12 కొత్త కార్లను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో 3 ఎలక్ట్రిక్ మోడల్స్‌తో పాటు టాప్ ఎండ్ వెహికల్ సెగ్మెంట్ కార్లు ఉండనున్నాయని అయ్యర్ పేర్కొన్నారు. ఈ కార్ల ధర రూ.1.5 కోట్ల నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. కొత్త ఉత్పత్తులు, డిజిటలైజేషన్, తయారీ కార్యకలాపాల కోసం పుణె ప్లాంట్‌లో ఈ ఏడాది రూ.200 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని, ఈ పెట్టుబడులతో భారత్‌లో మెర్సిడెస్ పెట్టుబడులు రూ.3,000 కోట్లకు చేరుకుంటాయని తెలిపారు. కాగా సోమవారం నాడు కంపెనీ మార్కెట్లోకి సరికొత్త జీఎల్ఎస్ లగ్జరీ ఎస్‌యూవీని తీసుకువచ్చింది. ఈ ఎస్‌యూవీ పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో అందుబాటులో ఉండనుంది. ఈ కార్ల ధరలు వరుసగా రూ.1.32 కోట్లు, రూ.1.37 కోట్లుగా ఉన్నాయి.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.75-80 కోట్ల పెట్టుబడులు

మహారాష్ట్రలో నాలుగో కొత్త యూనిట్.. మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వెల్లడి

MOLD-TEK Packaging Limited

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సామర్థ్య విస్తరణకు మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.75-80 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇప్పటికే మూడు కొత్త తయారీ యూనిట్లను ఏర్పాటు చేసిన కంపెనీ మహారాష్ట్రలోని మహద్‌లో నాలుగో యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు అవసరమైన భూమిని సేకరించామని, రూ.20 కోట్లతో ఏర్పాటు చేసే ఈ యూనిట్ వార్షిక సామర్థ్యం 1,500 టన్నులు ఉంటుందని మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ సీఎండీ లక్ష్మణ్ రావు తెలిపారు. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అవసరాల కోసం దీన్ని ప్రారంభిస్తున్నారు. తమిళనాడులోని చెయ్యార్, తెలంగాణలోని సుల్తాన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన ప్లాంట్లను కంపెనీ ప్రారంభించింది. కొద్ది రోజుల క్రితం హరియాణాలోని పానిపట్‌లో నిర్మించిన యూనిట్‌ను కూడా ప్రారంభించింది. ఈ మూడు యూనిట్లపై మోల్డ్‌టెక్ రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టింది. నాలుగు యూనిట్లలో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమైతే.. 2024-25 చివరి నాటికి మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ వార్షిక సామర్థ్యం 54,000 టన్నులకు చేరుతుంది. వచ్చే 5-6 ఏళ్లలో ఫుడ్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలకు సరఫరా చేసే ఉత్పత్తుల విలువ మొత్తం టర్నోవర్‌లో దాదాపు 50 శాతం ఉంటుందని కంపెనీ అంచనా వేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిమాణపరంగా విక్రయాలు 15-18 శాతం పెరగవచ్చని భావిస్తోంది. 2023-24లో పతంజలి, జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా వంటి కంపెనీలు మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ ఖాతాదారుల జాబితాలో చేరాయి.

కుమార్తెతో సహా వైసీపీలోకి ఎంపీ కేశినేని?

▸▸ తాజాగా కార్పొరేటర్ పదవికి శ్వేత రాజీనామా



మేయర్ భాగ్యలక్ష్మికి రాజీనామా పత్రాన్ని అందిస్తున్న కేశినేని శ్వేత

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/చిట్టినగర్): విజయవాడ ఎంపీ, టీడీపీ నాయకుడు కేశినేని శ్రీనివాస్ ఉరఫ్ నాని వైసీపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వారం, పది రోజుల్లో ఆయన వైసీపీ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. విజయవాడ పార్లమెంటు స్థానం నుంచే ఆయన వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో తాను పోటీ చేయబోనని నాని పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబుకే స్పష్టం చేశారు. అదే సమయంలో పార్లమెంట్ పరిధిలోని వైసీపీ ఎమ్మెల్యేలతో ఆయన కలివిడిగా ఉంటున్నారు. ఎంపీ నియోజకవర్గ నిధులు కూడా వారు సూచించిన పనులకే ఇచ్చేవారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై టీడీపీ శ్రేణులు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా 'ప్రొటోకాల్' పేరుతో నాని తన విధానాన్ని సమర్థించుకునేవారు. ఇదిలావుంటే, నాని కుమార్తె, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 11వ వార్డు టీడీపీ కార్పొరేటర్‌గా ఉన్న కేశినేని శ్వేత సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. మేయర్ భాగ్యలక్ష్మిని కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. టీడీపీకి కూడా రాజీనామా చేస్తానని తెలిపారు.

నేడు, రేపు మూడు జిల్లాల్లో చంద్రబాబు సభలు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు మంగళ, బుధవారాల్లో మూడు జిల్లాల్లో జరిగే సభల్లో పాల్గొననున్నారు. రా.. కదలి రా పేరుతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సభలో చంద్రబాబు పాల్గొంటారు. బుధవారం మధ్యాహ్నం 12గంటలకు బొబ్బిలి సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి కాకినాడ జిల్లా తునికి హెలికాప్టర్లో వెళ్తారు. అక్కడ మధ్యాహ్నం మూడున్నర గంటలకు జరిగే సభలో పాల్గొంటారు.

వైసీపీ సర్కార్ పాపాలు.. పిల్లల పాలిట శాపాలు

▸▸ 'మత్తు'పై యుద్ధం చేద్దాం... రండి: లోకేశ్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కార్ పాపాలు, స్కూల్ పిల్లల పాలిట శాపాలుగా మారుతున్నాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. విద్యార్థి దశలోనే పిల్లల బంగారు భవిష్యత్ నాశనం చేస్తున్న మత్తు పదార్థాల మహమ్మారిపై యుద్ధం చేద్దాం రండి అని ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. "చిత్తూరు జిల్లాలో స్కూల్‌కి వెళ్లిన అమ్మాయిని గంజాయికి బానిసని చేసి, వైసీపీ ముఠా లైంగిక దాడులకు పాల్పడింది. ఆ అమ్మాయిని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపాం. చంద్రగిరిలో 9వ తరగతి అమ్మాయి గంజాయికి బానిసైంది. చోడవరంలో ఏడో తరగతి విద్యార్థులు స్కూల్‌లో మద్యం తాగుతుండగా వీడియో తీసిన వ్యక్తిపై దాడికి చేశారు. జగన్ ఇంటి ఎదురుగా గంజాయికి బానిసైన పిల్లాడి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తే... ఆమెని పోలీసులు బెదిరించి, నోరు మూయించారు. జగన్ ఇంటికి సమీపంలో డ్రగ్స్ మత్తులో గ్యాంగ్ రేప్ జరిగితే, నేటికీ నిందితుడిని పట్టుకోలేదు. మద్యం విషాదాలు చూసి, ఆవేదనతో కట్టడి చేయాలని ప్రభుత్వాన్ని కోరాను. చివరకు ప్రధానికి, కేంద్రానికి వినతులు పంపాను. గవర్నర్‌ను కలిసి వివరించాను. పిల్లలు, యువత బంగారు భవిష్యత్ నాశనానికి కారణమైన దండుపాళ్యం వైసీపీ బ్యాచ్‌కు బుద్ధి చెప్పండి" అని పిలుపునిచ్చారు.

తినబోతూ రుచి అడగడమెందుకు?

▸▸ 2 నెలల్లో ప్రజలే నిర్ణయిస్తారు.. రాష్ట్ర పరిస్థితులపై లగడపాటి వ్యాఖ్య



హర్షకుమార్‌తో లగడపాటి భేటీ

రాజమహేంద్రవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'తినబోయే భోజనానికి ముందు రుచి అడగడం దేనికి..? రెండునెలల్లో జరిగే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు' అని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ వ్యాఖ్యానించారు. ఆయన సోమవారమిక్కడ హర్షకుమార్ ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడనని, తాను క్రియాశీల రాజకీయాల్లో లేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ షర్మిల ప్రభావం ఎలా ఉంటుందని అడుగగా.. ప్రజలే నిర్ణయిస్తారని ఆయన బదులిచ్చారు.

మా సీఎంను కలిసేందుకే టైం లేదు

▸▸ ఇక టీ సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్కడ కలుస్తాం..!: కొడాలి నాని

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు నేనేమీ అపాయింట్‌మెంట్ కోరలేదు. మాకు, మా సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకే సమయం లేదు. ఇక పొరుగు రాష్ట్రం సీఎం రేవంత్‌రెడ్డిని ఎక్కడ కలుస్తాం?' అని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. "తెలంగాణలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీని గెలిచినా అక్కడ రాజకీయాలను జగన్ వదిలేశారు. అక్కడ ఏ రాజకీయపార్టీకీ మద్దతు ఇవ్వడం లేదు. తుంటి ఎముకకు సర్జరీ జరిగినందున తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను జగన్ పరామర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌ను జగన్ పరామర్శించడానికి ఆయనకేమీ తుంటి ఎముక సర్జరీ జరగలేదు కదా..? పార్థసారథికి సీటు ఇవ్వడం లేదని సీఎం జగన్ ఎక్కడా చెప్పలేదు" అని కొడాలి అన్నారు.

నారాయణస్వామి వద్దే వద్దు

▸▸ డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా వైసీపీ నేతల ప్లకార్డులు

చిత్తూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి టికెట్ ఇవ్వద్దంటూ వైసీపీ నాయకులు కొందరు ఏకంగా సమావేశమై మరీ డిమాండ్ చేశారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలంలోని పులిగుండు శివాలయం వద్ద సోమవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడు దయాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో నారాయణస్వామి అభ్యర్థి అయితే కచ్చితంగా ఓడిపోతారని, కొత్త అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటామని అధిష్ఠానాన్ని కోరారు. సోమవారం నాటి సమావేశానికి పెనుమూరు మండల జడ్పీటీసీ, ఎంపీపీ సహా అన్ని మండలాల నుంచీ ఓ స్థాయి నాయకులంతా హాజరయ్యారు.

ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటేయండి: వైసీపీ

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న తమ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ కార్యదర్శికి వైసీపీ ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి; ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యపై ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు, మాజీ మంత్రి వెలంపల్లి ఫిర్యాదుచేశారు.

యాంటికబ్బా.. బీజేపీ వాళ్లకు డౌట్ వస్తది!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించారు. సొంతంగా తెలంగాణలో పార్టీ పెట్టిన ఆమె ఇటీవల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఏపీ కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరించనున్నారు. కాంగ్రెస్‌లో చేరడానికి ముందురోజు, ఈ నెల రెండో తేదీన ఇడుపులపాయలోని తండ్రి వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించి తన కుమారుడు రాజారెడ్డి పెళ్లి కార్డు అక్కడ ఉంచారు. సోదరుడు జగన్‌కు పెళ్లి కార్డు ఇచ్చి మేనల్లుడి పెళ్లికి రా.. అన్నా.. అని పిలిచేందుకు ఆ మరునాడు అపాయింట్‌మెంట్ అడిగారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోనుచేసి ఫిబ్రవరి 17న తన కుమారుడి పెళ్లి ఉందని, కార్డిచ్చి ఆహ్వానించేందుకు అన్నతో అపాయింట్‌మెంట్ కావాలని కోరారు. ఇదే విషయాన్ని జగన్‌కు సీఎంవో అధికారి ఒకరు చెప్పారు. అప్పుడే.. పైన ఉదహరించిన సంభాషణ జరిగినట్లు చెబుతున్నారు. ఈ విషయం చెప్పలేక... "సీఎం గారికి అరకు టూర్ ఉంది. తర్వాత చూద్దామన్నారు" అని సీఎంవో అధికారులు షర్మిలకు సమాచారం ఇచ్చారు. "తండ్రి తర్వాత అన్నకు ఇవ్వాలి అనుకున్నా. ఆయనకు కుదరకుంటే పర్లేదులే.. కొడుకు పెళ్లి పెట్టుకున్నప్పుడు కార్డియ్యాలి కదా. కలిస్తే సరే.. లేదంటే సెక్యూరిటీ వాళ్లకు ఇచ్చి వెళతా"నని ఆమె చెప్పడంతో... సీఎంవో అధికారులకు దిక్కుతోచలేదు. తప్పని పరిస్థితిలో.. షర్మిల వ్యాఖ్యలు జగన్‌కు చెప్పేశారు. సెక్యూరిటీకి చెల్లెలు కార్డిచ్చి వెనుదిరిగితే అభాసుపాలవడం ఖాయమని భావించి చెల్లెలును కలవడానికి సరే అన్నారు. మరుసటి రోజు ఆమె రావడంతో అయిష్టంగానే రెండు మాటలు మాట్లాడి పెళ్లి కార్డు తీసుకుని పంపించేశారు. ఈ ఎపిసోడ్ అంతా ఆ నోటా ఈ నోటా చేరి వ్యాప్తి చెందడంతో.. సొంత చెల్లిని ఇంట్లోకి పిలిచేందుకు రాజకీయాలు అడ్డొస్తాయా.. పైగా బీజేపీ వాళ్లకు భయపడటం ఏమిటో.. శత్రువైనా శుభకార్యానికి పిలిచేందుకు వస్తే ఇంట్లోకి ఆహ్వానించడం మన సంప్రదాయం కదా.? అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీలో రచ్చ రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు కూడా ఎన్నికలకు దూరంగా ఉండేందుకు అంగీకరించడం లేదు. దీంతో వైసీపీ పెద్దలకు ఎటూ పాలుపోవడం లేదు. రాష్ట్రంలో వైసీపీకి వ్యతిరేక గాలులు వీస్తుండడంతో సర్వేల పేరు చెప్పి పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చేందుకు తాడేపల్లిలో ఆ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పలువురు ఎమ్మెల్యేలను ప్యాలెస్‌కు పిలిపిస్తున్నారు. మీరు ఓడిపోతారని సర్వేలు చెబుతున్నాయి.. సీటు ఇవ్వలేకపోతున్నాం.. వేరే విధంగా న్యాయం చేస్తాం.. ఈ నియోజకవర్గంలో అయితే మీరు గెలవలేరు.. విమ్మల్ని మరో చోటకు పంపుతున్నాం.. అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మాటామంతీ అంతా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో కీలక అధికారి ధనుంజయరెడ్డి చేస్తున్నారు. నరసరావుపేటలో సిటింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వొద్దని బ్రహ్మారెడ్డి వర్గం చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ఇటీవల తనకే అవకాశమివ్వాలని బ్రహ్మారెడ్డి బహిరంగంగానే గళమెత్తారు. దీనిపై సోమవారం విజయసాయిరెడ్డి తాడేపల్లిలో ఆయన వర్గంతో చర్చించారు. రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. 'సీఎం గారు చెప్పారు.. తప్పనిసరిగా మద్దతివ్వాల్సిందే. అందరూ కలిసి గోపిరెడ్డిని గెలిపించాలి' అని సాయిరెడ్డి గట్టిగా చెప్పగా.. ఆ ప్రసక్తే లేదం టూ బ్రహ్మారెడ్డి వర్గం తేల్చేసింది. తమ నేత బ్రహ్మారెడ్డికి టికెట్ ఇవ్వకపోతే కచ్చితం గా గోపిరెడ్డిని ఓడిస్తామంటూ ఆ వర్గం నాయకులు సమావేశ ం నుంచి వెళ్లిపోయా రు. అంతకు ముందు తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద వారు ధర్నా కూడా చేశారు.

పార్థసారథి వద్దకు రాయబారం!

వైసీపీ రెండో జాబితా విడుదలయ్యాక ఎమ్మెల్యేల్లో తిరుగుబాటు మొదలైంది. పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథికి కూడా మొండిచేయి ఖాయమని వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగడంతో.. ఆయన బహిరంగంగానే నిరసన తెలిపారు. దురదృష్టవశాత్తూ తనను సీఎం జగన్ గుర్తించడం లేదని.. ఆయన టికెట్ ఇచ్చినా ఇవ్వకున్నా పెనమలూరు నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆయన టీడీపీలో చేరతారని ప్రచారం ఊపందుకోవడంతో.. 'ఉంటే ఉండండి.. పోతే పొండి' అన్న జగన్ ఉలిక్కిపడ్డారు. ఆయన్ను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాడేపల్లి రమ్మన్నా రాలేదు. దీంతో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ అయోధ్యరామిరెడ్డి నేరుగా పోరంకిలోని పార్థసారథి కార్యాలయానికి వెళ్లి మాట్లాడారు. సీఎం కార్యాలయానికి రమ్మని పిలిచారు. అందుకాయన తిరస్కరించడంతో మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిని జగన్ రాయబారానికి పంపారు. ఇది కొంత ఫలించింది. వారిద్దరితో కలిసి పార్థసారథి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వెళ్లి సీఎంతో సమావేశమయ్యారు. వారికి టికెట్లు ఎందుకు ఇవ్వడం లేదో జగన్ వివరించారు. మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని పార్థసారథికి సూచించారు. ఆయన అంగీకరించలేదు. తాను పెనమలూరు నుంచే పోటీ చేస్తానని పునరుద్ఘాటించారు. దీంతో పార్థసారథిని మళ్లీ అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్ వద్దకు పంపారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయన్ను ఎంపీగా గెలిపించేందుకు పూర్తిగా సహకరిస్తారని వారిద్దరూ హామీ ఇచ్చినా పార్థసారథి ససేమిరా అన్నారు.

మార్కాపురం నేతలతో జగన్ భేటీ..

ప్రకాశం జిల్లా మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అభ్యర్థిత్వం మార్పుపై ఆయనతోపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని పిలిపించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ఇద్దరితో చర్చించి పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మార్పుపై ఆయనతో పాటు ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డితో సీఎం చర్చించారు. ఇక జగన్ అపాయింట్‌మెంట్ దొరకడమే కష్టమైపోయిందని ఇటీవల బహిరంగంగా మాట్లాడిన డొక్కా మాణిక్యవరప్రసాద్ కూడా సోమవారం తాడేపల్లి ప్యాలెస్ వద్ద పడిగాపులు గాచినా ముఖ్యమంత్రి దర్శనం దొరకలేదు.

ఎమ్మెల్యేల ఆక్రోశం..

సీటు గల్లంతైన, మారిన వైసీపీ ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎస్సీ నియోజకవర్గాన్ని చిన్న చూపు చూస్తున్నారని అనంతపురం జిల్లా శింగనమల (ఎస్సీ) ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆరోపించారు. నియోజకవర్గంలో ఆయకట్టు రైతులకు సాగునీటి కోసం సీఎంవోలో పంచాయితీ పెట్టే పరిస్థితికి వచ్చిందని వాపోయారు. తనను కాదని వరుపుల సుబ్బారావును ఇన్‌చార్జ్‌గా నియమించడంపై ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక్కడ ఇన్‌చార్జిని మార్చినా గెలుపు గుర్రాలకే టికెట్ ఇస్తారని, ఐదేళ్లుగా నిబద్ధతతో పనిచేసిన తనకే సీఎం జగన్ టికెట్ ఇస్తారని ఆయన నమ్ముతున్నారు. ప్రజాదీవెన పేరుతో ఈ నెల 12 నుంచి జనంలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు.

తాడేపల్లికి నేతల క్యూ..

పెద్దల పిలుపుతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఎలీజా (చింతలపూడి), శ్రీనివాసులు (చిత్తూరు), నాగార్జునరెడ్డి (మార్కాపురం), మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్.. ఎంపీలు నందిగం సురేశ్, బెల్లాన చంద్రశేఖర్ తదితరులు సోమవారం తాడేపల్లికి క్యూ కట్టారు. గూడూరు (ఎస్సీ) ఎమ్మెల్యే వరప్రసాద్, నందిగామ (ఎస్సీ) ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, పామర్రు (ఎస్సీ) ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌కు ఈ దఫా అవకాశమిచ్చేది లేదని పార్టీ పెద్దలు చెప్పినట్లు తెలిసింది. నందిగామ టికెట్‌ను ఓ మహిళకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును ఇప్పటికే విజయవాడ వెస్ట్ నుంచి సెంట్రల్ నియోజకవర్గానికి మార్చారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నాయి. ఇప్పుడు టీడీపీ ఎంపీ కేశినేని నాని వైసీపీలో చేరితే ఆయన కుమార్తెకు వెస్ట్ సీటు కేటాయించాల్సి ఉంటుందని.. దీంతో వెలంపల్లిని ఇక్కడ నుంచి కూడా మార్చాలని నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి మార్పుపై దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణతో సజ్జల, ధనుంజయరెడ్డి చర్చించినట్లు తెలిసింది.

ఆర్థర్‌కు టికెట్ ఇవ్వొద్దన్న బైరెడ్డి..



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

వైసీపీలో తాజాగా మరో ఎస్సీ ఎమ్మెల్యే టార్గెట్ అయ్యారు. రిజర్వుడు నియోజకవర్గమైన నందికొట్కూరుపై పెత్తనం చేస్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్థర్‌కు టికెట్ ఇవ్వొద్దని పట్టుబడుతున్నారు. నాలుగున్నరేళ్లుగా అక్కడ ఆధిపత్యం చలాయిస్తూ ఆర్థర్‌ను ఆయన నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఇప్పుడు అయన్ను మార్చాలంటూ తాడేపల్లిలో బైరెడ్డి వర్గం తిష్ఠవేసింది. లబ్బి వెంకటస్వామికి నందికొట్కూరు, తనకు శ్రీశైలం అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని సిద్ధార్థరెడ్డి పట్టుబడుతున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఎక్కువ మంది ఎస్సీ ఎమ్మెల్యేలను మార్చడంతో వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఆచితూచి వ్యవహరించాలని వైసీపీ పెద్దలు యోచిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని పిలిపించి మాట్లాడారు.

ఎస్సీ నియోజకవర్గమంటే చిన్నచూపా?

▸▸ వైసీపీ ఎమ్మెల్యే పద్మావతి వ్యాఖ్యలు



అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా శింగనమల ఎస్సీ నియోజకవర్గం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదివారం రాత్రి ఫేస్‌బుక్ లైవ్‌లో చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీ వైసీపీలో పెను దుమారం రేపాయి. "ఎస్సీ నియోజకవర్గమంటే అంత చిన్న చూపా? ఎస్సీ నియోజకవర్గంలో ఎస్సీలే కాదు.. అన్ని వర్గాల ప్రజలు ఓట్లేస్తేనే పవర్‌లోకి వచ్చింది. అందులోనూ ఒక మహిళ ఎమ్మెల్యేగా ఉంది. నియోజకవర్గంలో ఆయకట్టు రైతులకు సాగునీటి కోసం సీఎంవోలో పంచాయితీ పెట్టే పరిస్థితికి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే నీటి కోసం యుద్ధం చేయాల్సి వస్తోంది. ఎస్సీ మహిళా ఎమ్మెల్యే కాబట్టే ఈ విధంగా చేస్తున్నారు. మా నియోజకవర్గంలోని కాలువ నుంచే కుప్పం ప్రాంతానికి నీళ్లు తీసుకుపోతున్నా... ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నాం. సీఎం ఆఫీస్‌కి వెళ్తే తప్ప మా నియోజకవర్గానికి నీళ్లొచ్చే పరిస్థితి లేదు. ఎవరికీ మా బాధలు పట్టవు. ఇదంతా చూసి విసిగిపోయాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వం, పార్టీ ముఖ్యుల వ్యవహారశైలిపై ఆమె పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. కాగా, ఎమ్మెల్యే పద్మావతి చేసిన వ్యాఖ్యలు అధికార పార్టీలో దుమారాన్ని లేపాయి. పార్టీ అధినాయకత్వం సీరియస్‌గా పరిగణించిందో ఏమో.. తెల్లవారగానే ఆమె మాట మార్చారు. నీటి గురించి అడిగితే అధికారుల్లో నిర్లక్ష్యం కనిపించిందని తాను చెప్పానని, ప్రభుత్వంపైగానీ, జిల్లాలోని పార్టీ ప్రజాప్రతినిధులనుగాని ఎక్కడా విమర్శించలేదన్నారు. ఒక వర్గం మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరిస్తోందని చెప్పుకొచ్చారు.

ఇన్‌చార్జిని మార్చినా సీటు నాకే

12 నుంచి 'ప్రజాదీవెన'తో జనంలోకి.. ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే పర్వత వెల్లడి

శంఖవరం, జనవరి 8: తనను కాదని వరుపుల సుబ్బారావును ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల ప్రత్తిపాడు వైసీపీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ తీవ్ర అసహనంతో ఉన్నారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌ను మార్చినా గెలుపు గుర్రాలకే టికెట్ ఇస్తారని, ఐదేళ్లుగా నిబద్ధతతో పనిచేసిన తనకే సీఎం జగన్ టికెట్ ఇస్తారనే నమ్మకంతో ఉన్నానని అన్నారు. ఈ నెల 12నుంచి ప్రజాదీవెన పేరిట జనంల్లోకి వెళ్లనున్నట్లు సోమవారం ఆయన ప్రకటించారు. కాగా, ఇటీవల వైసీపీ అధిష్ఠానం నియమించిన వరుపుల సుబ్బారావుకు వ్యతిరేకంగా పర్వత తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ టికెట్ వచ్చినా గెలవనివ్వనని తన అనుచరులకు చెబుతున్నట్లు సమాచారం. ఇదంతా సీఎం జగన్‌పై ధిక్కార స్వరంగానే కనిపిస్తోంది. వాస్తవానికి అధికార వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా భారీగా సిట్టింగ్‌లను మార్చి కొత్తవారికి సీట్లు ఇస్తోంది. ఈ నేపథ్యంలో పర్వతను తప్పించి వరుపుల సుబ్బారావును ఇన్‌చార్జిగా ప్రకటించారు. అధికారిక కార్యక్రమాల్లోను అయనే కనిపిస్తున్నారు.

ఇంత మొక్కుబడి జవాబా?

సీఈవో మీనా వైఖరిపై టీడీపీ తీవ్ర అసంతృప్తి

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా తీరుపై ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తీవ్ర అసంతృప్తితో ఉంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పాలకపక్షం చేస్తున్న అధికార దుర్వినియోగం, అధికారులపై తెస్తున్న ఒత్తిళ్లను వివరిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో రెండు మూడు దఫాలు ఆయనకు లేఖలు రాశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్ రాష్ట్రానికి ఇంకొన్ని గంటల్లో వస్తారనగా.. సోమవారం మీనా చంద్రబాబుకు లేఖ రాశారు. ఆయన చేసిన ఫిర్యాదులన్నీ పరిష్కరించామని, తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని అందులో పేర్కొన్నారు. ఈ సమాధానాలు మొక్కుబడిగా ఉన్నాయని టీడీపీ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. కేంద్ర ఎన్నికల కమిషనర్లు రాష్ట్రానికి వస్తున్నారని హడావుడిగా ఏదో ఒక సమాధానం ఇచ్చి చేతులు దులుపుకొనే విధంగా ఆయన వైఖరి ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో అనుభవం గడించిన ఉపాధ్యాయులనే ఈసారి కూడా ఎన్నికల నిర్వహణకు నియమించాలని, కొత్తగా ఉద్యోగాల్లో చేరిన గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించవద్దని గతంలో టీడీపీ విజ్ఞప్తి చేసింది. తన లేఖలో దీనిని ప్రస్తావించిన సీఈవో అస్పష్టంగా సమాధానమిచ్చారు. 'ప్రిసైడింగ్ అధికారులుగా సూపర్‌వైజరీ స్థాయి అధికారులనే నియమిస్తాం. ఎన్నికల కమిషన్ మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు తప్ప మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులందరి జాబితా తయారుచేసి వారిలో కొందరిని ఎన్నికల విధుల్లోకి తీసుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులకే ఎన్నికల విధులు ఇస్తామని.. గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు ఇవ్వబోమని లేఖలో నిర్దిష్టంగా చెప్పలేదు. 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం పేరుతో వైసీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందితో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సీఎం కావాలంటూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేయించిందని టీడీపీ కేంద్ర కార్యాలయ బాధ్యుడొకరు ఆక్షేపించారు.

తప్పుడు దరఖాస్తులు పెట్టినవారి అరెస్టులేవీ?

చంద్రగిరి, కాకినాడ, పర్చూరు, గురజాల, గుంటూరు పశ్చిమ, బనగానపల్లె, పిఠాపురం వంటి నియోజకవర్గాల పరిధిలో వైసీపీ నేతలు ప్రత్యర్థి పక్షం ఓట్లు తీసివేయడానికి తప్పుడు దరఖాస్తులు సమర్పించారని టీడీపీ అధినేత తన లేఖల్లో ఫిర్యాదు చేశారు. తప్పుడు దరఖాస్తులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఈవో జవాబిచ్చారు. 'కేసుల నమోదు తప్ప ఎక్కడా ఒక్కరి అరెస్టు కూడా జరగలేదు. ఎవరినీ అరెస్టు చేయనప్పుడు కేసులు పెట్టి ఏం ఉపయోగం? సీఈవో దీన్ని అడగలేకపోతున్నారు. మేం రాసిన లేఖలను డీజీపీకి పంపి తప్పించుకుంటున్నారు. చంద్రగిరిలో వేల సంఖ్యలో ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు వచ్చాయి. అక్కడ ఎన్ని కేసులు నమోదయ్యాయో సీఈవో చెప్పలేదు' అని టీడీపీ ముఖ్య నేత ఒకరు ధ్వజమెత్తారు.

బదిలీల్లోనూ వక్రమార్గం..

ఒకే జిల్లాలో మూడేళ్లకు పైగా పనిచేసిన పోలీసు అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆ ప్రకారం బదిలీలకు చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబుకు రాసిన లేఖలో సీఈవో పేర్కొన్నారు. ఈ బదిలీల్లో కూడా అధికార పార్టీ వక్రమార్గం అనుసరిస్తోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సీఐల బదిలీలపై అనంతపురం రేంజ్ ఐజీ అమ్మిరెడ్డి ఇచ్చిన ఉత్తర్వులను వారు ప్రస్తావిస్తున్నారు. 'బదిలీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయిన చోటుకు చుట్టుపక్కలే మరో పోస్టులో ఉండేలా ఉత్తర్వులు ఇస్తున్నారు. చంద్రగిరిలో ఉన్న అధికారిని తిరుమలకు, తిరుమలలో ఉన్న అధికారిని తిరుపతికి, తిరుపతిలో ఉన్న అధికారిని తిరుచానూరుకు బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో ఆ ప్రాంతంలో వాడుకోవడానికే ఈ పని చేశారు. రాష్ట్రంలో ఎన్నికల వ్యవస్థ అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మ మాదిరిగా తయారైంది' అని మరో నేత అన్నారు.

బాబు, పవన్ ఉమ్మడిగా ఈసీతో భేటీ

ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల కమిషనర్లను టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా కలవనున్నారు. మంగళవారం ఉదయం విజయవాడ నొవాటెల్‌లో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలతో కమిషనర్లు సమావేశం కానున్నారు. తమ రెండు పార్టీలకు కలిపి సమయం ఇవ్వాలని టీడీపీ, జనసేన కోరాయి. వారు అంగీకరించారు.

'ఈసీ రూల్స్' ఉన్నా పోస్టింగ్స్‌లో మతలబు!

తనవారి కోసం వైసీపీ నేతల ఎత్తుగడ

సీఐ జగన్ రెడ్డి, అంజూ యాదవ్ తిరుపతిలోనే..

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేసినట్లే ఉండాలి.. కానీ అనుయాయులకు కోరిన పోస్టింగ్ ఇవ్వాలి.. రాష్ట్రంలో సీఐల బదిలీల్లో జరుగుతున్న తంతు ఇది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేరు పెట్టుకుని ఆయనతో నేరుగా మాట్లాడ గలిగే స్థాయి సీఐ తిరుమల వన్ టౌన్ పోలీసు స్టేషన్లో సుమారు నాలుగేళ్లుగా పని చేస్తున్నారు. ఐపీఎస్ అధికారులను సైతం లెక్క చేయబోరనే పేరు గాంచిన ఆ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను ఎన్నికల సమయంలో జిల్లా బయటికి పంపించరాదనేది వైసీపీ పెద్దల ఆదేశం. అందుకు అనుగుణంగానే అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి జాగ్రత్త పడ్డారు. సీఐ జగన్మోహన్ రెడ్డి తిరుపతి నుంచి బయటికి వెళ్లకుండా ఎన్నికల కోడ్ పరిధిలోకి రాని జిల్లా శిక్షణా కేంద్రం(డీటీసీ)లో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఆ సీఐ అధికార పార్టీ నేతలకు కోరిన విధంగా ఎన్నికల్లో పనులు చక్కబెడుతుంటారని ప్రచారం జరుగుతోంది. అలాగే, ఇటీవల జనసేన నాయకుడిపై దాడి చేసిన వివాదాస్పద మహిళా సీఐ అంజూ యాదవ్ కూడా తిరుపతి నుంచి బయటికి వెళ్లేందుకు ఏ మాత్రం ఇష్టపడరు. అయితే, ఓ ఎమ్మెల్యే సిఫారసుతో ఆమెకు తిరుపతిలోనే లూప్‌లైన్ పోస్టింగ్ ఇచ్చారు. జనసేన అధినేత పవన్ తిరుపతి ఎస్పీకి ఆమెపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని ప్రభుత్వం ఆమె భర్తను ఐ-ప్యాక్ టీమ్‌లో నియమించింది. మరో సీఐని ఎస్బీలో నియమించి.. ఎన్నికల సమయంలో అనుకూలంగా పనిచేయించుకోవచ్చని జగన్ పార్టీ నేతలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

తుది జాబితాలో ఓటు ఉంటుందా..!

ఆందోళనలో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన లక్షలాది ఓటర్లు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన వారి ఓట్లు ఓటర్ల జాబితా నుంచి అధిక సంఖ్యలో గల్లంతయ్యాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఉంటూ స్వంత రాష్ట్రానికి, రాష్ట్రంలోనే అంతర్గతంగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఓటు బదిలీకి పెట్టుకున్న ఫారం 8 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు. బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలకు, ఉపాధికి వెళ్లిన వారి ఓట్లు జాబితా నుంచి తొలగించారు. అలాంటి వారు తమ ఓటు నమోదుకు ఫారం 6ను అన్ని ప్రూఫులతో దరఖాస్తు చేసినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కింది స్థాయి అధికారులు తిరస్కరిస్తున్నారు. ఫారం 8, 7 దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్న అంశాన్ని వెల్లడించేందుకు ఎన్నికల అధికారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో తమ దరఖాస్తులు ఆమోదం పొందాయా? లేదా? ఈ నెల 22న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాల్లో తమ ఓటు ఉంటుందా? లేదా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

నేడు, రేపు విజయవాడలో ఈసీఐ బృందం

విజయవాడ (కృష్ణలంక), జనవరి 8: పార్లమెంట్, ఏపీ అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై విజయవాడలో ఈ నెల 9, 10 తేదీల్లో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరగనుంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఉన్నతాధికారుల బృందం నేతృత్వంలో సమీక్ష జరగనుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారు సమావేశమవుతారు. మధ్యాహ్నం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఎన్నికల సన్నద్ధత ప్రణాళికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

ఐఏఎస్సా.. వైసీపీ బాసా?

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జీల నియామకం విషయంలో ఆయన సర్వం తానే అయి నడిపించారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పార్టీలో ఎంత పెద్ద నాయకుడైనా.. ఉప ముఖ్యమంత్రి అయినా.. మంత్రి అయినా.. ధనుంజయరెడ్డిని కలవాల్సిందేనని పార్టీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. వైసీపీలో ధనుంజయరెడ్డి నిర్ణయమే ఫైనల్ అని మంత్రులూ.. మాజీ మంత్రులూ.. ముఖ్యనేతలూ వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. పార్టీలో పంచాయతీలు సీఎం జగన్‌ను కలిస్తే పరిష్కారం అవుతాయనే గ్యారంటీ లేని పరిస్థితి. ఎవరైనా తన వద్దకు వచ్చినా.. 'ధనుంజయరెడ్డి అన్నతో మాట్లాడా'లని నేతలకు జగనే సూచిస్తున్నారని సమాచారం. నియోజకవర్గాల నుంచి వచ్చిన నేతలు ముందుగా ప్రాంతీయ సమన్వయకర్తలను కలుస్తున్నారు. ఆ తర్వాత సీఎంవోకు వెళ్తున్నారు. వారికి అక్కడ జగన్ దర్శనం దొరకడంలేదు. ధనుంజయరెడ్డిని కలసి, తనను నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగిస్తున్నారో లేదో తెలుసుకుంటున్నారు. అప్పటికే సర్వే నివేదికలను ధనుంజయరెడ్డి దగ్గర ఉంచుకుంటారు. వాటి ఆధారంగా టికెట్ దక్కుతుందో లేదో అప్పటికప్పుడే ఆయన చెప్పేస్తారు. ఇక అదే ఫైనల్!

అంతా బిల్డప్పే!

నియోజకవర్గాల ఇన్‌చార్జిల విషయంలో జగన్ భారీ కసరత్తు చేస్తున్నారని నీలి,కూలి మీడియాలో గడచిన నెల రోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. కానీ, అదంతా బిల్డప్పేనని సీఎంవోను సందర్శించిన నేతలు బాహాటంగానే చెబుతున్నారు. ప్రముఖ నేతలతో సీఎం జగన్ ముఖాముఖీ సమావేశమవడం లేదు. ఎమ్మెల్యేలూ .. ఎంపీలపై సర్వే నివేదికలు ఏం చెప్పాయో ధనుంజయరెడ్డి క్షుణ్ణంగా వడబోస్తారు. వాటిని సుదీర్ఘంగా సమీక్షిస్తారు. ఎమ్మెల్యే పనితీరు బాగుందంటే..దానిని ముఖ్యమంత్రి జగన్‌కు చేరవేస్తారు. సర్వే నివేదిక బాగున్నప్పటికీ .. ప్రతిపక్ష పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారన్న అనుమానం ఉంటే ఆయా నేతలను ఆయన పరీక్షలకు గురిచేస్తారు. ప్రతిపక్ష నేతలు చంద్రబాబు .. లోకేశ్ .. పవన్ కల్యాణ్‌పై దుర్భాషలాడితేనే సీటు అని తేల్చేస్తారు. గతంలో .. భూముల ఆక్రమణలపై అసహనంతో ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ నుంచి హటాహుటిన తాడేపల్లికి వచ్చారు. ఆయనను జగన్ కలుస్తారని అంతా భావించారు .కానీ .. ధనుంజయరెడ్డితో బాలినేని సమావేశమై .. బయటకు వచ్చేశారు. ఇదే మాజీ మంత్రి బాలినేనిలోని అసంతృప్తిని మరింత రాజేసిందని చెబుతారు.

సాయిరెడ్డి వద్ద తేలని టికెట్ పంచాయతీ

రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి వద్ద నరసరావుపేట అసెంబ్లీ టికెట్ పంచాయతీ ఎటూ తేలలేదు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వొద్దంటూ బ్రహ్మారెడ్డి సహా ఇతర నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాడేపల్లి సీఎంవద్ద ఇటీవల బ్రహ్మారెడ్డి వర్గం నిరసనకూడా తెలిపింది. తనకు నరసరావుపేట టికెట్‌ను సీఎం ఖరారు చేశారని గోపిరెడ్డి ఇటీవల మీడియాకు వెల్లడించారు. తనపై అసంతృప్తులు సహజమేనని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీకి ప్రతికూల ఫలితాలు ఉంటాయంటూ సర్వేలు చెబుతున్న నేపథ్యంలో.. నేతల మధ్య సయోధ్యను కుదిర్చేపనిలో ప్రాంతీయ సమన్వయకర్తలు ఉన్నారు. ఈ క్రమంలో నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా గోపిరెడ్డిని ప్రకటించవద్దంటూ బ్రహ్మారెడ్డి వర్గం సోమవారం సాయిరెడ్డి సమక్షంలోనే డిమాండ్ చేసింది. గోపిరెడ్డిని నరసరావుపేట అభ్యర్థిగా సీఎం ప్రకటించారని విజయసాయి తెలిపారు. అయితే, తాము .. ఆయనకు మద్దతు ఇచ్చేదిలేదని బ్రహ్మారెడ్డి వర్గం తేల్చి చెప్పేసింది.

40 'చానళ్లు'.. 200 ఇన్‌స్టా పేజీలు!

- ప్రతిపక్షంపై మహా 'నీలి' యుద్ధం
- వైసీపీ కార్ఖానాలో కంటెంట్ తయారీ
- పేటీఎం బ్యాచ్‌తో విస్తృత విష ప్రచారం
- చంద్రబాబు, లోకేశ్, పవన్‌లే టార్గెట్
- బయటపెట్టిన సజ్జల భార్గవరెడ్డి

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): "నాకు ఆంధ్రజ్యోతి లేదు...ఈనాడులేదు....ఏబీఎన్‌లేదు....టీవీ5 లేదు...." అంటూ సీఎం జగన్ ప్రతి సభలో దీర్ఘాలు తీస్తారు. సొంత పత్రిక, చానల్ విషయం ఎలాగూ ప్రస్తావించరు. కానీ, తన గుప్పిట్లోని నీలి కూలి మీడియా.. వెబ్, యూట్యూబ్ చానళ్ల గురించి కూడా ఆయన దాచేశారు. ప్రతిపక్షంపై పేటీఎం బ్యాచ్‌తో పెద్దఎత్తున దాడికి వైసీపీ సిద్ధమయిన విషయాన్ని వైసీపీ సోషల్ మీడియా చీఫ్ సజ్జల భార్గవరెడ్డి స్వయంగా చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. కంటెంట్ వైసీపీ కార్ఖానా తయారు చేస్తే, పెయిడ్ బ్యాచ్ దాన్నంతా జనంపైకి వదిలేలా ఇప్పటికే అధికార పార్టీ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దీనికోసం 30-40 యూట్యూబ్ చానళ్లు.. 10-15 వెబ్ పేజీలు.. 200 ఇన్‌స్టా పేజీలను సృష్టించింది. ఇందుకోసం కాంట్రాక్టు కూడా కుదుర్చుకుంది. ఇదే విషయం వైసీపీ సామాజిక మాధ్యమాల కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమంలో సజ్జల భార్గవ రెడ్డి వెల్లడించారు. "మేమే కంటెంట్ తయారు చేస్తాం. యూట్యూబ్ చానళ్లు.. వెబ్ పేజీలు.. ఇన్‌స్టా పేజీల ద్వారా జనంపైకి వదులుతున్నాం. ఈ చానళ్లన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చాం" అని ఆయన సెలవిచ్చారు. పత్రికల్లోనూ.. మీడియా సంస్థల్లోనూ ఉద్యోగాలు కోల్పోయి సొంతంగా యూట్యూబ్ ఛానళ్లను పెట్టుకున్న వారిపై వైసీపీ సోషల్ సెల్ కన్నేసింది. వాళ్లతో కాంట్రాక్టులు చేసుకుంది. తాను తయారుచేసే కంటెంట్‌ను కాంట్రాక్టు కుదర్చుకున్న యూట్యూబ్ చానళ్లకు అందిస్తారు. ఈ కంటెంట్ తమ సొంతం అన్నట్టు యూట్యూబ్ చానళ్లు, హావభావాలను ప్రదర్శిస్తూ.. వైసీపీ అధ్యక్షుడు జగన్ తీసుకున్న నిర్ణయాలను కీర్తిస్తూ .. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌పై నీచమైన భాషను.. పదాలను ప్రయోగిస్తూ ప్రోగ్రామ్‌లు చేస్తున్నాయి. ఇందుకు మహిళలకు కూడా మినహాయింపు ఉండకూడదన్నది ప్రధాన షరతు. ప్రతిపక్షానికి చెందిన నేతల కుటుంబంలోని మహిళలను వయస్సుతో సంబంధం లేకుండా శీల హననం జరిగేలా కించపరిచేలా కథనాలను.. మాటలను సదరు చానళ్లు వాడేస్తుంటాయి. నిన్న మొన్నటిదాకా.. వైఎస్ తనయ షర్మిల రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉన్నంత కాలం.. ఆమె తమ కుటుంబంలోని సభ్యురాలే అంటూ అధికార పక్షం మాట్లాడింది. ఇప్పుడామె కాంగ్రెస్ పార్టీలో చేరి.. రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించనుండటంతో.. జగన్ శిబిరంలో వణుకు మొదలైంది. ఇంతకాలం వైఎస్ కరిష్మాకు తానే వారసుడిగా చలామణి అవుతూ వస్తున్న జగన్‌కు, బలమైన ప్రత్యామ్నాయంగా షర్మిల కనిపిస్తున్నారు. జగన్ కంటే.. షర్మిలనే వైఎస్ వారసురాలిగా.. జాతీయ, రాష్ట్ర పార్టీలు, నేతలూ గుర్తిస్తున్నారు. దీంతో.. ఇప్పుడు షర్మిలను కూడా పేటీఎం బ్యాచ్ వదలడంలేదు. ప్రతిపక్షాలపై విషప్రచారం కోసం..ప్రత్యేకంగా వైసీపీ ఒక సెల్‌ను ఏర్పాటు చేసింది. కాంట్రాక్టు తీసుకున్న యూట్యూబ్.. వెబ్‌పేజీలు.. ఇన్‌స్టాగ్రామ్‌ల కోసం వంద కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. విదేశాల్లో తెలుగువారితో సమావేశాలను ఏర్పాటు చేసి.. రాష్ట్రంలో వైసీపీ పాలనను జనరంజకమని.. ప్రతిపక్షాల తీరు రాక్షసుల తీరుగా ఉందంటూ ప్రచారం చేస్తోంది.

జగనన్న కాలనీల పేరుతో దోపిడీ

జగనన్న కాలనీల చదును పేరిట సదరు నేత భారీగా దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. నేత కాసుల దాహానికి పంచాయతీ రాజ్ విభాగంలోని కీలక అధికారిపై బదిలీ వేటు పడింది. జగనన్న కాలనీల చదును పేరిట ఇుసకను తవ్వి సదరు బిల్లులను నేరుగా మంత్రి అనుచరుల ఖాతాల్లోకి వేయించుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సదరు అధికారిని నిలదీశారు. అప్పటికే సొమ్ములు ఖాతాల్లోకి వెళ్లడంతో ఆయన ఏం చేయలేపోయారు. బాధ్యతలు చేపట్టిన నెలల వ్యవధిలోనే పంచాయతీరాజ్ శాఖ అధికారి బదిలీ అయ్యారు. సొమ్ములు తిన్నవారు మాత్రం బాగానే ఉన్నారు.

ప్రశ్నిస్తే వేధింపులు

దళితులే లక్ష్యంగా సదరు మంత్రి వేధింపులకు పాల్పడుతున్నారని నియోజకవర్గంలో ఓ మాజీ మహిళా ప్రజాప్రతినిధి భర్త ఆరోపించారు. ఆయన ఈ మేరకు వీడియో సందేశం రికార్డు చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. తన భార్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో రోడ్లు వేశారని, వాటి తాలూకా బిల్లులను సదరు నేత ఉద్దేశపూర్వకంగానే ఆపేసి తమను వేధింపులకు గురి చేస్తున్నారని వీడియోలో పేర్కొన్నారు. పోలీసులను కూడా తమ మీద ప్రయోగించినట్లు ఆయన వాపోయారు. నియోజకవర్గంలోని ఓ మండలంలో ఉపాధి హామీ పనుల్లో రూ.60 లక్షల మేర అవినీతి జరిగిందని ఆధారాలతో సహా టీడీపీ నేత ఒకరు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇది జరిగిన వారం రోజుల తర్వాత మంత్రి అనుచరులు తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆయన జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీన్ని బట్టి మంత్రి వేధింపులు ఎలా ఉంటాయో స్పష్టమవుతుంది.



ఇసుక మేతలో మేరునగధీరుడు

(మొదటి పేజీ తరువాయి)

తేడా లేకుండా, తన అనుచరుల ద్వారా అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగించారు.

తెరపైకి కనబడేది బినామీలు అయినా తెరవెనక నడిపించేది మంత్రి వర్యులే. అనుచరుల బెదిరింపులు, దౌర్జన్యాలు షరా మామూలే. ఆ నేత దోపిడీ పర్వం పొరుగు నియోజకవర్గానికి కూడా పాకింది. రైతులు ధర్నా చేసే దాకా పరిస్థితి వచ్చింది. తన అక్రమ సంపాదన కోసం అధికారులను బలి చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న రీతిలో అందినకాడికి తవ్వేసి కోట్లు దండుకున్నారు.

ఇసుక బొక్కేశారు

ఇసుక అక్రమ రవాణాలో సదరు ప్రజాప్రతినిధి బాగా వెనకేసుకున్నారు. మంత్రి అనుచరులు ఇుసక పేరిట ఇష్టారాజ్యంగా నదులు, లంకలను తవ్విపడేశారు. నియోజకవర్గ పరిధిలో నాలుగేళ్లుగా దాదాపు రూ.50 కోట్ల మేర ఇసుక అమ్మకాలు సాగించారు. ఏడాదిన్నర క్రితం కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు మంత్రి అనుచరులను ప్రశ్నించడంతో వారిని భయభ్రాంతులకు గురి చేసి తమ పబ్బం గడుపుకొన్నారు. ఇసుకలో అడ్డగోలు ఆదాయం కనబడేసరికి మంత్రి అనుచరుల కన్ను చీరాలపైనా పడింది. చీరాల మండలంలో దాదాపు 3 ఎకరాల అసైన్డ్ భూములను చెరబట్టి ఇసుకను తోడేశారు. నిబంధనలను ఉల్లంఘించి మరీ అసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వకాల ద్వారా కోట్లు దండుకున్నారు. 20 నుంచి 25 అడుగుల మేర ఇసుక తవ్వడంతో సొరంగాలను తలపించే విధంగా గోతులు దర్శనమిస్తున్నాయి. గోతుల్లో ఉన్న నీటిని ఇంజన్ల ద్వారా బయటకు పంపించే ఏర్పాట్లు చేశారంటే ఏ స్థాయిలో అక్కడ ఇసుక దోపిడీ జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఒకదశలో ఇసుక అక్రమార్జన విషయంలో స్థానిక ప్రజాప్రతినిధికి, సదరు మంత్రికి మధ్య కోల్డ్ వార్ నడిచిందనే ప్రచారం జరిగింది. ఒక్క చీరాల మండల పరిధిలోనే ఇసుక అక్రమ తవ్వకాలలో సదరు మంత్రి వెనకేసింది అక్షరాల రూ.20 కోట్లు పైమాటే.

వేరే నియోజకవర్గానికి జంప్

సదరు మంత్రి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానికంగా తీవ్ర ప్రజావ్యతిరేకత ఉంది. దీనిని పసిగట్టిన మంత్రి మళ్లీ ఇక్కడే పోటీ చేస్తే ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని భావించి.. స్వయంగా సీఎం జగన్‌ను కోరి మరో నియోజకవర్గానికి సమన్వయకర్తగా బదిలీ చేయించుకున్నారని ప్రచారం జరుగుతోంది. పాలక పార్టీ సీట్ల మార్పు విషయంలో మెజారిటీ స్థానాల్లో ఆయా అభ్యర్థులకు ఇష్టం లేకుండా జరిగాయి. కానీ సదరు మంత్రి గారు మాత్రం తానే పట్టుబట్టి మరీ వేరే నియోజకవర్గానికి జంప్ అయ్యారు.

భూ ఆక్రమణలు.. బెదిరింపులు

సొంత నియోజకవర్గంతో పాటు పొరుగు నియోజకవర్గాల్లో సైతం మంత్రి అనుచరులు ఇష్టారాజ్యంగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఆ నేత అనుచరులమంటూ బాపట్ల పట్టణ పరిధిలో ఆక్రమణకు తెగబడ్డారు. పడమర బాపట్ల పరిధిలోని 20 ఎకరాల వ్యవసాయ భూమిని మంత్రి అనుచరులు ఆక్రమించాలని చూశారని ఓ మహిళ ఆరోపించడం కలకలం రేపింది. కోర్టు వివాదంలో ఉన్న రూ.కోట్లు విలువైన భూమి విషయంలో మంత్రి అనుచరులు తలదూర్చి భూమిని కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మంత్రి దౌర్జన్యాలు, బెదిరింపులపై లెక్కలేనన్ని ఆరోపణలు వచ్చాయి. తన అనుచరులతో సమాంతర అధికార వ్యవస్థను నడిపించారు.

కలెక్టర్‌పై బదిలీ వేటు

జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏర్పడిన కొత్త జిల్లా తొలి కలెక్టర్ ఏడాదికే బదిలీ అయ్యారు. దీని వెనుక మంత్రి ఒత్తిడి పనిచేసిందనే ప్రచారం ఉంది. కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల తర్వాత ఇసుక కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు.. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమ దందాపై ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ ఇసుక అక్రమ తవ్వకాలు ఆపకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు పంపారు. మంత్రి మాటలు ఖాతరు చేయకుండా నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. తన అక్రమ దందాకు అడ్డొచ్చారనే అక్కసుతోనే కలెక్టర్‌ను మంత్రి బదిలీ చేయించారనే ప్రచారం ఉంది.

పంట పొలాల్లో సైతం..

మంత్రి అనుచరులు అక్రమార్జనకు పంట పొలాలనూ వదల్లేదు. ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరిపారు. దీంతో పొలాలు పంటల సాగుకు వీల్లేకుండా దెబ్బతింటున్నాయని చీరాల మండల రైతులు గత అక్టోబరులో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పొలాల మధ్య 30 అడుగుల మేర ఇసుక తవ్వకాలు జరపడం వల్ల గోతుల్లో గేదెలు పడి మరణించాయని, పక్కనున్న పొలాల్లోకి నీటి ఊట వచ్చి సారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గోడు కూడా సదరు మంత్రికి పట్టలేదు.

లంచంలో మంత్రికీ వాటా

ఇటీవల మంత్రి ఇలాకాలో పోలీసులను ఏసీబీ అధికారులు అవినీతి కేసులో పట్టుకున్నారు. పోలీసులపై ఏసీబీకి ఫిర్యాదు చేసిన వ్యక్తి.. పోలీసులు లంచం అడిగే క్రమంలో దానిలో మంత్రికి కూడా వాటా ఉందని చెప్పారని, తన ముందే మంత్రితో మాట్లాడి వాటాలు వేసుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఏసీబీ ముందు కూడా ఇదే స్టేట్‌మెంట్ ఇచ్చానని ఆయన చెప్పడం గమనార్హం. తర్వాత పరిణామాలలో మంత్రే స్వయంగా జిల్లా ఎస్పీని కలిసి... తనపై వచ్చిన ఆరోపణల మీద విచారణ చేసి నిజమైతే తనపై, కాకుంటే ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

మరో అరాచకం!

- టీడీపీ కార్యకర్త ఇంటి ముందు కాలువను పూడ్చేసిన వైసీపీ నేతలు
- ప్రశ్నించారని దంపతులపై కర్రలతో దాడి..
- తిరుపతి జిల్లా దేవునివెల్లంపల్లిలో ఘటన..


శంకరయ్య తలపై గాయం


గాయాలతో శంకరయ్య భార్య గౌరి

డక్కిలి, జనవరి 8: ఇంటి ముందు కాలువను పూడ్చేసి మురుగునీరు వెళ్లకుండా చేశారేం అని ప్రశ్నించిన టీడీపీ కార్యకర్త, ఆయన భార్యతో పాటు అడ్డొచ్చిన ఇరుగుపొరుగు మహిళలను కూడా వైసీపీ నేతలు చితకబాదిన అరాచక సంఘటన ఇది. తిరుపతి జిల్లా డక్కిలి మండలం దేవునివెల్లంపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. బాధితుల కథనం ప్రకారం.. దేవునివెల్లంపల్లిలో టీడీపీ కార్యకర్త శంకరయ్య ఇంటి ముందు వున్న సైడు కాలువను, ఆ పక్కనే నివాసం ఉంటున్న గ్రామ వైసీపీ నే తలు కోళ్లూరు బాలకృష్ణ, శ్రీనివాసులు పూడ్చివేశారు. దీంతో ము రుగు నీరు నిలిచిపోయింది. దుర్వాసన భరించలేక.. కాలువను పూడ్చివేస్తే ఎలా అన్ని శంకరయ్య వారిని ప్రశ్నించారు. దీంతో.. మమ్మల్నే ప్రశ్నిస్తావా అంటూ బాలకృష్ణ, శ్రీనివాసులు కర్రలతో శంకరయ్యను దాడిచేసి గాయపరిచారు. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అతడి భార్య గౌరి విలపిస్తూ వైసీపీ నేతల దాడిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. వారు ఆమె పైనా దాడి చేయడంతో నుదుటి భాగంలో గాయమైంది. పక్కింట్లో నివసిస్తున్న వేముల తులశమ్మ, అనసూయ వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపైనా దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. నిందితులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ.. ఎస్పీని కోరారు. అయితే వైసీపీ నేతలు కూడా తమపై దాడి జరిగినట్లు ఫిర్యాదు చేశారని, కాబట్టి ఇరు వర్గాలపై కేసులు నమోదు చేస్తామని డక్కిలి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


చంద్రబాబుతో ఫొటో తీసుకున్న మంజుల (ఫైల్)


చిత్తూరు కలెక్టరేట్ వద్ద తెలుగు యువత నాయకులతో బాధ చెప్పుకొంటున్న మంజుల

చంద్రబాబుతో ఫొటో దిగారని పెన్షన్ కట్

- కుప్పంలో వితంతువు పట్ల వైసీపీ నాయకుల అక్కసు

చిత్తూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుతో ఫొటో దిగినందుకు ఓ వితంతువుకు వస్తున్న పెన్షన్ నిలిపివేసిన ఘటన కుప్పంలో చోటు చేసుకుంది. ఆరు నెలలుగా ఆమెను స్థానిక వైసీపీ నాయకులు వేధిస్తున్న తీరు, ఆపేసిన పెన్షన్ గురించి సోమవారం ఆమె చిత్తూరు కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని కుప్పం మండలం బ్రహ్మదేవచేను పంచాయతీకి చెందిన మంజుల అనే వితంతువు స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరుగా, ఆమె తల్లి మునియమ్మ సర్పంచిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్నుంచి స్థానిక వైసీపీ నాయకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఈ ఎన్నికల తర్వాత కుప్పం వచ్చిన చంద్రబాబుతో మంజుల ఫొటో తీసుకున్నారు. దీంతో మరింత ఆగ్రహించిన స్థానిక వైసీపీ నాయకులు మంజులతో పాటు ఇంట్లో వారి పెన్షన్లను కూడా ఆపేశారు. ఆమె తండ్రి ఈసన్‌కు కూడా వృద్ధాప్య పింఛను ఆపేశారు. ఆమె తల్లి మునియమ్మకు డ్వాక్రా ద్వారా లభించే రూ.500 ఆసరా పెన్షన్ రావడం లేదు. సోమవారం ఆమె చిత్తూరు కలెక్టరేట్‌కు వచ్చారు. జాబ్ క్యాలెండర్ కోసం నిరసన చేస్తున్న తెలుగు యువత, జనసేన నాయకులను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు.


తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆయుష్ సిబ్బంది

వైసీపీ కేంద్ర కార్యాలయానికి ఉద్యమ సెగ

- తాడేపల్లిలో 'ఆయుష్' ఉద్వాసన సిబ్బంది నిరసన

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయానికి ఉద్యమ సెగ తగిలింది. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు తాడేపల్లి పార్టీ కార్యాలయం వేదికగా ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతున్నారు. 'ఆయుష్'లో తొలగించిన ఉద్యోగులు సోమవారం వైసీపీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. గత ప్రభుత్వంలో తొలగించిన సిబ్బందిని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సర్కారుకు సెర్ప్ సిబ్బంది సమ్మె నోటీసు

- కేడర్ ఫిక్సేషన్ చేయాలని డిమాండ్

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేందుకు జగన్ ఇచ్చిన అడ్డగోలు హామీలు ఇప్పుడు ఆయన మెడకే చుట్టుకుంటున్నాయి. ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ ఒక్కో ఉద్యోగ సంఘం రోడ్డెక్కుతుంటే రాష్ట్రం నిరసనల మధ్య అట్టుడికిపోతోంది. ఇక, ఇప్పుడు పేదరిక నిర్మూలన కోసం పాటుపడుతున్న సెర్ప్ ఉద్యోగులు కూడా దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె నోటీసు ఇచ్చారు. ఏపీ రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల జేఏసీ సోమవారం సెర్ప్ సీఈఓకు సమ్మె నోటీసు అందజేశారు. సెర్ప్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఒక్క సారి కూడా సమావేశం కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పేస్కేల్ అమలు చేసి క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు ఆర్థిక శాఖ ద్వారా సెర్ప్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా ఇచ్చిన మెమోను జీఓ రూపంలోకి తీసుకు రావాలని కోరారు. ప్రస్తుతం అమలవుతున్న ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసేసి మూలవేతనంపై 100 శాతం ఈపీఎఫ్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాగా, 23 ఏళ్లుగా సెర్ప్‌లో పనిచేస్తున్న ఈ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కీలక పథకాలన్నీ అమలు చేస్తున్నారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, నాడు-నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణం, పేదలకు సుస్థిర జీవనోపాధుల పెంపుదల వంటి సంక్షేమ పథకాలు సెర్ప్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు.

మెప్మా ఆర్పీ ఉద్యోగుల ఉద్యమ బాట

- ఫిబ్రవరి 5న చలో విజయవాడకు పిలుపు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) రిసోర్స్‌పర్సన్స్ ఉద్యోగుల సంఘం హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. సోమవారం విజయవాడలో ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగ సంఘ విస్తృత సమావేశం నిర్వహించింది. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న ప్రజాప్రతినిధులకు సామూహిక రాయబారాలు నిర్వహించాలని, ఈనెల 23 నుంచి 30 లోపు జిల్లా మెప్మా అధికారులకు, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఉద్యోగ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించింది. 16 ఏళ్లుగా పని చేస్తున్న వారిని, వారి కుటుంబాలను రోడ్డున పడేయాలని చూస్తోందని ఈ సందర్భంగా ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మండిపడ్డారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.లక్ష్మి తదితరులు ప్రసంగించారు.

పారిశుధ్య కార్మికులపై పైశాచికత్వం


మునిసిపల్ కార్మికులను విజయవాడలోని కలెక్టరేట్ వద్ద బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- విజయవాడలో కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- ఆందోళనకారులను ఈడ్చేసిన పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా 14వ రోజూ కొనసాగిన సమ్మె

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


సీఐటీయూ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి మునిసిపల్ కార్మికుల నిరసన

డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజూ కొనసాగింది. ఎన్‌టీఆర్ జిల్లాలో కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు పిలుపునివ్వడంతో ఉద్రిక్తంగా మారింది. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలోకి చొరబడడానికి ప్రయత్నించిన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. వచ్చిన వారిని వచ్చినట్టు ఈడ్చుకెళ్లారు. మహిళలను ఎత్తి వ్యానుల్లో పడేశారు. సుమారు 100 కార్మికులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం వారిని పూచీకత్తుపై విడుదల చేశారు. నెల్లూరులో గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. కందుకూరులో మున్సిపల్ కార్మికుల ఆందోళనకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు ప్రకటించారు. అనంతపురంలో కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై పడుకుని పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లాకేంద్రంలో మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గేట్ ముందు ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర కలెక్టరేట్‌కు చేరుకుని పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలిపారు.

అంగన్వాడీల మెడపై కత్తి!

- వేటుకు రంగం సిద్ధం.. షోకాజ్ నోటీసులు జారీ
- పది రోజుల్లో జవాబివ్వకుంటే తొలగిస్తామని హెచ్చరిక
- కలెక్టర్లకు మహిళా శిశు సంక్షేమ శాఖ మెమో

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమ్మెలో ఉన్న అంగన్వాడీలపై జగన్ సర్కారు మరింత కత్తిగట్టింది. విధుల్లో చేరనివారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా వారందరికీ మహిళా శిశు సంక్షేమ శాఖ సోమవారం రాత్రి పొద్దుపోయాక షోకాజ్ నోటీసులు జారీచేసింది. పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వకుంటే తొలగిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు కలెక్టర్లందరికీ మెమో పంపింది. వీరు మంగళవారం అంగన్వాడీలందరికీ నోటీసులు పంపిస్తారు. ఈ నెల 6న అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగించి.. సోమవారంలోగా విధుల్లో చేరాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే 440 మంది మాత్రమే తిరిగి విధుల్లో చేరారు. దీంతో మిగతావారిని బెదిరించేందుకు ఇప్పుడు మెమో జారీచేసింది. చట్టప్రకారం పొందుపరిచిన విధులు, బాధ్యతలను నిర్వర్తించనందుకు.. మిమ్మల్ని ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని అందులో ఆదేశించింది. గడువులోగా సమాధానం చెప్పని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇంకోవైపు.. ఈ నెల 6న అంగన్వాడీల వేతనాల్లో ప్రభుత్వం 9 రోజులు కోత విధించిన సంగతి తెలిసిందే.

అంగన్వాడీల ఉద్యమంలో రాజకీయ అజెండా

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం: సజ్జల

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సమ్మె వెనుక జాతీయ పార్టీలు ఉన్నాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. వారి మెసేజ్‌లు, పోస్టులు చూస్తే వారి ఎవరున్నారో అర్థమవుతుందని సజ్జల వ్యాఖ్యానించారు. లక్ష మంది ఉన్నామని, అనుకున్నది జరగకపోతే ప్రభుత్వాన్ని దించేస్తామంటూ వారి ఆడియోల్లో వ్యక్తమైందని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల మాటల్లో రాజకీయ అజెండా కనిపిస్తోందన్నారు. అంగన్వాడీలకు ప్రత్యామ్నాయాలు చూస్తామని చెప్పారు. మునిసిపల్ వర్కర్లతో చర్చలు జరుపుతూనే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లనూ ఆలోచిస్తున్నామని సజ్జల చెప్పారు.

తాడో పేడో!


నెల్లూరు కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే వర్తిస్తుందని, తమకు కాదని స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే దీనిపై న్యాయపోరాటానికి సిద్ధమవుతామని చెబుతున్నారు. అంగన్వాడీల సమ్మెపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ఉపసంహరించాలని, చర్చలకు పిలవాలని కోరుతూ సోమవారం అంగన్వాడీ యూనియన్ల నేతలు బేబీరాణి, సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతిలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని వినతిపత్రంలో కోరారు. మరోవైపు అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న అన్ని జిల్లాల్లో జైల్‌భరో నిర్వహిస్తామని ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, నాగేశ్వరరావు చెప్పారు. ఈమేరకు సోమవారం సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలంతా సోమవారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగించారు. దీక్షా శిబిరంలో జగన్ చిత్రపటానికి పచ్చి మిరపకాయల దండవేసి నిరసన తెలిపారు. జీవో పత్రాలను దహనం చేశారు. విజయనగరంలో 24 గంటల దీక్షను సోమవారం ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో అంగన్వాడీల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. చింతలపూడిలో నల్లబెలూన్లతో, ఉంగుటూరులో మోకాళ్లపై నిలబడి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జీవో2ను ఉపసంహరించుకోవాలని టి.నరసాపురంలో తహసీల్దార్‌కు, కుక్కునూరులో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వినతిపత్రాలు ఇచ్చారు. కొయ్యలగూడెం, ఏలూరు, నూజివీడు, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి, లింగపాలెం, భీమడోలు తదితర ప్రాంతాల్లో అంగన్వాడీలు ఆందోళనలు కొనసాగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. రాయదుర్గంలో పొర్లు దండాలు పెట్టారు. ఉరవకొండలో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరవ ధిక నిరాహార దీక్ష మూడో రోజు కొనసాగించారు. చిలమత్తూరులో హరికథ చెబుతూ నిరసన వ్యక్తం తెలిపారు. లేపాక్షిలో అంగన్వాడీలకు రైతులు మద్దతు పలికారు. కడప కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. జమ్మలమడుగులో చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపిస్తామని శపథం చేశారు. మైదుకూరు, చాపాడు, కొండాపురంలో ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఎర్రగుంట్లలో వర్షంలోనే తడుస్తూ దీక్ష కొనసాగించారు. బద్వేలు, పోరుమామిళ్లలో నల్లబెలూన్లను ఎగురవేసి, ప్రొద్దుటూరులో మోకాళ్లపై నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలాల్లో వర్షం కురుస్తున్నా అంగన్వాడీలు గొడుగులతో ఆందోళనలో పాల్గొన్నారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్ష కొనసాగించారు. టీడీపీ నాయకులు వారికి మద్దతు తెలిపారు. సాలూరులో అంగన్వాడీలు గడ్డి తింటున్నట్టుగా నిరసన తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. సీతానగరంలో ఒంటి కాలిపై నిల్చొని, బలిజిపేటలో బోర్లా పడుకుని నిరసనలు తెలిపారు. పింఛ న్ల పంపిణీకి గరుగుబిల్లికి వచ్చిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కారు ను నిలిపి వినతిపత్రం ఇచ్చా రు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగుతున్న దీక్షలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంకయ్య పాల్గొని మాట్లాడారు.

ఎస్మాకు ఎవరూ భయపడరు: నారాయణ

అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తామంటూ తీసుకువచ్చిన జీవోకు ఎవరూ భయపడరని సీపీఐ నేత నారాయణ అన్నారు. తిరుపతిలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఎస్మాను దేశద్రోహుల మీద ప్రయోగిస్తారని అలాంటిది సమాజం కోసం పనిచేసే అంగన్వాడీలపై ప్రయోగిస్తారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.

విధులకు హాజరైతే ఎస్మా ఎత్తేస్తాం: బొత్స

విజయనగరం జిల్లా మెంటాడ మండలంలో పర్యటన ముగించుకొని తిరిగి వస్తుండగా గజపతినగరం జాతీయ రహదారిపై మంత్రి బొత్స సత్యనారాయణ వాహనాన్ని అంగన్వాడీలు అడ్డగించారు. ఆయన కారుదిగి వారితో మాట్లాడుతూ 'వేతనాలు పెంచేందుకు రెండు నెలల సమయం కావాలని ప్రభుత్వం కోరినా పట్టుబట్టడం సమంజసం కాదు. విధులకు హాజరైతే ఎస్మాను ప్రభుత్వం ఎత్తివేస్తుంది. అంగన్వాడీలకు ఇతర సంక్షేమ పథకాలు నిలిపేయడంపై చర్చిస్తాం' అన్నారు. అంతలో సీఐటీయు నాయకురాలు వి.లక్ష్మి మాట్లాడబోగా.. 'మీరు ఎవరు?' అని మంత్రి ఆమెను ప్రశ్నించారు. సీఐటీయు నాయకురాలు అని చెప్పగా 'నేను మీతో మాట్లాడను. వీళ్ల నాయకులు చర్చలకు రాకుండా మొహం చాటేసి మిమ్మల్ని రెచ్చగొడుతున్నారు' అని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్, యూత్ కాంగ్రెస్, ఏఐఎస్ఏ నేతలు

● ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి ● యువజన, విద్యార్థి సంఘాల డిమాండ్

ధర్నాచౌక్, జనవరి 8: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వశాఖలో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, మొత్తం ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలని యువజన, విద్యార్థి సంఘాలు నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నిర్వహించాలని, ప్రభుత్వశాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్,టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ, పీడీఎస్‌యూ,ఎన్ఎస్‌యూఐ, తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్, యూత్ కాంగ్రెస్, ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గత ఎన్నికల సందరర్భంగా నేని ఉన్నాను, నేను విన్నాను అధికారంలోకి రాగానేప్రభుత్వ శాఖల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తానని, ప్రతీ ఏడాది జనవరి నెలలో జాబ్ క్యాలండర్ ఇస్తానని చెప్పిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను మోసం చేశారని ధ్వజమెత్తారు. జాబ్ క్యాలండర్ పేపర్లకే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో 50,667 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎస్జీటీలతో అదనపు తరగతులు నిర్వహిస్తూ డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో అనేక ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం, మంత్రులు చెప్పడం సరైందికాదన్నారు. తక్షణమే డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని, విద్య, వైద్య, ఆర్థిక శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నేతలు పరుచూరి రాజేంద్రప్రసాద్, వేపాలకుల శ్రీనివాస్, షేక్ సిద్దిక్, రాజేష్, సాయికుమార్, జోసెఫ్, అనిల్ కుమార్, మహంకాళీ సుబ్బారావు, తదితరులు ప్రసంగించారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్‌రెడ్డి: నాగభూషణం

వన్‌టౌన్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. నాగభూషణం అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం మాని యువతను డ్రగ్స్‌కు బానిసలుగా చేయడాన్ని నిరసిస్తూ సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ లేక రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాక స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిష్యత్తు ప్రశార్థకంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలిచ్చారన్నారు. జగన్‌రెడ్డి ఏటా మెగా డీఎస్సీ అని చెప్పి ఒక టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. జగన్‌రెడ్డి ఇకనైనా యువతను మోసం చేయడం మాని ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. తెలుగుయువత నేతలు ఎల్ లతీఫ్, భగత్, శ్యామ్‌సన్, రాము, పృథ్వీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ప్రజారోగ్యాన్ని కాపాడాలి: బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వర రావు డిమాండ్ చేశారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ గత 15 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని విమర్శించారు. కార్మికుల సమ్మె కారణంగా నగరంలో రోజుకు సుమారు 600 టన్నుల చెత్త పేరుకుపోతోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో చెత్త నగరాలుగా పేరొందుతున్నాయని ఎద్దేవా చేశారు. రోడ్లపై చెత్త పేరుకుపోయి అంటువ్యాధులు ప్రబలే పరిస్థితి నగరంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు కరోనా విజృంభిస్తున్న సమయంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వ పెద్దలు ముందుకు రాకపోవడంతో ప్రజారోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే నగరంలో విపరీతంగా జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా జ్వరాలతో పేదలు అల్లాడుతున్నారని జగన్ తుగ్లక్ నిర్ణయాలతో పేదల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. ఎక్కడ చూసిన పాలకుల నిర్లక్ష్యంతో పేదవారికి శాపంగా మారిందని ఇప్పటికైనా సీఎం జగన్ హామీలను నెరవేర్చాలన్నారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, దెందుకూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ ఉద్యోగులకు జీతం సహా నైట్‌హాల్ట్ అలవెన్సులు

బస్టేషన్, జనవరి 8: ఆర్‌టీసీలో పనిచేసే ఉద్యోగులకు నైట్‌హాల్ట్ అలవెన్సులు జీతంతో పాటు కలిపి చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఆర్‌టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ సమస్యలపై యూనియన్ నేతలు నగరంలోని ఆర్‌టీసీ హౌస్‌లోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఏ)ను కలిసి చర్చించారు. ఉద్యోగులకు ప్రధానంగా నైట్‌హాల్ట్ అలవెన్సులు 2022 సెప్టెంబర్ నుంచి చెల్లించడం లేదన్న దానిపై చర్చించారు. ఈ నెలలో సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసి ఫిబ్రవరి 1న జీతంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై స్పందించిన ఈడీ చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

బీసీ సంక్షేమ సంఘం నగర నూతన కార్యవర్గ ఎన్నిక

ధర్నాచౌక్: బీసీ సంఘాలన్నీ ఒక వేదికపైకి రావడంతోనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ ఐక్యవేదిక ప్రధానకార్యదర్శి బయన శేకర్‌బాబూ, బీసీ నేత నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం నగర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లో సోమవారం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కొరగంజి వెంకట రమణ, పల్లితేజ దుర్గప్రసాద్, కార్యదర్శిగా జగడం శ్రీనివాసు, సహాయ కార్యదర్శిగా తిరునగరి మురళీకృష్ణ, కోశాధికారిగా కేదరసిపల్లి నరేంద్ర పలువురు కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీసీల సమస్యలు పరిష్కారానికి, సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని కొరగంజి వెంకట రమణ తెలిపారు.

సంక్రాంతి విశిష్టతను చాటిన సంక్రాంతి నృత్య రూపకం

విజయవాడ కల్చరల్: జెఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజికల్ అండ్ డాన్స్ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు పేరిట జరిగిన నృత్య రూపకం గ్రామీణ వాతావరణాన్ని కళ్లముందు సాక్షాత్కరింపజేసింది. శాస్త్రీయ దృక్పథాన్ని కళలతో మేళవించి జరుపుకొనే ఈ సంక్రాంతి సమైక్యతతో కూడిన మార్పును తెలియజేస్తూ ఈ రూపకం సాగింది. జంగం మనీషా చక్రవర్తి, శిరీష చక్రవర్తి నృత్య దర్శకత్వంలో జంగం సోదరీమణులు, పూజిత, గేయ, రిచిత, యశస్వి, మను, శ్రీమయి, సాత్విక, మౌనిక, జశ్విత 50మంది చిన్నారులు నర్తించారు. సభా నిర్వహణ జంగం శ్రీనివాస చక్రవర్తి చేయగా సభాధ్యక్షులుగా గోళ్ల నారాయణరావు, ముఖ్య అతిథులుగా రావులపల్లి రాజ, ఓఎస్‌డీ టు ఏపీ చీఫ్ వి ప్ డాక్టర్ ఎం.ప్రభాకర్, జలమిత్ర అంగత వరప్రసాదరావు, అన్నవరపు పూర్ణచంద్ర పాల్గొన్నారు.


రోడ్డు మధ్యలో నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

పంజా సెంటర్ రోడ్డు మధ్యలో ఫుడ్‌కోర్టు!

వన్‌టౌన్, జనవరి 8: స్థానిక పంజాసెంటర్ రోడ్డు మధ్యలో మళ్లీ అనధికారంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఫుడ్‌కోర్టు నిర్మాణానికి పనులు చేపట్టారు. గత ఏడాది నవంబరులో 54వ డివిజన్ పరిధి పంజా సెంటర్‌లో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సుమారు 14 బండ్లతో ఫుడ్‌కోర్టు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఆ ముఖ్య ప్రజాప్రతినిధి, కార్పొరేటర్, ఉన్నత పదవిలో ఉన్న ఓ మహిళా నేత బండ్లను పంచుకుని ఒక్కొక్క బండి నుంచి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపించాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వాటాలు పంచేసుకున్నారా..! అనే కథనం ప్రచురితమైంది. దీనిపై టీడీపీ పశ్చిమ నేత ఎంఎస్ బేగ్, జనసేన పశ్చిమ ఇన్‌చార్జి, నగరాధ్యక్షుడు పోతిన మహేష్, ఎంబిఎం నేతలు ఫుడ్‌కోర్టు నిర్మాణం చేపట్టిన ప్రదేశంలో నిరసన వ్యక్తం తెలిపి పనులను అడ్డుకున్నారు. దీంతో కొన్ని రోజుల పాటు పనులు నిలిపేశారు. మళ్లీ రెండ్రోజుల నుంచి ఫుడ్‌కోర్టు నిర్మాణానికి చకచక పనులు చేపడుతున్నారు. వీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల అనుమతులు లేనప్పటికీ అధికార పార్టీ నేతలు ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు ఫుడ్‌కోర్టు నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూల్చివేతపై ఫిర్యాదును వెనక్కి తీసుకున్న ఈవో

వన్‌టౌన్, జనవరి 8: గవర్నరుపేట చల్లపల్లి బంగ్లా సమీపంలో ఉన్న దేవదాయ శాఖకు చెందిన పురాతన పెంకుటిల్లును లీజుదారులు కూల్చివేయడంపై పోలీసులకిచ్చిన ఫిర్యాదును శ్రీ వెంకటేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో శ్రీనివాస్ కేసు నమోదు చేయవద్దని ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారు. దేవస్థానానికి గవర్నరుపేటలో 120 గజాల స్థలంలో పురాతన జీ+1 భవనం ఉంది. అధికారులు గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపును శిఖాకొల్లి రంగారావు, శిఖాకొల్లి సుభాష్‌కు లీజుకిచ్చారు. ఇటీవలపై అంతస్తులోని పెంకుటిల్లును అనుమతి లేకుండా పూర్తిగా కూల్చివేశారు. దీనిపై ఈవో మొదట గవర్నరుపేట పోలీసులకు ఇద్దరు వ్యాపారస్తులపై ఫిర్యాదు చేశారు. తరువాత ఏం జరిగిందో రెండ్రోజుల క్రితం కేసు నమోదు చేయవద్దంటూ ఈవో శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇచ్చిన ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారు. ఈవో కమీషనర్ దృష్టిలో పెట్టామని దీని పై ఫిర్యాదు వెనకకు తీసుకుంటున్నట్టు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. అయితే వ్యాపారస్థులపై కేసు లేకుండా చేయడం కోసం ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాలపరిమితి రద్దు చేయాలి

● ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం

గవర్నర్‌పేట, జనవరి 8: మెప్మా ఆర్‌పీ (పట్టణ రిసోర్స్ పర్సన్)కు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 3ఏళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, వేతనానికి, పనికి ముడిపెట్టకుండా రూ.10వేలు వేతనం చెల్లించాలని ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ 16ఏళ్లుగా ప్రభుత్వానికి, పొదుపు సంఘాలకు మధ్యవర్తులుగా పని చేస్తున్న మెప్మా ఆర్పీలకు కాలపరిమితి విధించి వారి కుటుంబాలను వీధుల పాలుచేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సంఘ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈనెల 22న ప్రజాప్రతినిధులకు సామూహిక రాయబారాలు నిర్వహించాలని, 23 నుంచి 30 వరకు జిల్లా మెప్మా జిల్లా అధికారులకు, పట్టణాధికారులకు, సమస్యలతో కూడిన వినతిపత్రాలివ్వాలని, ఫిబ్రవరి 5న చలో విజయవాడ నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానించారు. కలెక్టరేట్‌ల ముట్టడిని పోలీసులు అడ్డుకోవడాన్ని కమిటీ తీవ్రంగా ఖండించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.లక్ష్మీ, నేతలు శాంతి, పి.వెంకటరమణ, ఝాన్సీ, ఉష, నసీమా, సుమతి, సుభాషిణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

మంచినీటి కష్టాలకు ఇక చెల్లు

- 6 లక్షల లీటర్ల కెపాసిటీ వాటర్ ట్యాంకు ప్రారంభానికి రెడీ
- త్వరలో ఎంపీ కేశినేని చేతుల మీదుగా ప్రారంభం
- ఆటోనగర్‌లో పనులను పరిశీలించిన జడ్‌ఎం, ఐలా మాజీ చైర్మన్

ఆటోనగర్ (పెనమలూరు), జనవరి 8: ఆటోనగర్ దాహార్తిని తీర్చేందుకు సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు పనులు దాదాపు పూర్తై ప్రారంభానికి రెడీ అయింది. ఎంపీ కేశినేని నాని తన ఎంపీ లాడ్స్ నిధులు వాటర్ ట్యాంకు, ఆర్వో ప్లాంటు నిర్మాణానికి సుమారు 2.4 కోట్లు కేటాయించగా, రూ.కోటి ఏపీఐఐసీ ఐలా నిధులు వెచ్చించి నిర్మాణం చేపట్టారు. సదరు నీటి ట్యాంకు కొద్దిరోజుల్లోనే ప్రారంభం కానుంది. జమాక్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ త్రిపురనేని హనుమాల్ నాగచంద్, సెక్రటరీ జాన్‌పాడ్, కోశాధికారి బర్మా రమేష్, కోఆపరేటివ్ స్టోర్స్ మాజీ ప్రతినిధి కత్తిక శివనాగేశ్వరరావు, జమాక్ గౌరవాధ్యక్షుడు సుంకాని త్రినాథ్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు పలుమార్లు ఏపీఐఐసీ జడ్‌ఎం సీతారాం, ఎంపీ కేశినేని నాని, 11వ డివిజన్ కార్పొరేటర్ కేశినేని శ్వేత, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్‌ను వీలైనంత త్వరగా నీటి సమస్యలకు పరిష్కారం కనుకొనాలని అభ్యర్థించగా నీళ్లట్యాంకు పనులను వేగంగా పూర్తిచేశారు. సోమవారం మంచినీళ్ల ట్యాంకును జడ్‌ఎం సీతారాం, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. వీలైనంత త్వరలో వాటర్ ట్యాంకును ఎంపీ నాని చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్‌కు చిత్తశుద్ధి లేదు: మేకా

ధర్నాచౌక్: రాష్ట్రంలో కొన్నిరోజులుగా తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) కార్య నిర్వహక అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయా వర్గాల ఆందోళనలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం సరైంది కాదన్నారు.

ప్రజాదరణ ఉన్నవారికే సెంట్రల్ కేటాయించండి: విష్ణు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 8: ప్రజాదరణ ఉన్నవారికే సెంట్రల్ సీటు కేటాయించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సెంట్రల్ వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే వెల్లంపల్లిని నియమించిన నేపథ్యంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు వర్గీయులు రోడ్డెక్కారు. రాజసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే విష్ణు కార్యాలయంలో సమావేశమవటం చర్చనీయాశంగా మారింది. మల్లాది విష్ణుతో మాట్లాడి నియోజకవర్గ పరిస్థితుల పై విష్ణుతో చర్చిరారు. సెంట్రల్‌లో ప్రజాదరణ ఉన్నవారికే సీటు కేటాయించాలని చెప్పారు. రేపు మరోసారి సమావేశమవుతున్నట్లు సమాచారం.

వృద్ధులే టార్గెట్‌గా చైన్ స్నాచింగ్

● ఒకరి అరెస్టు

గుణదల, జనవరి 8: వృద్ధులే టార్గెట్‌గా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుణ్ని పటమట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆర్‌ఆర్ గార్డెన్స్ రోడ్ దాసరి వారి వీధిలో నివాసం ఉంటున్న జాస్తి సాయిప్రభ (66) ఇంటి బాల్కనీలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తి వెనుకనుంచి వచ్చి మెడలోని గొలుసు తెంచుకుని పారిపోయాడు. దీనిపై పటమట పోలీసులకు ఆమె గడచిన యేడాది నవంబరు 6న ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో ఉన్న ఈ కేసులో స్థానిక సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ప్రాథమికంగా కంకిపాడుకు చెందిన పాత నేరస్తుడే నేరానికి పాల్పడినట్టు పటమట క్రైమ్ ఎస్ఐ పవన్ కుమార్ నిర్ధారణకు వచ్చారు. దీంతో సిబ్బందితో పక్కా సమాచాంతో కంకిపాడులో నివాసం ఉంటున్న పెన్నేరు రాఘవ అలియాస్ ముసలయ్య (49)ని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా పటమట సీఐ కాశీవిశ్వనాథ్ నిందితుడు పెన్నేరు రాఘవను మరింత లోతైన విచారణలో నగరంలో చేసిన మరికొన్ని నేరాలు బయటపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో 6 ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటితోపాటుగా వృద్ధురాలి మెడలో చోరీ చేసిన 55 గ్రాముల బంగారు ఆభరణం ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టినట్లుగా గుర్తించడం జరిగిందని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. నిందితుణ్ణి సోమవారం కోర్టులో హాజరుపర్చడం జరిగిందని పటమట పోలీసులు తెలిపారు.


చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, అన్న శివబాలాజీతో శ్రీవల్లి

స్కూల్ బస్సు కింద పడి విద్యార్థిని దుర్మరణం

అత్తిలి, జనవరి 8: పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా.. ఎల్‌కేజీ చదువుతున్న ఐదేళ్ల చిన్నారి అదే బస్సు కింద పడి దుర్మరణం పాలైంది. రక్తపు మడుగులో పడివున్న కుమార్తెను చూసి తల్లిదండ్రుల రోదన మిన్నంటింది. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం పాలిలో సోమవారం సాయంత్రం జరిగింది. పాలి గ్రామానికి చెందిన వాడపల్లి ధర్మరాజు వ్యవసాయ కూలి. భార్య వెంకటలక్ష్మి గృహిణి. వీరికి కుమారుడు శివబాలాజీ, కుమార్తె శ్రీవల్లి(5) ఉన్నారు. అత్తిలిలోని జెమ్స్ స్కూలులో కుమారుడు ఫస్ట్ క్లాస్ చదువుతుండగా, శ్రీవల్లిని ఎల్‌కేజీలో చేర్పించారు. వీరిద్దరూ రోజూ ఉదయం స్కూల్‌కు బస్సులో వెళ్లి సాయంత్రం వస్తూండేవారు. సోమవారం సాయంత్రం బస్సును డ్రైవర్ పాలి మెయిన్ రోడ్డుపై ఆపాడు. ఈ ప్రాంతానికి చెందిన పది మంది విద్యార్థులను దింపాడు. తొమ్మిది మంది బస్సు ముందు భాగం నుంచి రోడ్డు దాటి వెళ్లారు. చివరలోవున్న శ్రీవల్లి బస్సు దాటుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు నడపడంతో ముందు చక్రం కింద పడి చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. తోటి చిన్నారులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. దీంతో బస్సు డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు పరుగు పరుగున ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. బస్సులో కనీసం క్లీనర్ కూడా లేడు. స్కూల్ యాజమాన్యం నిరక్ష్యంపై గ్రామస్థులు మండిపడుతున్నారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వలంటీర్ అరెస్టు

కొమరోలు, జనవరి 8: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం దద్దవాడ పంచాయతీ పరిధి అలసందులసల్లిలో కొత్త కోట వెంకటరమణ అనే వ్యక్తి వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఇతను గ్రామంలో చిన్న బడ్డీ బంకు నిర్వహిస్తూ మద్యం అక్రమంగా అమ్ముతున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై సుబ్బరాజు సిబ్బందితో దాడి చేసి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు.

బలమైన రైతాంగ ఉద్యమం అవశ్యం: రావుల వెంకయ్య

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు బలమైన రైతాంగ ఉద్యమం అవశ్యమని అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. రావుల వెంకయ్య ప్రారంభోపన్యాసం చేస్తూ... దేనికీ తలవంచని జగమొండి మోదీ మెడలు వంచి నల్లచట్టాలను ఉపసంహరించుకునేలా చేసిన ఘనత ఢిల్లీ రైతు ఉద్యమానికి దక్కుతుందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తానని ఎన్నికలకు ముందు మోదీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాటమార్చారని విమర్శించారు. ముందుగా రైతు మహాప్రదర్శన నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. రామచంద్రయ్య, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బరితెగించిన సస్పెక్ట్ షీటర్లు

విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనం సైరన్ వినిపించినా, ఎదురుగా వాహనం కనిపించినా నేర చరిత్ర ఉన్నవారు పక్కకు పారిపోతారు. ఆ వాహనం వెళ్లిపోయే వరకు ఎక్కడో ఒక చోట దాక్కుంటారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉన్న ఇద్దరు యువకులు మాత్రం ఏకంగా రక్షక్ జీపు ఎక్కి కూర్చున్నారు. ఫొటోలకు పోజులిచ్చుకున్నారు. రామయ్య, శేఖర్ అనే ఇద్దరు యువకులపై కృష్ణలంక పీఎస్‌లో పలు కేసులున్నాయి. వారిపై పోలీసులు సస్పెక్ట్ షీట్ తెరిచారు. రెండు రోజుల క్రితం కృష్ణలంకలో ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద వివాదం జరుగుతుందని సమాచారం రావడంతో రక్షక్ జీపులో సెక్టర్ ఇన్‌ఛార్జి, డ్రైవర్ వెళ్లారు. జీపును రోడ్డుపై ఆపి విద్యుత్ కార్యాలయం వద్దకు వెళ్లారు. ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జితోపాటు డ్రైవర్ అక్కడికి వెళ్లారు. జీపు ఖాళీగా ఉండడాన్ని గమనించిన రామయ్య, శేఖర్ దానిపై కూర్చుని ఫొటోలకు పోజులిచ్చాడు. ఇన్‌స్టాలో పోస్టు చేశాడు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులకు సమాచారం చేరింది. రామయ్య, శేఖర్‌ను విచారిస్తున్నారు.

హక్కులు కాలరాయడానికే ఎస్మా ప్రయోగం

● ప్రజా, కార్మిక సంఘాల నేతల ధ్వజం



ధర్నాచౌక్, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. తమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. తామేం కొత్తగా కోరడం లేదని గతంలో సీఎం జగన్ తమకిచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామన్నారు. 28రోజుల సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 4వ రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. 28 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా సీఎం జగన్ స్పందించకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరైంది కాదన్నారు. అనేక ఏళ్లగా గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ వ్యవహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి వి.సాంబిరెడ్డి, ఎంవీఆంజనేయులు, మహిళా సంఘం నేత పుతంబాక భారతీ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర నేత నటరాజ్, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు ఏ వెంకటేశ్వరరావు, జి.ఓబులేసు,ఆర్.రవీంద్రనాథ్, ఇఫ్టూ నేత ఏ రవిచంద్ర, యూనియన్ రాష్ట్ర నేత కె.సుబ్బరావమ్మ, సుప్రజా, గజలక్ష్మీ, జైని రత్నకుమారి, లలితమ్మ పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య అంతర కళాశాలల పోటీలు

గన్నవరం, జనవరి 8: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో 12వ అంతర కళాశాలల పోటీలు సోమవారంతో ముగిశాయి. 5 రోజులుగా హోరాహోరీగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల దక్కించుకోగా, బాలికల విభాగంలో ప్రొద్దుటూరు కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాలుర ఇండివిడ్యుయల్ అథ్లెటిక్ చాంపియన్‌గా తిరుపతి, పశువైద్య కళాశాలకు చెందిన ఆర్ఎస్ జ్ఞానేశ్వర్ నిలవగా, బాలికల విభాగంలో ప్రొద్దుటూరు కళాశాలకు చెందిన ఎం.సాయితేజశ్విని చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ అత్యంత ఉత్సాహభరితంగా క్రీడలు జరిగాయన్నారు. క్రీడాకారులకు స్పోర్టివ్‌నెస్ ఉండాలన్నారు. గెలుపు ఓటములు సహజమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పివిఎస్ కిషోర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్‌కు హెల్త్ వర్సిటీ టీమ్

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8: చెన్నైలోని హిందూస్థాన్ టెక్నాలజీ, సైన్సు వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16 వరకు సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ టోర్నీలో పాల్గొనే హెల్త్ వర్సిటీ జట్టును ఎంపిక చేశామని, ఆ జట్టు అక్కడకు పయనమైందని వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఇత్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజర్‌గా ఎన్.నల్లయ్య (ఏలూరు సెయింట్‌జోసెఫ్ కళాశాల పీడీ) వ్యవహరిస్తారన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి అభినందించారు.

జట్టు ఇదే.... కేవీ అభిషేక్, ఆర్ పూర్ణచందర్, వై.గౌతమ్, జీ.ప్రవీణ్‌కుమార్ (విశాఖ ఆంధ్ర మెడికల్ కళాశాల), జి.శివనిరంజన్‌రెడ్డి, ఎస్.అన్వేష్ బాబు (చినకాకాని, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల), సీహెచ్.రాజేష్, ఎన్.నితిన్ (సిద్ధార్థ మెడికల్ కళాశాల), ఏబీ రక్షిత్, ఎం.లిఖిత్ (చిత్తూరు అపోలో మెడికల్ కళాశాల), సీ సునీల్‌కుమార్, షేక్ గాంజీ కుతుబ్ (రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల), ఎం. సాయి షణ్ముక్ (ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాల), వీ సాయిచందు (అమలాపురం కోనసీమ డెంటల్ కళాశాల), సచిన్ చౌదరి (ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల), కేఎస్‌పీఎస్. రామకృష్ణ (అమలాపురం కోనసీమ మెడికల్ కళాశాల).

కేఆర్‌యూ టీటీ విజేతగా పీబీ సిద్ధార్థ



విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8: నగరంలోని పీబీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 6న జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పురుషుల విజేతగా పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. ఫైనల్స్‌లో కేబీఎన్ కళాశాలపై 3-2 తేడాతో సిద్ధార్థ జట్టు జయకేతనం ఎగురవేసింది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కె.చరణ్‌తేజ (బీఎస్సీ, తృతీయ), జీవీ మల్లిఖార్జున రోహిత్ (బీకామ్, ద్వితీయ), ఎ.గోవింద్ (డిప్లమో ఇన్ యోగా) క్రీడాకారులు ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు తమిళనాడు అంబేద్కర్ లా వర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ ఎ.చినబాబు అభినందించారు. రాబోయే టోర్నీలోనూ సత్తా చాటాలన్నారు.

ఘనంగా సీనియర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8: ఏపీ లాన్‌టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐజీఎంసీ టెన్నిస్ కాంప్లెక్సులో సీనియర్ మాస్టర్స్-200 ఐటీఎఫ్ (ఎస్‌వీ.రామయ్య మెమోరియల్ టెన్నిస్) టోర్నీ ఘనంగా సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు, ఏపీఎల్‌టీఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.పట్టాభి రామయ్య, టోర్నీ డైరెక్టర్ సూదగాని రామకృష్ణ పాల్గొన్నారు. 50 ఏళ్లుగా టెన్నిస్ కోచ్‌గా ఉన్న దోస రామారావు, తాహిర్ ఆలీ, అంతర్జాతీయ ప్లేయర్ పవన్ జైన్‌ను దుశ్శావాలు, మెమెంటోలతో సత్కరించారు. టోర్నీ స్పాన్సర్ డాక్టర్ ఎస్.జయదేవ్ పాల్గొన్నారు. సీనియర్స్ 40, 45, 55. 60 ,65,70, 75 ప్లస్ విభాగాల్లో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి.

తుదిదశకు ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ క్రికెట్ టోర్నీ

మూలపాడు వేదికగా జరుగుతున్న ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ 20 క్రికెట్ టోర్నీ తుదిదశకు చేరింది. సోమవారం నాటి సెమీఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఆకాష్ ఎలెవన్‌పై త్రినాథ్ సీసీ టీమ్ 3 వికెట్ల తేడాతోను, సీఏపీ టీమ్‌పై ఎస్ఎస్ ఇంటీరియర్స్ టీమ్ 81 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు దూసుకెళ్లా


గద్దె రామ్మోహన్ దంపతులతో మాట్లాడుతున్న కేశినేని శ్వేత

ఇన్నాళ్లు సహకరించినందుకు థ్యాంక్స్

గద్దె దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన కేశినేని శ్వేత

పటమట, జనవరి 8: 11వ డివిజన్ కార్పొరేటర్ కేశినేని శ్వేత సోమవారం గద్దె రామ్మోహన్‌ను అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో కలిసి తన పదవికి రాజీనామా చేయనున్నట్టు స్పష్టం చేశారు. కార్పొరేటర్‌గా తన రాజకీయ ప్రస్థానంలో తన వెన్నంటి ఉండి సహాయ సహకారాలు అందించినందుకు శ్వేత గద్దె దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నానని, మేయర్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేస్తానని తెలిపారు. స్పందించిన గద్దె రామ్మోహన్, అనురాధ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని సూచించారు.

అమరావతి రైతులకు అవమానం


సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అమరావతి రైతులు

- సీఆర్‌డీఏ కార్యాలయంలోకి రాకుండా గేట్లు మూసివేత
- వినతిపత్రం ఇవ్వడానికి కూడా అనుమతి నిరాకరణ
- గేట్ల దగ్గర బైఠాయించిన రైతులు
- ఆందోళనతో దిగివచ్చిన సీఆర్‌డీఏ

విజయవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమస్యలు చెప్పుకొందామని వచ్చిన అమరావతి రాజధాని రైతులపై ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని ప్రదర్శించింది. వినతి పత్రం ఇవ్వటానికి వచ్చిన రైతులను తీవ్ర అవమానానికి గురి చేసింది. సీపీఐ నేతృత్వంలో రాజధాని రైతులు సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్‌కు తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు రాగా, వారిని లోపలికి అడుగు పెట్టనీయకుండా గేట్లు మూసేశారు. అక్కడ భారీ ఎత్తున పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు సీఆర్‌డీఏ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. దిగి వచ్చిన సీఆర్‌డీఏ అధికారులు.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వర రావు, మరో నలుగురినే లోపలికి అనుమతించారు. అక్కడ అడిషనల్ కమిషనర్ అలీం బాషా మాత్రమే అందుబాటులో ఉన్నారు. కమిషనర్ అందుబాటులో లేకపోవటంపై రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. 'అమరావతి రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు భూములు అప్పగిస్తే వారి సమస్యలు వినటానికి కూడా సీఆర్‌డీఏ కమిషనర్‌కు తీరిక లేదా? రైతులకు కౌలు చెల్లించకుండా బాధపెట్టడం తగదు. అసైన్డ్, లంక భూముల రైతులకు వార్షిక కౌలు చెల్లించకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడటం తగదు. భూ సమీకరణ ఒప్పందంలో భాగంగా రైతులకు ఇచ్చే నివాస, వాణిజ్య స్థలాలను అభివృద్ధి చేయలేదు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. భూమిలేని పేదలకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు. అడిషనల్ కమిషనర్ అలీం బాషా వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. బయట ఉన్న రైతులకు చెప్పాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో అలీం బాషా బయట ఉన్న రైతుల దగ్గరకు వచ్చారు. కౌలుకు సంబంధించిన వివరాలను సీఎఫ్‌ఎంఎస్‌కు పంపించామని, మరోమారు ఆర్థిక శాఖకు ప్రతిపాదిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సీపీఐ రాజధాని రైతు జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ 'సంక్రాంతి వరకు ఈ ప్రభుత్వానికి సమయం ఇస్తున్నాం. సమస్యలను పరిష్కరించకపోతే.. ప్రత్యక్ష పోరుకు సిద్ధమవుతాం' అని హెచ్చరించారు.

ఆ అధికారం ఉన్నతవిద్యామండలికి లేదు!

- బీఈడీ కాలేజీల్లో తనిఖీపై హైకోర్టులో ప్రైవేటు యాజమాన్యాల వాదన
- ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టివేయాలని విజ్ఞప్తి
- వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం
- విచారణ రేపటికి వాయిదా

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఏపీ ఉన్నత విద్య మండలికి అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని ఉన్నత విద్యశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి, చైర్మన్, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్, యోగి వేమన, ఆచార్య నాగార్జున యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఏపీ ఉన్నత విద్య మండలికి అప్పగిస్తూ ఈ ఏడాది జనవరి 1న ప్రభుత్వం జారీ చేసిన జీవో 1ని సవాల్ చేస్తూ ప్రైవేటు బీఈడీ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు గుండారెడ్డి, మరికొన్ని కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ జీవో ఏపీ విద్యా చట్టం-1982, ఏపీ యూనివర్సిటీల చట్టం-1991 నిబంధనలకు విరుద్ధంగా ఉందని, అందువల్ల ఆ జీవోను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ... చట్టనిబంధనల ప్రకారం బీఈడీ కళాశాలలను తనిఖీ చేసే అధికారం యూనివర్సిటీలకు మాత్రమే ఉందన్నారు. కాగా, ఆ జీవోపై వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కుల, జనన పత్రాలపై సీఎం ఫొటో వద్దు

- ఇది కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలకు విరుద్ధం
- హైకోర్టులో అమరావతి బహుజన సొసైటీ ప్రజాప్రయోజన వ్యాజ్యం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫొటో, నవరత్నాల లోగోను ముద్రించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం దాఖలైంది. అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ఈ వ్యాజ్యం వేశారు. 'ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లపై జాతీయ చిహ్నాన్ని ముద్రించేవారు. ప్రస్తుతం ఆ ముద్రతోపాటు ముఖ్యమంత్రి ఫొటో, నవరత్నాల లోగోను ముద్రిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు, సాంఘిక సంక్షేమశాఖ 1997లో ఇచ్చిన జీవో 58 నిబంధనలకు లోబడి ఉండాలి. వీటికి ఎలాంటి సవరణ చేయకుండా, నిబంధనలలో మార్పులు చేయకుండా సర్టిఫికెట్ల నమూనాను మార్చారు. ఇలా ముద్రించడం వల్ల లబ్ధిదారుడికి వ్యతిరేకంగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంలో మినహా దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలలోనూ సర్టిఫికెట్లపై సీఎం ఫొటో, ప్రభుత్వ పథకాలను ముద్రించడం లేదు. సర్టిఫికెట్లపై సీఎం ఫొటో, నవరత్నాల లోగో ముద్రించకుండా ఆదేశాలు ఇవ్వండి' అని అభ్యర్థించారు.

ఏపీలోని సహకార సంఘానికి మోదీ మెచ్చుకోలు

- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఓ సహకార సంఘాన్ని ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. ఏపీకి చెందిన 102 ఏళ్ల చరిత్ర కలిగిన సహకార సంఘం రైతులకు మెరుగైన ధర కల్పించేందుకు నూతన విధానాలను అవలంబించిందని ప్రశంసించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో ప్రధాని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా 102 ఏళ్ల పురాతన సహకార సంఘంలో సభ్యుడు, నంద్యాలకు చెందిన సయ్యద్ ఖ్వాజా మొహియుద్దీన్ ప్రధాని మోదీతో మాట్లాడారు. అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ కింద ధాన్యం నిల్వ చేయడానికి నాబార్డు తమ సొసైటీకి రూ.మూడు కోట్ల రుణాన్ని ఆఫర్ చేసిందని ప్రధానికి తెలియజేశారు. దీంతో ఐదు గోడౌన్లను నిర్మించేందుకు తమకు అవకాశం లభించిందన్నారు. తమ గోదాములలో ధాన్యాన్ని ఉంచిన రైతులకు ఎలక్ట్రానిక్ రశీదులు లభిస్తాయని తద్వారా వారు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చున్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ రైతులను ఈ-మండీలు, ఈనామ్‌లతో అనుసంధానం చేసి వారి ఉత్పత్తులకు ఉత్తమ ధరలను నిర్ధారిస్తుందన్నారు. తమ బృందంలో మహిళా రైతులు సహా 5,600 మంది రైతులు ఉన్నారని ప్రధానికి వివరించారు. యూరియా, నానో యూరియా రెండింటినీ వాడొద్దని రైతులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదంతో పథకాలు చిట్టచివరి వ్యక్తికి చేరేవరకు కృషి చేస్తామని మోదీ తెలిపారు.

ఎల్లలు దాటిన తర్వాత.. తెలుగువారంతా ఒక్కటే

- సౌదీలో ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా వ్యాఖ్య

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: దేశ ఎల్లలు దాటిన తర్వాత రాష్ట్రాలతో సంబంధం లేకుండా తెలుగు వారంతా ఒక్కటేనని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా వ్యాఖ్యానించారు. కుటుంబ సమేతంగా ఉమ్రా(మక్కా యాత్ర) చేసిన ఆయన తిరుగుప్రయాణంలో సౌదీ అరేబియాలోని జెద్దాలో సోమవారం తనను కలిసిన సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్(సాటా) ప్రతినిధి బృందంతో మాట్లాడారు. సాటా చేస్తున్న సామాజిక సేవను ఆయన అభినందించారు. అంతకుముందు రాయలసీమ ప్రతినిధులు ఆయనను కలిశారు.

మానవత్వం లేకనే ఎస్మా: పట్టాభి

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'ఆందోళనలు చేస్తున్న సిబ్బందిపై జగన్... మనసు రాక, మానవత్వం లేకనే పోలీసుల్ని, ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్నారు. డబ్బుల్లేక కాదు' అని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇచ్చిన హామీల కోసం పోరాడుతున్న వారిపై లాఠీలు ఝుళిపించి ఎస్మా చట్టాలు ప్రయోగిస్తారా? అంగన్వాడీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అభియాన్ సిబ్బంది, 108, 104 అంబులెన్స్‌ల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల మొత్తం విలువ జగన్ తన విలాసాల కోసం తగలేసిన రూ.వేల కోట్ల ప్రజల సొమ్ము ముందు దిగదుడుపే. చెత్తపై పన్ను వేసిన ప్రభుత్వానికి అదే చెత్తను ఊడుస్తున్న కార్మికులకు న్యాయం చేయడానికి సంకోచమెందుకు?' అని పట్టాభి ప్రశ్నించారు.

జగన్‌ది మోసకారి సంక్షేమం: కొల్లు రవీంద్ర

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్షేమం ముసుగులో జగన్ మోసకారి సంక్షేమం అమలు చేస్తున్నారని, టీడీపీ ప్రభుత్వం అందించిన 100కు పైగా సంక్షేమ పథకాలను రద్దు చేశారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. సోమవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రజలపై విపరీతంగా పన్నుల భారం మోపాడని, విద్యుత్, ఆర్టీసీ, ఇంధన చార్జీలు భారీగా పెంచారన్నారు. ఒక చేత్తో రూ.10లు ఇచ్చి రూ.100లు మరో చేత్తో లాక్కొన్నారని విమర్శించారు.

అంగన్వాడీలు బెదరరు: ఆచంట సునీత

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి నియంత పోకడలకు అంగన్వాడీలు బెదరరని అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత స్పష్టం చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం జగన్‌రెడ్డి అరాచక పాలనకు పరాకాష్ఠ అని సోమవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. సమ్మె కాలానికి వేతనంలో రూ.3,450 కోత విధించడం దుర్మార్గం అని మండిపడ్డారు.

వైసీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

- ఇప్పటికే దళితులు దూరం: ఎంపీ రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకే ఎక్కువగా అన్యాయం జరుగుతోందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజు అన్నారు. వైసీపీకి దళిత సామాజిక వర్గం దూరమవుతోందన్నారు. సోమవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామకృష్ణ రాజు ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. బ్రదర్ అనిల్ రంగ ప్రవేశం తరువాత దళితులు వైసీపీకి మరింత దూరమవుతారని చెప్పారు. 'కనీసం సీటు ఎందుకివ్వలేకపోతున్నామో ఎమ్మెల్యేలను పిలిచి ఒక్క నిమిషం మాట్లాడలేరా? ఎమ్మెల్యేలకు ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, సకల శాఖామంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి మాత్రమే చావు కబురు చల్లగా చెప్పాలా?' అంటూ ఎద్దేవా చేశారు.

రేపు, ఎల్లుండి ఏపీలో మాణిక్కం ఠాగూర్ పర్యటన

న్యూఢిల్లీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్ బుధ, గురువారాలు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. రెండు రోజుల పాటు విజయవాడలో పర్యటించనున్నారు. పార్టీ బలోపేతంతోపాటు సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. మాణిక్కం ఠాగూర్‌కు ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా పార్టీ బాధ్యతలు అప్పగించాక రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి.

అంతన్నాడు.. ఇంతన్నాడు..
నిట్టనిలువునా ముంచేశాడు!

- ఆరోగ్య శాఖలో వివిధ సంఘాల ఆవేదన
- జగనన్న మోసం చేశాడని తీవ్రంగా మండిపాటు
- సమ్మె నోటీసు ఇచ్చిన 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగ సంఘాలు

ఆరోగ్య శాఖకు చెందిన పలు సంఘాలు సమ్మెకు సన్నద్ధమవుతున్నాయి. తమ సమస్యలు పరిష్కరించాలని ఇంతకాలం వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించిన 104,108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు 22వ తేదీలోగా సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే 23 నుంచి సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఆయుష్ ఉద్యోగులు సోమవారం వైసీపీ ప్రధాన కార్యాలయం, కమిషనర్ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగారు.

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు అంతన్నాడు... ఇంతన్నాడు. అధికారంలోకి వచ్చిన వారంలోనే అన్నీ చేసేస్తానని డాంబికాలు పలికాడు. చివరాఖరికి అందర్నీ నిట్టనిలువునా ముంచేశారు. జగనన్న ఏదో చేసేస్తాడని నాలుగున్నరేళ్ల కళ్లు కాయలు కాసేలా చూసిన ఉద్యోగులు ఇప్పుడు ఆందోళన బాట అవుతున్నారు. ఆశా వర్కర్ల దగ్గర నుంచి 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులతోపాటు ఆయుష్ ఉద్యోగులు కూడా ఉద్యమ బాటపడుతున్నారు. ఆశా వర్కర్లకు అధికారంలోకి రాగానే రూ.10 వేల వేతనం ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు పెంచుతున్నట్లు పేపర్ల మీద చూపించారు. కానీ ఎవరికీ నెలవారీగా రూ.10 వేలు ఖాతాల్లో పడిన దాఖలాలు లేవు. పైగా ఇన్సెంటివ్స్ ఆధారంగానే పది వేలు చేస్తున్నట్లు చూపిస్తున్నారు. గర్భిణీలను రిజిస్ట్రేషన్ చేయిస్తేనో, ఆస్పత్రులకు రిఫరల్స్‌కు తీసుకువెళ్తే ఇలా ఇన్సెంటివ్ ఆధారంగానే పది వేలు వచ్చేలా నిబంధనలు రూపొందించారు. దీంతో ఆశా వర్కర్లు ఎంత కష్టపడినా వారికి నెలకు రూ.10 వేలు వచ్చే పరిస్థితి లేదు. పైగా ఆశా వర్కర్లపై పని భారం పెంచేశారు. ఫీవర్ సర్వే, జగన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ అంటూ ఆశా వర్కర్లపై పని భారాన్ని మోపుతున్నారు. పైగా వారికి ప్రభుత్వ పథకాలు అమలు కాకపోవడం, రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా ఆశాలు ఇంటికి వెళ్లిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆశా వర్కర్లను ఆదుకుంటామని ఇచ్చిన హామీ, అధికారంలోకి రాగానే ఆటకెక్కింది. దీనిపై ఆశా వర్కర్లు ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. త్వరలో వారు కూడా విధులు బహిష్కరించి పూర్తిస్థాయి ఆందోళనలోకి దిగుతున్నారు. ఇక 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు వెతలు మరీ దారుణం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే అరబిందో సంస్థకు వీటి నిర్వహణను అప్పగించారు. ఎన్నికల ముందు 108, 104 ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పైలట్ (డ్రైవర్), ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) జీతాలు అమాంతం పెంచేస్తామని ప్రకటనలు చేశారు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం రాగానే ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 108, 104 ఉద్యోగులను అందులో పెడతామని మాటిచ్చారు. ఆ మాటను నీటి మూటలా మార్చేశారు. పైలెట్, ఈఎంటీ జీతాలు పెంచారు. కానీ అనుభవం అనే నిబంధన పెట్టి అరకొర మందికే జీతాలు పెంచారు. పెంచిన జీతాలు ఎప్పుడు పడతాయో చెప్పలేని పరిస్థితి. ఈ రోజుకి 108 ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు బకాయిలున్నాయి. వారం రోజుల కిందట ఉద్యోగులు గట్టిగా ప్రశ్నించడంతో ఒక నెల జీతం వేశారు. మూడేళ్ల నుంచి ఒక్కసారి కూడా బోనస్ వేయలేదు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బోనస్ దాదాపు రూ.50 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయి. 108లో ఉద్యోగుల వెల్ఫేర్ మొత్తం ఎప్పుడో అస్తవ్యస్తం అయిపోయింది. 108, 104ను ఆరోగ్యశ్రీ కిందకు తీసుకువచ్చిన తర్వాత పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఈ విభాగంలో విధులు నిర్వహించే కొంత మంది కీలక అధికారులు అరబిందో సంస్థతో కుమ్మక్కై ఉద్యోగుల వెల్ఫేర్‌ను గాలికి వదిలేశారు. ప్రభుత్వం నుంచి అరబిందో సంస్థను ప్రశ్నించే వారే లేకపోవడంతో ఆ సంస్థ సక్రమంగా జీతాలు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటు సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం, అరబిందో సంస్థ సక్రమంగా జీతాలు కూడా చెల్లించకపోవడంతో విసుగు చెందిన ఉద్యోగులు చివరికి ఉద్యమ బాటను ఎంచుకున్నారు. 104 ఉద్యోగులు కూడా అరబిందో సంస్థ నిర్వహణలో వాహనాలు సక్రమంగా లేవని, వెంటనే 104 వాహనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ పరిధిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండు సంఘాలు కలిసి సోమవారం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును కలిసి సమ్మె నోటీసులిచ్చారు. 108 ఉద్యోగులను వెంటనే ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని, డీఎంఈ చేపట్టే నియామకాల్లో తమకూ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆర్టీసీ, ఇతర శాఖల్లో కాంట్రాక్ట్ డ్రైవర్ల పోస్టుల్లో పైలట్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులను వెంటనే ఆప్కోస్‌లో చేర్చాలని కోరారు. ఈ నెల 22లోపు తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే 23 నుంచి సమ్మెలోకి వెళ్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఆందోళనకు దిగిన ఆయుష్ ఉద్యోగులు

అధికారంలోకి వచ్చిన వెంటనే 800 మంది ఆయుష్ ఉద్యోగులను ప్రభుత్వంలోకి తీసేసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటికి ఆయుష్ ఉద్యోగులు జగనన్న పుణ్యమా అని రోడ్డు మీదనే ఉన్నారు. వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయుష్ ఉద్యోగులు మాత్రం పట్టువదలకుండా నాలుగున్నరేళ్ల నుంచి జగనన్నపై నమ్మకంతో కాళ్లు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ఇక జగనన్నపై నమ్మకం పోవడంతో ఆందోళనకు సిద్ధం అయ్యారు. సోమవారం ఉదయం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయం బయట ఆందోళన చేపట్టారు. చివరికి విజయసాయిరెడ్డి వారిని సముదాయించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఉద్యోగుల ఆందోళన విరమించారు. అక్కడి నుంచి నేరుగా ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. తాము ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకుంటామని, కేంద్ర ప్రభుత్వం ఆయుష్ డిస్పెన్సరీలకు నిధులు కేటాయించడం లేదని ఉద్యోగులకు తెలిపారు. ఉద్యోగులు మాత్రం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అంగీకారపత్రం ఇవ్వడం లేదని చెప్పారు. ఇలా కమిషనర్, ఉద్యోగుల మధ్య కాస్త వాగ్యుద్ధం జరిగింది. దీంతో ఉద్యోగులు ఆయన కార్యాలయంలోనే బైఠాయించారు. తమ ఫైల్ 22 రోజులుగా మీ దగ్గరే ఉందని, వెంటనే ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్ మేరకు ఆయుష్ ఉద్యోగుల ఫైల్‌ను కమిషనర్ వెంటనే పంపించేశారు.

స్వార్థం కోసం రాజ్యాంగ వ్యవస్థలు
నిర్వీర్యం: హెచ్‌ఆర్‌సీ

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేయడం తగదని మానవ హక్కుల వేదిక వ్యాఖ్యానించింది. కోనసీమ జిల్లా పేరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమగా మార్చినప్పుడు జరిగిన అల్లర్ల సమయంలో మంత్రి పినిపె విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇళ్లను నిరసన కారులు తగలబెట్టారు. అప్పట్లో ఆరు కేసులు నమోదు చేసిన పోలీసులు 245 మందిని నిందితులుగా చేర్చి జైలుకు పంపారు. ఈ కేసుల్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉపసంహరించు కోవడంపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల్ని జేబు సంస్థలుగా వాడుకొంటూ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల్ని ఉపసంహరించుకోవడం రాజ్యాంగాన్ని గౌరవించక పోవడమేనన్నారు.

హౌసింగ్ డైరెక్టర్ల పదవీ కాలం పొడిగింపు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మొత్తం 14 మంది డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సోమవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 35వ బోర్డు సమావేశంలో బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, సంస్థ ఎండీ జి.లక్ష్మీషా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ తదితర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి డైరెక్టర్లు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని చైర్మన్ దొరబాబు కోరారు.

రాష్ట్రవ్యాప్త నిరసనలు విజయవంతం

- పురపాలక టీచర్ల సమాఖ్య

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీవో 84 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని పురపాలక టీచర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. 84 జీవో వల్ల మున్సిపల్ టీచర్ల బతుకులు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పురపాలక పాఠశాలలన్నింటినీ 2022, జూన్ 24వ తేదీ నుంచి విద్యాశాఖ పరిధిలోకి తీసుకువస్తూ జారీ చేసిన ఈ జీవో వల్ల మున్సిపల్ టీచర్లు అనేక కష్ట, నష్టాలకు గురవుతున్నారని వివరించారు. మున్సిపల్ టీచర్లపై క్రమశిక్షణ చర్యల విషయంలో జీవో 84కు న్యాయపరమైన అధికారం లేదని హైకోర్టు కూడా వ్యాఖ్యానించిందని సోమవారం ఒక ప్రకటనలో రామకృష్ణ తెలిపారు.

మరో ఫైల్ మాయం!

దేవదాయ శాఖలో కనిపించని కీలక ఫైళ్లు

- మొన్న హథీరామ్ మఠం మహంతు ఫైల్ మిస్సింగ్
- ఇప్పుడు సీనియర్ అసిస్టెంట్ అక్రమ పదోన్నతుల ఫైల్ మిస్సింగ్
- ఇంటి దొంగలపైనే అనుమానాలు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిత్ర విచిత్రాలన్నీ దేవదాయ శాఖలోనే జరుగుతాయి! మొన్నటికి మొన్న హథీరామ్ మఠం మహంతు అర్జున్‌దాస్ నియామక ఫైల్ కనిపించకుండాపోయింది. ఇప్పుడు సీనియర్ అసిస్టెంట్ అక్రమ పదోన్నతులకు సంబంధించిన ఫైల్స్ మొత్తం కనిపించడం లేదు. తిరుమల హథీరామ్ మఠం విషయానికి వస్తే.. తిరుమల హథీరామ్ మఠం మహంతుగా దాదాపు 20 ఏళ్ల క్రితం అర్జున్ దాస్‌ను నియమించారు. ఆయన నియామకం కరెక్టు కాదని అప్పటి నుంచే అనేక ఆరోపణలున్నాయి. మఠం నిబంధనల ప్రకారం అర్జున్ దాస్ నియామకం జరగలేదని ఆ రోజుల్లో దేవదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆర్డర్‌ను దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి కొట్టేశారు. దీనిపై అర్జున్ దాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు అర్జున్ దాస్‌ను మహంతుగా కొనసాగించేందుకు అనుమతిస్తూ, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఆర్డర్‌పై స్టే ఇచ్చింది. ఈ స్టేపై ఆ తర్వాత దేవదాయ శాఖ వెకేషన్ పిటిషన్ దాఖలు చేయలేదు. దీంతో ఆయన మహంతుగా కొనసాగుతూనే వచ్చారు. ఈ క్రమంలో హథీరామ్ మఠంలో అనేక అక్రమాలు, అవినీతి కార్యక్రమాలు జరిగాయి. దీంతో దేవదాయ శాఖ అధికారులు అతడిని తొలగించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. చివరిగా రెండు నెలల క్రితం ధార్మిక పరిషత్ సమావేశంలో అర్జున్ దాస్‌ను మహంతుగా తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై అర్జున్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అయన్ను మహంతుగా కొనసాగించాలని మరోసారి దేవదాయ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటే ఆయన నియామకం దగ్గర నుంచి ఇరు వర్గాల మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలకు సంబంధించిన ఫైల్స్ మొత్తం అవసరం పడింది. అయితే అర్జున్ దాస్ నియామకానికి సంబంధించిన ఫైల్ ఎక్కడా కనిపించలేదు. దీంతో అధికారులు కంగారుపడి ఆ ఫైల్‌ను వెతికేందుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించారు. చివరికి మూడు రోజుల తర్వాత దేవదాయ శాఖ రికార్డు రూమ్‌లో ఆ ఫైల్ వెలుగులోకి వచ్చింది. ఇక్కడే అసలుసిలైన ట్విస్ట్ ఉంది. 20 ఏళ్లగా దేవదాయ శాఖ అర్జున్ దాస్ నియామకంపై ఫైట్ చేస్తోంది. ఆయన నియామకం దగ్గర నుంచి ఫైల్ ఇంకా క్లోజ్ కాలేదు. సాధారణంగా ఒక అంశంపై ఏదైనా ఫైల్ శాఖలో ప్రారంభిస్తే.. ఇది మొత్తం క్లోజ్ అయిన తర్వాత ఫైల్‌ను రికార్డు రూమ్‌కు పంపిస్తారు. అంతవరకు ఆ ఫైల్ సదరు సెక్షన్‌లోనే ఉండాలి. కానీ అర్జున్ దాస్ నియామకంపై కోర్టులో వాదనలు నడుస్తున్న క్రమంలో ఆ ఫైల్ రికార్డు రూమ్‌కు ఎందుకు వెళ్లిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇంతలోనే..మరొక ఫైల్ మిస్సింగ్ అంశం మరింత తలనొప్పిగా మారింది. దేవదాయ శాఖలో అన్ని కేడర్ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చేద్దామని మంత్రి దగ్గర నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరూ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అది సాధ్యంకాదని తెలిసినా.. పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించిన ఫైల్స్‌పై అధికారులు దృష్టిసారించారు. కొన్నేళ్ల నుంచి సీనియర్ అసిస్టెంట్ అక్రమ పదోన్నతులకు సంబంధించిన అంశంపై కొంత మంది ఉద్యోగులు పోరాటం చేస్తున్నారు. సీనియార్టీ విషయంతో తేడాలు రావడంతోపాటు నిబంధనల ప్రకారం 17 పోస్టులు ఉంటే 31 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఇది కరెక్టు కాదని చాలామంది కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో ఎంతోమంది కమిషనర్లు విచారణ చేయడం, విచారణ కమిటీలు వేయడంచేశారు. ఇప్పుడు ఆఫైల్స్‌మొత్తం మాయమయ్యాయి.

ఇంకా మ్యాన్యువల్ ఫైల్స్ ఎందుకు?

కీలకమైన ఫైల్స్ మిస్ అవుతున్నాయనే గత ప్రభుత్వం మొత్తం ఈ-ఆఫీస్ విధానాన్ని తీసుకువచ్చింది. దేవదాయ శాఖలో మాత్రం ఇప్పటికీ మ్యాన్యువల్ ఫైల్ నడుస్తున్నాయి. ముఖ్యంగా ఎస్టాబ్లిష్‌మెంట్, విజిలెన్స్ విభాగంలో కీలకమైన ఫైల్స్ మొత్తం మ్యాన్యువల్‌గానే నడిపిస్తున్నారు. ఇలాంటి ఫైల్స్ అయితే.. కొన్ని పేపర్లు తొలగించవచ్చు. ఇంకా అవసరమైతే మొత్తం ఫైల్స్ కనిపించకుండా చేయవచ్చన్న ఉద్దేశంతో ఈ విధంగా అక్రమ పద్ధతిలో ఫైల్స్ నడిపిస్తున్నారు.

అమెరికన్లు భారత్ బాట పట్టాలి

- సాంకేతికతలో తిరుగులేని స్థాయికి ఇండియా
- పీఈఎస్ వర్సిటీ చాన్సలర్ ఎంఆర్ దొరస్వామి
- ఆయన 'ఆత్మకథ'ను ఆవిష్కరించిన సుధామూర్తి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధామూర్తి

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అమెరికన్లు విద్య కోసం భారత్ బాట పట్టాలన్నదే తన ఆకాంక్ష అని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ యూనివర్సిటీ (పీఈఎస్) చాన్సలర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అన్నారు. భారత్ ఆవిష్కరణల దిశగానే కాకుండా సాంకేతికతలోనూ తిరుగులేని స్థాయికి చేరిందని చెప్పారు. పీఈఎస్ విద్యా సంస్థల స్వర్ణోత్సవాలను బెంగళూరులో నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వేడుకలకు హాజరయ్యారు. విదేశీ యూనివర్సిటీలకు ఏమాత్రం తీసిపోని రీతిలో రూ.400 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవన్‌లో ఉత్సవాలు జరిగాయి. ఈ వేడుకల్లో దొరస్వామి రచించిన 'కనసు ననసాయితు' (కల సాకారమైంది) పుస్తకాన్ని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సుధామూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడారు. "చిత్తూరు జిల్లాలోని రైతు కుటుంబంలో జన్మించి చదువు కోసం బెంగళూరు వచ్చాను. 1972లో 40 మంది విద్యార్థులతో పీయూ కళాశాలను ప్రారంభించాను. నేడు దానిని దేశంలోనే ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దాను. సొంత జిల్లాలో పేదలకు అధునాతన వైద్యం అందుబాటులో ఉండాలని కుప్పంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశాను. బెంగళూరులోనూ మెడికల్ కాలేజీ అందుబాటులోకి వచ్చింది. నాకు సమాజం ఎంతో ఇచ్చింది. అందుకే బెంగళూరులో ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి రూపురేఖలు మార్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాను. పీఈఎస్ విద్యా సంస్థల ఎదుగుదలకు ఎంతో మంది సహకారం, అధ్యాపకుల అవిశ్రాంత కృషి ఉంది" అని దొరస్వామి అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, మెడికల్ కళాశాలల డైరెక్టర్ రూపా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిస్ ఆసియా సూపర్ మోడల్‌గా కర్ణాటక యువతి



బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మిస్ ఆసియా సూపర్ మోడల్ కిరీటాన్ని కర్ణాటక రాష్ట్రం బెళగావికి చెందిన నీతా శిర్‌గాంవ్కర్ అందుకున్నారు. డ్రీమ్స్ ప్రొడక్షన్ హౌస్ ఆధ్వర్యంలో ఆదివారం నొయిడా ఫిలింసిటీలో జరిగిన ఆసియా సూపర్ మోడల్- 2023 పదో సీజన్ వివిధ విభాగాల పోటీల్లో ఆసియా దేశాలకు చెందిన వందమంది యువతీ యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. ఆద్యంతం ఆసక్తి కరంగా సాగిన పోటీల్లో నీతా శిర్‌గాంవ్కర్ న్యాయనిర్ణేతల ప్రశ్నకు చక్కటి సమాధానాలు ఇచ్చి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. తొలి రన్నరప్‌గా ముంబైకి చెందిన డాక్టర్ అపూర్వ మిశ్ర నిలిచారు. నీతా బ్యూటిఫుల్ స్కిన్ టైటిల్‌ను కూడా సొంతం చేసుకోవడం విశేషం. కాగా మిస్టర్ ఆసియా సూపర్ మోడల్‌గా భోపాల్‌కు చెందిన రోహిత్ సక్సేనా ఎంపికయ్యారు. ఈ మేరకు డ్రీమ్స్ ప్రొడక్షన్ హౌస్ సంస్థాపకుడు శరత్‌చౌదరి బెంగళూరులో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మళ్లీ సీఐడీ విచారణకు కొలికిపూడి

గుంటూరు, జనవరి 8: టీవీ డిబేట్‌లో దర్శకుడు రాంగోపాల్ వర్మపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఏపీసీఐడీ నమోదు చేసిన కేసులో అమరావతి జేఏసీ నేత కొలికిపూడి శ్రీనివాసరావు రెండోసారి విచారణకు హాజరయ్యారు. సోమవారం గుంటూరులోని రీజినల్ సీఐడీ కార్యాలయానికి ఆయనతో పాటు ఒక చానల్ యాంకర్ సాంబశివరావు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఐడీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఉదయం సుమారు 10.15 గంటలకు ఇరువురు న్యాయవాదులతో కలిసి సీఐడీ కార్యాలయానికి వెళ్లగా సాయంత్రం 4.15 గంటలకు బయటికి వచ్చారు. సీఐడీ కార్యాలయం వద్ద టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, తదితరులు కొలికిపూడి శ్రీనివాసరావు, సాంబశివరావుకు సంఘీభావం తెలిపారు. సీఐడీ విచారణ అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జగన్ 381 సార్లు కోర్టుకు వెళ్లకుండా వాయిదాలు అడిగారన్నారు. తమపై చేసిన తప్పుడు ఫిర్యాదుపై సీఐడీ కేసు నమోదు చేసినప్పటికీ విచారణకు రమ్మంటే ఈ నెల 3న, మళ్లీ ఇప్పుడు హాజరయ్యానన్నారు.

చంద్రుడి వైపు నాసా పెరెగ్రైన్ ల్యాండర్-1


- వచ్చేనెల 2న మూన్‌పై ల్యాండింగ్

న్యూఢిల్లీ, జనవరి 8: చంద్రునిపై పరిశోధనల కోసం పెరెగ్రైన్ ల్యాండర్-1ను అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. సోమవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కేప్ కనెవెరల్ స్పేస్ స్టేషన్ నుంచి పెరెగ్రైన్ ల్యాండర్-1తో కూడిన వుల్కాన్ సెంటోర్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 2024 ఫిబ్రవరి 2న ఇది చందమామపై ల్యాండ్ కానుంది. 1972 తర్వాత అపోలో మిషన్ తర్వాత అంటే.. 51ఏళ్ల తర్వాత నాసా నుంచి అమెరికా చంద్రుడిపైకి పంపుతున్న లూనార్ మిషన్ ఇదే కావడం గమనార్హం. 2030 తర్వాత చంద్రుడిపైకి మానవ సహిత మిషన్‌కు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ వాతావరణ పరిస్థితులను పెరెగ్రైన్ ల్యాండర్-1 అధ్యయనం చేయనుంది. ల్యాండర్‌లోని ఐదు పేలోడ్స్, 15 ఇతర భాగాలు చంద్రుడి మీద రేడియేషన్ స్థాయిలు, నీటి, మంచు జాడలు, అయిస్కాంత క్షేత్రాలపై అధ్యయనం చేయనున్నాయి.

దివ్యాంగులకు సాయం కోసం హెల్ప్‌లైన్

గోవా, జనవరి 8: దివ్యాంగులకు ఏ సమయంలోనైనా ఎలాంటి సాయమైనా అందించేందుకు తొలిసారిగా జాతీయ స్థాయి హెల్ప్‌లైన్ సోమవారం ఇక్కడ ప్రారంభమయింది. టోల్ ఫ్రీ నెంబరైన 1800 22 2014కు ఫోన్ చేసి తమ సమస్యను వివరించి సాయం కోరవచ్చు. ఇది 24/7 విధానంలో పని చేస్తుంది. ఇక్కడ నిర్వహిస్తున్న పర్పుల్ ఫెస్టివల్ ఇంటర్నేషనల్‌లో కేంద్ర సామాజిక న్యాయం శాఖ సహాయ మంత్రి రామదాస్ అఠావలే, వికలాంగుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌లు ప్రారంభించారు. 21 అంగవైకల్యాల్లోని 153 కేటగిరీలకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాల్సి వచ్చినా అందజేస్తారు. విద్య, ఉపాధి, శిక్షణ సహా ఇతర సమాచారాన్ని ఈ నెంబరుకు ఫోన్ చేసి పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 9 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



హైదరాబాద్ నిక్మర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్మర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (పీజీ ఎన్‌క్యాట్) 2024, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రేట్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిర్దేశిత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది శాతం అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో రెగ్యులర్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/కామర్స్/ఫైనాన్స్/బ్యాంకింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ఎన్‌క్యాట్ 2024: పరీక్షని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి 180 మార్కులు నిర్దేశించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 36 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 70 మార్కులు ప్రత్యేకించారు.
- సీయూఈటీ(పీజీ)/క్యాట్/మ్యాట్/ఎక్స్‌ఏటీ/ఎన్‌మ్యాట్/ఏటీఎంఏ స్కోర్ ఉన్నవారు పీజీ ఎన్‌క్యాట్ 2024 రాయనవసరం లేదు.
- పీజీ ఎన్‌క్యాట్ 2024 స్కోర్‌కు 60 శాతం; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల స్కోర్లకు 16.67 శాతం; రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 23.33 శాతం వెయిటేజీ ఇస్తారు.

నిక్మర్ స్కాలర్‌షిప్‌లు: పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ స్థాయుల్లో కనీసం 95 శాతం మార్కులు సాధించినవారికి 80 శాతం ట్యూషన్ ఫీజు; 90 శాతం మార్కులు సాధించినవారికి 60 శాతం ట్యూషన్ ఫీజు; 85 శాతం మార్కులు సాధించినవారికి 40 శాతం ట్యూషన్ ఫీజు; 80 శాతం మార్కులు సాధించినవారికి 20 శాతం ట్యూషన్ ఫీజును స్కాలర్‌షిప్ కింద చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **పీజీ ఎన్‌క్యాట్, జీడీ, ఇంటర్వ్యూలు:** ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఫిబ్రవరి 21
- **ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మార్చి 20
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** https://nicmar.ac.in/hyderabad

సైన్స్‌లో పీహెచ్‌డీకి జెస్ట్



సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) దీనిని నిర్వహిస్తోంది. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. ఇందులో ఏఆర్ఐఈఎస్, బోస్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌బీఎన్ఐ, హెచ్‌ఆర్ఐ, ఐసీటీఎస్, ఐజీసీఏఆర్, ఐఐఏ, ఐఐఎస్సీ, ఐసర్ సంస్థలు, ఐఐఎస్‌టీ, ఐఎంఎస్సీ, ఐపీపీ, ఐపీఆర్, ఐయూసీఏఏ, జేఎన్‌సీఏఎస్‌ఆర్, ఎన్‌బీఆర్‌సీ, నైసర్, ఎన్‌సీఆర్ఏ - టీఐఎఫ్ఆర్, పీఆర్ఎల్, ఆర్ఆర్‌సీఏటీ, ఆర్ఆర్ఐ, ఎస్ఐఎన్‌పీ, ఎస్ఎన్‌బీఎన్‌సీబీఎస్, టీఐఎఫ్ఆర్-టీసీఐఎస్, టీఐఎఫ్ఆర్, యూజీసీ-డీఏఈ సిఎస్ఆర్, వీఈసీసీ వంటి ప్రధాన సంస్థలు పాల్గొంటున్నాయి. జెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో కొన్ని సంస్థలు అందిస్తున్న ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు. ప్రతి సంస్థకూ నిర్దేశిత అర్హత నిబంధనలు ఉన్నాయి. వాటి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, కంప్యూటేషనల్ బయాలజీ

అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్/ఆస్ట్రానమీ/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/బయోఫిజిక్స్/బయోకెమిస్ట్రీ/కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్/మేథమెటిక్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఎంసీఏ అభ్యర్థులకు కూడా కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులూ అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఆసక్తిగలవారు ఎన్నిసార్లయినా ఈ పరీక్ష రాయవచ్చు.

జెస్ట్ 2024 వివరాలు: ఈ పరీక్షని ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విభాగంలో మాత్రమే పరీక్ష రాయాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 15 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో 10 ప్రశ్నలు ఇస్తారు. ఆప్షన్స్ ఇవ్వరు. వీటికి ఒక నెంబరు సమాధానంగా ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేవు. మూడో పార్ట్‌లో 25 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లాక్/బ్లూ పెన్‌తో గుర్తించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ కేటగిరీ పురుషులకు రూ.800; మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
- **జెస్ట్ 2024 తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** jest.org.in

Joint Entrance Screening Test

ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రత్యేకం
ఇండియన్ సొసైటీ
బంధుత్వం ఒక సామాజిక సంస్థ

బంధుత్వం(కిన్‌షిప్)

సంస్థ అంటే ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థ. సామాజిక ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన అవ్యవస్థీకృతమైన సమూహమే సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరం వరకు జాగ్రత్తగా కొనసాగే ప్రామాణిక వ్యవస్థే సామాజిక సంస్థ. ప్రతి సమాజంలోనూ ప్రాథమికంగా ఉండేవి బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు.



బంధుత్వం: సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. జన్మించింది మొదలుకొని మరణించే వరకు వ్యక్తి అనేక మందితో సంబంధాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూ ఉంటుంది. అయితే రక్తం లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్త బంధుత్వం: భార్య, భర్త ఇద్దరికీ, వారి సంతానానికి మధ్య ఏర్పడిన పరస్పర బంధాలను 'రక్త బంధుత్వం' అని పిలుస్తారు. ఒకే దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ సంబంధాన్ని తెలిపేదే 'ఏక రక్త సంబంధం'.

బంధుత్వాలను భిన్న సమాజాలలో భిన్న రీతులుగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివశిస్తున్న 'తోడా' సమాజంలో స్త్రీ ఒక వ్యక్తితో సంతానం కలిగి...తదనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే అతడినే ఆ స్త్రీ పూర్వ సంతానికి కూడా తండ్రిగా అక్కడి సమాజం గుర్తిస్తుంది. ఈ తరహా బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం(సోషియాలజికల్ కిన్‌షిప్) అంటారు. సామాజిక బంధుత్వాన్ని మాత్రమే 'వాస్తవ బంధుత్వం' అంటారు. ఇటు వంటి వాస్తవ బంధుత్వాన్ని బట్టి కూడిన వారిని బంధువులు(కిన్స్) అంటారు.

ద్వితీయ బంధువులు: ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు, ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.(భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ తల్లిదండ్రులు-సోదర, సోదరీమణులు ద్వితీయ బంధువులు)

తృతీయ బంధువులు: ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు... ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా:- భార్య తాలూకు బావ(తోడల్లుడు తృతీయ బంధువు అవుతాడు. మొదటి వ్యక్తి తాలూకు భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ అక్క ద్వితీయ బంధువు, అక్క భర్త తృతీయ బంధువు)

వర్గాత్మక వ్యవస్థ: వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులు అందరినీ ఒకే వర్గంలో చేర్చడంతో పాటు ఒకే పదంతో వారిని సంబోధిస్తారు. ఉదా:- మామ ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతులను బట్టి బంధుత్వ పదాలను మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి.. పదాలు, అన్వయ పదాలు, టెక్నానమీ.

ఎ) సంబోధన పదాలు: ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించేటప్పుడు వాడే పదాలు 'సంబోధన' పదాలు.

ఉదాహరణలు:-

1. ఒక వ్యక్తి తన చెల్లెలితో సంభాషించేటప్పుడు 'సోదరి' అని వాడుతారు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించేటప్పుడు 'నాన్న' అని వాడతారు.

బి) అన్వయ పదాలు: ఒక వ్యక్తి మూడో వ్యక్తితో ఒకానొక తన బంధువు గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే బంధుత్వ పదమే 'అన్వయ పదం'.

ఉదాహరణకు ఒక వ్యక్తి తన నాన్న సోదరుని గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు మా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. అంటే 'చిన్నాన్న' అన్వయ పదం.

వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రాథమిక పదాలు కలిసినందు వల్ల ఒక కొత్త పదం ఏర్పడినప్పుడు దానిని వివరణాత్మక పదం అంటారు. ఉదాహరణకు నాన్న+అమ్మ=నాన్నమ్మ.

బంధుత్వం ఆచరణలు(కిన్‌షిప్ యూసేజెస్): బంధు సమూహాలలో వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వాలు ఉంటాయి. ఒక్కో రకమైన బంధుత్వం ఒక్కో రకమైన ప్రవర్తనను తెలియజేస్తుంది. సమాజం మొతమ్మీద చూస్తే... బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. వాటిలో ఆరు ప్రధానమైనవి. అవి... పరిహాస సంబంధాలు, వైదొలుగు నడవడి, మాతులాధికారం, పితృష్వాధికారం, సాంకేతిక సంబోధన, కుహనా ప్రసూతి.



జి.వీరా స్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ.

మద్రాస్ ఐఐటి, డేకిన్ వర్సిటీ ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీ

మద్రాస్ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డేకిన్ యూనివర్సిటీ కలిసి ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీని ఆరంభించాయి. 'ఐఐటీ మద్రాస్ డేకిన్ యూనివర్సిటీ రీసెర్చ్ అకాడమీ'గా మలిచారు. ఉమ్మడి పర్యవేక్షణ, మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్‌తో గ్లోబల్ రీసెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. సార్క్ అలాగే ఆసియన్ దేశాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు- ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించే దిశగా పరిశోధనలు చేస్తారని మద్రాస్ ఐఐటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీస్, క్లయిమేట్ చేంజ్, హెల్త్‌కేర్ టెక్నాలజీస్ తదితరాలకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు విశిష్ట సంస్థలు ఉమ్మడిగా నాలుగేళ్ళ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తాయి. ఇందులో భాగంగా ముప్పయ్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. పరిశోధనలు మరింత అర్థవంతంగా ఉండేందుకుగాను అకడమిక్, ఇండస్ట్రీ నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు. తమ పరిశోధకులకు ఇచ్చేందుకు డేకిన్ వర్సిటీ పది, ఐఐటీ మద్రాస్ ఇరవై స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేశాయి.



వెబ్‌సైట్స్: https:// www.iitm.ac.in/ www.deakin.edu.au/



రాజెవరు?


అనగనగా ఒక రాజు. ఆ రాజుకు వారసులు లేరు. దీంతో బంధువులకు కాకుండా బయట ప్రతిభ గల రాజ వంశీయులకు రాజ్యాధికారాన్ని అప్పచెప్పాలనుకున్నాడు. ఇతను పిచ్చివాడన్నారు బంధువులు. రాజుగారు యువరాజును ఎంపిక చేసే సభకు రావాలిసిందిగా దేశమంతా దండోరా వేయించారు. అందరూ సభకు వచ్చారు. ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాజు రానే వచ్చాడు. ముగ్గురు యువకులను ప్రవేశపెట్టండి మహామంత్రిగారూ అన్నారు గట్టిగా. ఆ ముగ్గురు యువకులు వచ్చి నిలబడ్డారు.

రాజుగారు అటూ ఇటూ చూశారు. సభలో నిశ్శబ్దం. 'జీవితానికి ఆనందం అవసరం. అదే అంతిమ పరమావధి. అది లేకుంటే జీవితం నిస్సారం అవుతుంది. మనకు కళలు అవసరం. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలను కళల అభివృద్ధి కోసం కేటాయించిన సూరసేనుణ్ణి అభినందిస్తున్నా' అన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు. సూరసేనుణ్ణి తన స్నేహితులు, సభికులు మెచ్చుకున్నారు.


ఆ తర్వాత చంద్రసేనుణ్ని చూస్తూ.. 'రాజ్యం ప్రశాంతంగా ఉండాలి. అప్పుడే ఆనందం. హాయిగా ఉండే ప్రజలున్నప్పుడే రాజు బావున్నట్లు. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలతో యుద్ధ విద్యలు నేర్చుకున్న ఇతడు గొప్పవాడు' అన్నాడు. అందరూ చప్పట్లు. 'ఇలాంటి వారు ఉన్నప్పుడు శత్రు రాజుల గుండెల్లో భయం పరిగెడుతుంది' అన్నాడు. అందరూ హోరున చప్పట్లు.

రాజుగారు మూడో వ్యక్తిని చూశాడు. అతని పేరు వీరసేనుడు. 'రాజు అనేవాడు గురువు లాంటి వాడు. తండ్రిలాంటి వాడు. ప్రజలకు కూడు, గూడు, గుడ్డను ఇవ్వాలి. నేను కృష్ణగిరి ప్రాంతం వెళ్లి చూశాను. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. నేను ఇచ్చిన ఇరవై వేల బంగారు నాణేలను డెబ్బయ్ వేల బంగారు నాణేలుగా చేసిన ఇతడే మన దేశానికి కాబోయే రాజు' అని ప్రకటించాడు. సభ చప్పట్లతో దద్దరిల్లింది. రాజుగారి తెలివికి అందరూ సంతోషపడ్డారు.


దారి కనుక్కోండి




చుక్కలు కలిపి బొమ్మ గీయండి



సరైన నీడ ఏది?



రంగులు వేయండి



డైలీ సుడోకు - 199

							2	8
		2	5		3	1		9
		1	9			3		
7				6				
	1						4	
				5				2
		4			6	9		
9		5	3		1	2		
3	6							

సుడోకు - 198 సమాధానం

2	9	8	7	1	6	4	5	3
1	4	7	8	5	3	6	2	9
3	5	6	4	9	2	8	1	7
5	8	4	6	3	9	1	7	2
7	2	1	5	8	4	3	9	6
9	6	3	1	2	7	5	4	8
4	7	5	9	6	8	2	3	1
8	1	2	3	7	5	9	6	4
6	3	9	2	4	1	7	8	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.